ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 14.06.2025 | సంపుటి : 11 సంచిక : 326 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## విద్యా ప్రమాణాలు పెంచాలి
# చక్కటి భాష రావాలి



### ప్రభుత్వ పాఠశాలల్లో గురుకుల విద్యా నైపుణ్యాలు

- విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి

- ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభం
- హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో పాఠశాలలు ఏర్పాటు
- పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే తమ లక్ష్యం
- విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పించేలా బోధన
- అందుకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు

**హైదరాబాద్: (జనంసాక్షి) :**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను ఉన్నతీకరించడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులకు శిక్షణ, మరియు ఇతర సౌకర్యాల కల్పనకు ఎంత ఖర్చైనా వెనకాడబోమని ఆయన హామీ ఇచ్చారు. ఈ ఏడాది రాష్ట్రంలో 20 మందికి మించి విద్యార్థులున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 571 కొత్త పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. శుక్రవారం ఐసీసీసీలో విద్యా శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులకు ఆదేశించారు. బోధన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాభివృద్ధి కల్పించేలా విద్యా వ్యవస్థను సంస్కరించాలని ఆదేశించారు. హైస్కూల్ స్థాయి నుంచే నైపుణ్య శిక్షణ అందిస్తే, భవిష్యత్తులో విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

#### పాఠశాలల స్థాపన, సౌకర్యాలపై దృష్టి

తెలంగాణలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో, విద్యా శాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకొని హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్‌లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలను ఏర్పా టు చేయాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల కింద ఇంటర్మీ డియట్ వరకు ఉన్న విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి, ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన భోజనం, యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాల కల్పనతో గురుకుల పాఠశాలల వైపు విద్యార్థుల ఆకర్షణ పెరుగుతోందని, డే స్కాలర్స్‌కు కూడా ఈ సదుపాయాలను అందించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. విద్యార్థులకు కుటుంబం, సమాజం పట్ల బాధ్యతలను వివరించే కౌన్సెలింగ్ అందిస్తే, వారు మానసికంగా దృఢంగా మరియు బాధ్యతాయుత పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు.



## పాత పగతో ఇరాన్‌పై
# ఇజ్రాయెల్ దాడి

### పెదవులపై 'అణుబూచీ'.. లోపల విద్వేషం

#### అణు సంక్షోభంతో భగ్గుమన్న ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు

- ఇజ్రాయెల్ అపరేషన్ రైజింగ్ లయన్
- అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ మెరుపుదాడులు
- హర్మోజ్ జలసంధి ఆందోళనలు
- పెరగనున్న చమురు ధరలు
- శాంతి కోసం అంతర్జాతీయం పిలుపు
- డ్రోన్ దాడులతో ఇరాన్ ప్రతీకారం
- గ్లోబల్ స్టాక్ మార్కెట్ల ఆర్థిక అస్థిరత

*ఇజ్రాయెల్ శుక్రవారం ఇరాన్‌లోని అణు కేంద్రాలు, ప్రముఖ శాస్త్రవేత్తలపై మెరుపుదాడులు చేసి, దశాబ్దాల శత్రుత్వాన్ని అణు సంక్షోభంగా మార్చింది. ఈ దాడులతో ఇరాన్ సైనిక, అణు సామర్థ్యం గణనీయంగా దెబ్బతినడంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి.*


ఇజ్రాయెల్ దాడుల్లో కూలిన భవనం

**సిరియా (జనంసాక్షి) :**
దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న ఇజ్రాయెల్-ఇరాన్ శత్రుత్వం శుక్రవారం జరిగిన మెరుపుదాడులతో కొత్త రూపం దాల్చింది. ఇరాన్‌లోని అణు కేంద్రాలు మరియు ప్రముఖ శాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మేజర్ జనరల్ హొస్సేన్ సలామీ, న్యూక్లియర్ సైంటిస్ట్ డాక్టర్ ఫెరెయుద్దీన్ అబ్బాసీ, షహీద్ బెహ్షతీ విశ్వవిద్యాలయంలో న్యూక్లియర్ ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ అబ్దుల్ హమీద్ మినౌచెహర్ వంటి కీలక వ్యక్తులు ఈ దాడుల్లో మరణించారు. ఈ రెండు దేశాల మధ్య శత్రుత్వం ఎందుకు, ఎప్పటి నుంచి కొనసాగుతోంది?
ఇజ్రాయెల్,ఇరాన్ మధ్య శత్రుత్వం 1979లో ఇరాన్‌లో జరిగిన ఇస్లామిక్ విప్లవం నాటి నుంచి మొదలైంది. ఈ విప్లవం తర్వాత ఇరాన్ షా మహ్మద్ రెజా పహ్లావీ పాలనలో అమెరికా, ఇజ్రాయెల్‌ను ప్రధాన శత్రువులుగా గుర్తించింది. అప్పటి నుంచి ఈ శత్రుత్వం కొనసాగుతోంది. గత 20 ఏళ్లుగా ఇజ్రాయెల్ ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తోందని ఆరోపిస్తోంది. అయితే, ఇరాన్ తమ అణు కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమేనని వాదిస్తోంది.
అయినప్పటికీ, ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ ఇరాన్ వద్ద అణ్వాయుధాల తయారీకి సరిపడా యురేనియం నిల్వలు ఉన్నాయని హెచ్చరించింది. 2003 వరకు ఇరాన్ వ్యవస్థీకృత అణ్వాయుధ

మిగతా 3,9లో..

# ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి బంగారం

**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :**
పసిడి ప్రియులకు బ్యాడ్ న్యూస్.. రాకెట్ వేగంతో దూసుకుపోతున్న బంగారం ధరలు తాజాగా ఆల్-టైమ్ రికార్డు స్థాయికి చేరుకున్నాయి. శుక్రవారం బంగారం ధరలు భారీగా పెరిగాయి. దీంతో తులం బంగారం ధర లక్ష రూపాయలు దాటింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,950 పెరగగా.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.2,120 పెరిగింది. దీంతో హైదరాబాద్ మార్కెట్ లో బంగారం ధరలు ఇలావున్నాయి. హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 92,950 చేరుకోగా.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,400కు పెరిగింది. దీంతో తొలిసారి గోల్డ్ రేటు- లక్ష రూపాయలకు చేరుకుంది. ఇక ఏపిలోని విజయవాడ, విశాఖపట్నంలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కేజీ వెండి ధరపై 1,100 రూపాయలు పెరిగి.. 1,20,000కు చేరుకుంది.



# కొమ్మినేనికి సుప్రీంలో ఊరట



- బెయిల్ మంజూరు చేసిన ధర్మాసనం
- జాగ్రత్తగా వ్యాఖ్యలు చేయాలని సూచన

**న్యూఢిల్లీ, జూన్13 (జనంసాక్షి) :**
అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీం కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రిమాండ్‌లో ఉన్న ఆయన బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కింది కోర్టులో బెయిల్ కోసం కొమ్మినేని దరఖాస్తు చేసుకున్నారు. అయితే అక్కడ ఆయన బెయిల్ పిటీషన్ పెండింగ్‌లో ఉండగానే సుప్రీంకోర్టును

మిగతా 2లో..



## రైతు భరోసాపై
# వెనక్కి తగ్గం

### ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా అభివృద్ధి, సంక్షేమం ఆగదు

- కులగణన చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిన రేవంత్ రెడ్డి
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుంది
- ఖమ్మం పర్యటనలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**ఖమ్మం, జూన్ 13 (జనంసాక్షి) :**
ఖమ్మం: ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ రైతు భరోసా కార్యక్రమంలో వెనుకడుగు వేయబోమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
శుక్రవారం రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల పర్యటించారు. రేగులచలక, కోయచెలక గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రఘునాథపాలెం మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా కులగణన చేసిన నాయకుడని, రాహుల్ గాంధీ పాదయాత్ర ద్వారా కులగణనకు ప్రేరణనిచ్చిన

మిగతా 2లో..

## సీటు విరిగి..
# బతికిపోయా..



### అంతా క్షణాల్లో జరిగింది.. ఎలా బతికానో తెలియదు

#### మృత్యుంజయుడు రమేశ్ విశ్వాస్ వెల్లడి
**ఆస్పత్రిలో రమేశ్‌ను పరామర్శించిన ప్రధాని మోడీ**

**అహ్మదాబాద్, జూన్ 13 (జనంసాక్షి) :**
అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం యావద్దేశాన్ని విషాదంలో ముంచెత్తింది. టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలపై ఏఐ-171 విమానం కుప్పకూలడంతో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. జరిగిందేమిటో తెలుసుకునే లోపు అందరి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. అయితే ఒక్కరు మాత్రం ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయపడి మృత్యుంజయుడుగా నిలిచారు. ఆ భయానక అనుభవాన్ని మీడియాతో పంచుకున్నారు. విమానం కూలిపోయిన భయానక క్షణాలను తలుచుకుని భారత సంతతికి చెందిన 40 ఏళ్ల బ్రిటిష్ పౌరుడు రమేష్ విశ్వాస్ కుమార్ రమేష్ చిగురుటాకులా వణికిపోయారు. ప్రస్తుతం ఆసుపత్రులో ఆయన చికిత్స పొందుతున్నారు. అకస్మాత్తుగా భవంతిలోకి విమానం దూసుకుపోయి పేలిపోయిందని, సెకండ్లలోనే అంతా జరిగిపోయిందని తెలిపారు. తన సీటు సమీపంలో భారీ డ్యామేజ్ జరిగిందని అన్నారు. సీటు ఊడిపోవడం తో పక్కకు పడడంతో తాను బతికానని అన్నారు. అనూహ్య రీతిలో ప్రాణాలతో బయటపడ్డారు విశ్వాస్ కుమార్ రమేశ్. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. ప్రమాద క్షణాలను గుర్తుచేసుకున్నారు. విమానం కూలగానే తాను కూర్చున్న సీటు-ఊడి పడిందని, అందువల్లే తాను బతికిబయట పడ్డానన్నారు. నేను విమానం నుంచి దూకలేదు. టేకాఫ్ అయిన కాసేపటికే విమానం

మిగతా 2లో..



### తెలంగాణలో మరో ఐదు రోజులు భారీ వర్షాలు

- చురుకుగా కదులుతున్న రుతుపవనాలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి సూచన

### ఇప్పటికైనా అణు ఒప్పందం కుదుర్చుకోండి
**ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**



# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

### నా నోటీసులు అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్

- ఎసిబి కేసుల్లో నిజాలు తేలుద్దామా ? • లైడిటెక్టర్ పరీక్షకు సిఎం రేవంత్ సిద్ధమా? : కేటీఆర్



**ఎసిబి నోటీసులు ముమ్మాటికీ కక్షసాధింపే**
- యధేచ్ఛగా దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

2

**హైదరాబాద్, జూన్ 13 (జనంసాక్షి) :**
సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైరయ్యారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రి ప్రజల దృష్టి మరల్చేందుకు పూటకో వేషం వేస్తున్నాడు.. రోజుకో కుట్ర చేస్తున్నాడు..ఫార్ములా ఈ రేసు నిర్వహణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం, బ్యాంకు ద్వారా పంపిన 44 కోట్ల రూపాయలు ఇప్పటికీ ఫార్ములా ఈ సంస్థ అకౌంట్ లోనే ఉన్నా, వాటిని వెనక్కి రప్పించడం చేతకాని ముఖ్యమంత్రి మరోసారి ఏసీబీ నోటీసులు పంపాడు. చట్టాలను గౌరవించే పౌరుడిగా, తప్పకుండా సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ విచారణకు హాజరవడంతోపాటు.. విచారణకు అన్నివిధాలుగా సహకరిస్తానని మాటిస్తున్నాను. అయితే, పదేళ్ల క్రితం నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్ల బ్యాగుతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రేవంత్ రెడ్డి కేసు కూడా ఇదే ఏసీబీ పరిధిలో పెండింగ్‌లో ఉంది. ఇద్దరిపై కూడా ఏసీబీ కేసులున్న నేపథ్యంలో.. ఇద్దరిలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చేందుకు జడ్జి సమక్షంలో లైవ్ టెలివిజన్ సాక్షిగా లై డిటెక్టర్ టెస్టును ఎదుర్కొనే దమ్ము, ధైర్యం ఈ పిరికి ముఖ్యమంత్రికి ఉన్నదా? అని ప్రశ్నించారు. ఓవైపు మీ దివాళాకోరు విధానాలతో రాష్ట్ర ఖజానా ఖాళీ అని ఓ ముఖ్య మంత్రిగా నిస్సిగ్గుగా మీ అసమర్థతను

మిగతా 2లో..



## బోయింగ్ విమానాల్లో
# భద్రతా తనిఖీలు

- పరిశీలించి సమగ్రనివేదిక ఇవ్వండి
- ఎయిర్ ఇండియాకు డిజిసిఎ ఆదేశాలు

**అహ్మదాబాద్, జూన్13 (జనంసాక్షి) :**
ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. అన్ని బోయింగ్ 787 విమానాల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని ఎయిరిండియాను ఆదేశించింది. ఈ మేరకు

మిగతా 2లో..

# సీటు విరిగి... బతికిపోయా



ముక్కలైంది. నా సీటు విరిగిపోవడం తో దూరంగా ఎగిరిపడ్డా. అందుకే విమానంలో చెలరేగిన మంటలు నాకు అంటుకోలేదని విశ్వాస్ కుమార్ చికిత్స సమయంలో వైద్యులకు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆయన శరీరంపై పలుచోట్ల గాయాలు అయ్యాయి. వాటినుంచి కోలుకుంటున్న ఆయన తాజాగా మీడియాతో మాట్లాడారు. అంతా నా కళ్ల ముందే జరిగింది. ఎలా బతికానో నాకే అర్థం కాలేదు. విమానం కింద పడగానే నేను కూడా చనిపోయానని అనుకున్నా. కళ్లు తెరిచి చూసేసరికి హాస్టల్ భవనం శిథిలాల్లో ఉన్నా. శిథిలాల నుంచి మెల్లగా నడుచుకుంటూ వెళ్లా. మంటల ధాటికి నా ఎడమ చేయికి గాయమైంది' అని విశ్వాస్ తెలిపారు. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ ప్రయాణికుడిని శుక్రవారం ప్రధాని మోదీ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విశ్వాస్‌కు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్‌కుమార్.. గుజరాత్‌లోని తన కుటుంబానికి కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఈ ఘటన చోటు-చేసుకుంది. ప్రమాదం జరిగిన ఎయిరిండియా విమానంలోని 11-ఏ సీటులో విశ్వాస్ కుమార్ కూర్చున్నారు. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. ఆ దృశ్యాలు వైరల్‌గా మారాయి. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో విమానంలోని 241 మంది ప్రాణాలు కోల్పోగా.. విశ్వాస్ ఒక్కడే మృత్యుంజయుడిగా బయటపడ్డారు. ఈ ప్రమాదం వల్ల బీజే వైద్య కళాశాల వసతిగృహంలో మరో 24 మంది మృతి చెందారు.

### విజయ్ రూపానీతో కలిసి పనిచేశాం : ప్రధాని మోదీ

గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కుటుంబాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందర్శించి పరామర్శించారు. గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో విజయ్ రూపానీ మరణించిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదం నేపథ్యంలో గుజరాత్‌కు వెళ్లిన ప్రధాని మోదీ, ప్రమాద స్థలాన్ని పరిశీలించి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయపడినవారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయ్ రూపానీ నివాసానికి వెళ్లి, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధాని మాట్లాడుతూ, విజయ్ రూపానీ మన మధ్య లేరన్న వాస్తవాన్ని ఊహించడం కష్టమని, దశాబ్దాలుగా తమ మధ్య సన్నిహిత సంబంధం ఉందని, భుజం భుజం కలిపి కలిసి పనిచేశామని గుర్తు చేసుకున్నారు. సవాళ్లతో కూడిన సమయాల్లోనూ విజయ్ రూపానీ వినయంతో, కఠోర శ్రమతో పనిచేసేవారని కొనియాడారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్, రాజ్యసభ ఎంపీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, క్యాబినెట్ మంత్రి, ముఖ్యమంత్రిగా వివిధ బాధ్యతలను నిర్వర్తించిన రూపానీ, ప్రతి పాత్రలోనూ తనదైన ప్రతిభను చాటారని మోదీ పేర్కొన్నారు.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

చాటుకుంటున్న ఈ తరుణంలో.. విచారణల కోసం ప్రజాధనాన్ని వృథా చేయడం మానుకుని, వెంటనే లై డిటెక్టర్ టెస్టుకు సీఎం రేవంత్ సిద్ధం కావాలని పేర్కొన్నారు. కేటీఆర్‌కు తాజాగా ఏసీబీ నోటీ-సులు జారీ చేసింది. ఫార్ములా ఈ కారు రేసు కేసులో జూన్ 16న విచారణకు హాజరు కావాలంటూ నోటీసుల్లో పేర్కొంది. ఆ నోటీసులపై కేటీఆర్ స్పందించారు. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌పై దుయ్యబట్టారు.

ఫార్ములా-ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేయడాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఖండించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. కాంగ్రెస్ సర్కార్ మళ్లీ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మీరు ఎన్ని కుట్రలు పన్నినా మీ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతాం అని పేర్కొన్నారు. ఫార్ములా ఈ కేసులో ఈనెల 16న విచారణకు రావాలని అవినీతి నిరోధక శా(ఏసీబీ) మరోసారి కేటీ-ఆర్‌కు నోటీ-సులు జారీ చేసింది. మే 26నే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని గతంలో ఏసీబీ నోటీ-సులు ఇచ్చింది. విదేశీ పర్యటన షెడ్యూల్ ఉందని.. తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీ-ఆర్ సమాధానం ఇచ్చారు. దీంతో తాజాగా ఇప్పుడు విచారణకు హాజరు కావాలని కేటీ-ఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు ఇచ్చింది.

# కొమ్మినేనికి సుప్రీంలో ఊరట

ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ పీకే మిశ్రా ధర్మాసనం బెయిల్ మంజూరు చేస్తూ.. వెంటనే విడుదల చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే మరోసారి అమరావతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయవద్దని కొమ్మినేనికి సుప్రీం ధర్మాసనం సూచించింది. భవిష్యత్తులో మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. కింది కోర్టు విధించిన షరతులకు లోబడే బెయిల్ మంజూరీ చేస్తున్నామని పేర్కొంది. విచారణకు సంబంధించిన అన్ని నిబంధనలు ట్రయల్ కోర్టు ఇస్తుందని న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం స్పష్టం చేసింది. కొమ్మినేని నిర్వహించిన లైవ్ డిబేట్‌లో అమరావతి దేవతల రాజధాని కాదు... వేశ్యల రాజధాని అని కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారు. కొమ్మినేని ఆయనను వారించకుండా చర్చను కొనసాగించారు. దీనిపై రాజధాని ప్రాంతం సహా రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకాయి. మహిళలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తున్నా.. ఆ ఇద్దరు గానీ, సాక్షి యాజమాన్యం గానీ కనీసం క్షమాపణలు చెప్పలేదు. ఈ క్రమంలో రాజధాని ప్రాంత దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష తుళ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు- పలు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం తుళ్లూరు పోలీసులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కాలనీకి వెళ్లి కొమ్మినేని నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం మంగళగిరి కోర్టులో కొమ్మినేనిని హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ కేసులో మరో జర్నలిస్ట్ కృష్ణంరాజుకు కూడా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

# బోయింగ్ విమానాల్లో భద్రతా తనిఖీలు

తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అహ్మదాబాద్-గాట్విక్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి గురైన దృష్ట్యా.. బోయింగ్ విమానాల్లో మెరుగైన భద్రతా తనిఖీలు చేయాలి. సంబంధిత ప్రాంతీయ డీజీసీఏ కార్యాలయాల సహకారంతో తక్షణమే వీటిని చేపట్టాలని ఎయిరిండియాను డీజీసీఏ ఆదేశించింది. విమానాలు బయలుదేరే ముందు ఇంధనం పర్యవేక్షణ, క్యాబిన్ ఎయిర్ కంప్రెసర్, ఎలక్ట్రానిక్ ఇంజిన్ నియంత్రణ వ్యవస్థ, హైడ్రాలిక్ వ్యవస్థ, టేకాఫ్ ప్రమాణాల పునఃపరిశీలన వంటి తనిఖీలు తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేసింది. వీటితోపాటు- ÷-ఫ్లైట్ కంట్రోల్ ఇన్‌స్పెక్షన్‌ను ప్రవేశపెడుతున్నామని, ఇంజిన్ సామర్థ్యాలకు సంబంధించిన తనిఖీలను రెండు వారాల్లో పూర్తిచేయాలని ఎయిరిండియాకు సూచించింది. బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానాల్లో గత పదిహేను రోజుల్లో తరచూగా సంభవించిన సమస్యలను వీలైనంత త్వరగా సమీక్షించుకోవాలని సూచించింది. సమీక్ష తర్వాత నిర్వహణ చర్యలను ముగించాలని తాజా ఆదేశాల్లో పేర్కొంది. సంబంధిత తనిఖీల నివేదికను డీజీసీఏకు అందజేయాలని సూచించింది. గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. బోయింగ్ కంపెనీకి చెందిన 787 డ్రీమ్‌లైనర్ విమానం క్రాష్ అయ్యింది. ఈ ప్రమాదంలో 241 మంది మృతిచెందగా ఒకే ఒక్క ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డాడు. విమాన ప్రమాదం వందలాది కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో భారత పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన బోయింగ్ విమానాలను తనిఖీ చేసి రిపోర్ట్ అందజేయాలని ఆదేశించింది. గత 15 రోజుల్లో బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానాలలో వచ్చిన పునరావృత సాంకేతిక లోపాలు (స్నాగ్‌లు) సమీక్షించాలని, వాటికి సంబంధించిన అన్ని నిర్వహణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కూడా ఆదేశాలు జారీ చేసింది.

# ఎసిబి నోటీసులు ముమ్మాటికీ కక్షసాధింపే

**హైదరాబాద్,జూన్13(జనంసాక్షి) :**ఫార్ములా ఈ కార్ల రేసింగ్ వ్యవహారంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపే తప్ప మరొకటి కాదని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎంఎల్‌ఎ హరీష్‌రావు ఎక్స్ వేదికగా ఆరోపించారు. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ రెడ్డి దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారని అనడానికి కెటిఆర్‌కు ఇచ్చిన తాజా నోటీసులే నిదర్శనం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కెటిఆర్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే రేవంత్ రెడ్డి నోటీసులు పంపించారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 18 నెలల పాలనలో డైవర్షన్ పాలిటిక్స్‌ను అమలు చేస్తూ బిఆర్‌ఎస్‌ను బద్నామ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రేవంత్ రాజకీయ అరాచకత్వం గెలిచే ప్రసక్తే లేదని, రేవంత్ రెడ్డి డ్రామా, డైవర్షన్ రాజకీయాలు ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యాయని పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌తో తెలంగాణ ప్రతిష్ట పెరిగిందని, పెట్టు-బడులు కూడా వచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రతిష్ట పెంచినందుకా కెటిఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం నోటిసుల ప్రతాపం..? అని ప్రశ్నించారు. 2000లో చంద్రబాబు ఫార్ములా వన్ కోసం కృషిచేసి నిర్వహించలేకపోయారని, అలాంటిది బిఆర్‌ఎస్ ప్రభుత్వం,కెటిఆర్ కృషి వల్ల ఫార్ములా వన్ వంటి ప్రతిష్టాత్మక రేస్‌ను భారతదేశానికి అందులోనూ హైదరాబాద్‌కి తీసుకొని వచ్చారని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తెలంగాణను మార్చేందుకు ఫార్ములా ఈ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించి పెట్టు-బడులను ఆకర్షించారని, అమర్ రాజా వంటి కంపెనీలు పెట్టు-బడి పెట్టేందుకు ముందుకు వచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించి రాష్ట్ర పరువును, దేశ పరువును మంటకలిపిందని మండిపడ్డారు. అందాల పోటీ-తో లాభం లేదు కానీ రాష్ట్ర పరువు మాత్రం తీశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపినందుకు, రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నందుకు కెటిఆర్‌కి ఎసిబి నోటీసులు ఇచ్చిందని స్పష్టమవు తున్నదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని రకాలుగా వేధించినా ఆయన వైఫల్యాలను ఎండగట్టడం మాత్రం బిఆర్‌ఎస్ ఆపదు అని హరీష్‌రావు స్పష్టం చేశారు.

# ఇప్పటికైనా అణు ఒప్పందం కుదుర్చుకోండి

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను మరోసారి అణు ఒప్పందంపై హెచ్చరించారు. దౌత్య మార్గాల ద్వారా అణు సమస్యను పరిష్కరించుకోవాలని అమెరికా కట్టుబడి ఉందని, దాడులతో విధ్వంసం తప్ప మరేమీ సాధించలేరని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చలు జరపడానికి అమెరికా ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ, టెహ్రాన్ అంగీకరించలేదని, పరిస్థితి చేయి దాటకముందే ఒప్పందం కుదుర్చుకోవాలని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా సూచించారు.

ఇజ్రాయెల్ ఇరాన్‌పై చేసిన తాజా దాడుల నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ, అమెరికా ప్రపంచంలోనే అత్యుత్తమ, ప్రాణాంతక సైనిక సామగ్రిని తయారు చేస్తోందని, వాటిలో చాలావరకు ఇజ్రాయెల్ వద్ద ఉన్నాయని, వాటిని ఎలా ఉపయోగించాలో ఆ దేశానికి బాగా తెలుసని హెచ్చరించారు. ఇరాన్ నాయకులు తన సూచనలను పట్టించుకోకుండా ధైర్యంగా మాట్లాడుతున్నారని, కానీ భవిష్యత్‌లో ఏం జరుగుతుందో వారికి తెలియదని ఆయన అన్నారు. ఇప్పటికే ఇరాన్‌లో భారీ విధ్వంసం, ప్రాణనష్టం జరిగాయని, ఈ మారణహోమం మరింత తీవ్రమయ్యే ముందు ఒప్పందం కుదుర్చుకుంటే మరణాలు, నష్టాలు తప్పుతాయని ట్రంప్ సూచించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ట్రంప్ స్వాగతించారు. ఇజ్రాయెల్ దాడులు అద్భుతంగా ఉన్నాయని, అమెరికా ఇరాన్‌కు ఒప్పందం కోసం అవకాశం ఇచ్చినప్పటికీ, టెహ్రాన్ దానిని తిరస్కరించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దాడుల తీవ్రత ఇరాన్ ఊహించిన దానికంటే ఎక్కువగా ఉంటుందని, తిరస్కారాలకు పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పరోక్షంగా హెచ్చరించారు. అయితే, ఈ యుద్ధంలో అమెరికా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వామ్యం అవుతుందా అన్న ప్రశ్నకు ట్రంప్ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు.

# అక్రిడేషన్ పాలసీని సరళీకృతం చేయాలి

### వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు సంజయ్

**హైదరాబాద్,జూన్13(జనంసాక్షి) :** తెలంగాణలో జర్నలిస్టుల అక్రిడేషన్ల విధివిధానాలను వెంటనే ప్రకటించి, అర్హులైన వారందరికీ వీలైనంత త్వరగా కార్డులు ఇవ్వాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ డిమాండ్ చేశారు. అక్రిడేషన్ పాలసీని సరళీకృతం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఏడాది నుంచి ఈ అంశాన్ని తేల్చకపోవడం సమంజసం కాదన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు- చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పటిష్ఠమైన ఇన్సూరెన్స్, ఆసుపత్రులలో ఉచిత చికిత్స, ఆరోగ్య కార్డులు తదితర అంశాలతో పాటు- తెలంగాణ పాత్రికేయుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి త్వరలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు- సంజయ్ పేర్కొన్నారు. రైళ్లు, విమానాల టికెట్లలో జర్నలిస్టులకు రాయితీ ఇవ్వాలని, టోల్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని తాము పోరాడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబరులో దిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించి, ఈ అంశాలను ప్రధాని నరేంద్ర మోదీకి విన్నవిస్తామని చెప్పారు. జర్నలిజం ప్రింట్ మీడియా నుంచి మొదలై వివిధ రూపాలకు విస్తరించినందున పాత చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ పక్రియలో పాత్రికేయులకూ భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, గెజిటెడ్ అధికారులకు కల్పించే సౌకర్యాలను జర్నలిస్టులకు వర్తింపజేయాలన్నారు. ప్రస్తుతం దేశంలోని 16 రాష్ట్రాల్లో తమ పాత్రికేయుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో తమ సభ్యులు ఉన్నారని సంజయ్ ఉపాధ్యాయ తెలిపారు. జాతీయ స్థాయిలో బీఎంఎస్‌కు అనుబంధంగా పనిచేస్తున్నామని, త్వరలో నేపాల్‌కు కూడా విస్తరించబోతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అనిల్ దేశాయ్, సిద్ధిరెడ్డి శ్రీనివాసరెడ్డి , కార్యదర్శి క్రాంతి, హైదరాబాద్ సిటీ- అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానం-2020, మీడియా పాత్ర అనే అంశంపై డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు- డబ్ల్యూజేఐ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఉత్తమ జర్నలిస్టులకు పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు- చెప్పారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

# ట్రంప్‌పై స్థానిక గవర్నర్లు అసంతృప్తి

### ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్న ఆందోళన

**వాషింగ్టన్:** ఎన్నికలకు ముందే వలస కార్మికులను పంపివేస్తానని ట్రంప్ వాగ్దానం చేశాడు. ఆ మేరకు ఇప్పుడు లాస్ ఏంజల్స్ నగరంలో చిచ్చు పెట్టాడు. సైన్యాన్ని వెనక్కు తీసుకోవాలని కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ డిమాండ్ చేశాడు, ట్రంప్ చర్య రాష్ట్ర సార్వభౌమత్వాన్ని హరించటమే అన్నాడు. శాంతి భద్రతలకు విఘాతం కలగాలని వాంఛిస్తున్న ట్రంప్‌కు అలాంటి అవకాశం ఇవ్వవద్దని పౌరులను కోరాడు. నగర మేయర్ కరేన్ బాస్ కూడా గవర్నర్‌ను సమర్ధిస్తూ ట్రంప్ చర్య అశాంతిని రెచ్చగొట్టినట్లు ఆమె వ్యాఖ్యానించారు. నగర కౌన్సిల్లోని 15 మంది సభ్యులు కూడా మిలిటరీ చర్యను ఖండించారు. వారి వైఫల్యం కారణంగానే తాను మిలిటరీని పంపినట్లు ట్రంప్ సమర్ధించుకున్నాడు. అమెరికన్ కమ్యూనిటీ సర్వే ప్రకారం వలస వచ్చిన వారు ఫెడరల్ ప్రభుత్వానికి 2022లో 383 బిలియన్ డాలర్లు, రాష్ట్ర, స్థానిక సంస్థలకు 196 బిలియన్ డాలర్లు రాబడి చేకూర్చారు. నమోదు కాని కార్మికులు, ఆదాయ, సామాజిక భద్రత పన్నులే మొత్తం వంద బిలియన్ డాలర్లకు పైగా ఉన్నాయి. చిత్రం ఏమిటంటే నిరుద్యోగ, ఆరోగ్య బీమా వారికి వర్తించకపోయినా పన్ను చెల్లించారు. 2033 నాటికి మరో 5.2 శాతం వలస కార్మికులు పెరుగుతారని వారి వలన ఏడు లక్షల కోట్ల డాలర్ల మేర తోడవుతుందని, జిడిపి 8.7 లక్షల కోట్ల డాలర్లు పెరగటంతో పాటు ఫెడరల్ ప్రభుత్వానికి తమకు ఎలాంటి హక్కులు లేకున్నా పన్నులు మాత్రం చెల్లిస్తున్నారు. వెట్టిచాకిరీ చేస్తున్నారు. అలాంటివారు అమెరికాలో భాగంగా అక్కడి ప్రజలు ఆమోదించారు. కానీ ట్రంప్ ఆలోచనలు చర్యలు వేరుగా ఉన్నాయి. విదేశీ చొరబాటుదార్లు, నేరగాళ్లు ఆక్రమించినట్లుగా ట్రంప్ ప్రచారం చేసుకుంటున్నాడు. వీరందరినీ పంపించివేయాలంటే ఏడాదికి 500 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతాయని, రానున్న పది సంవత్సరాలలో కార్మికుల కొరత ఏర్పడుతుందని, జిడిపి 5.1 లక్షల కోట్ల డాలర్లు తగ్గుతుందని తెలుసు. వలసదారులను బహిష్కరిస్తామని ట్రంప్ వాగ్దానం చేశాడు. మిలిటరీని దించటాన్ని డెమోక్రటిక్ పార్టీకి చెందిన 22 రాష్ట్రాల గవర్నర్లు ఒక ప్రకటనలో ఖండించారు. ట్రంప్ అధికార దుర్వినియోగం, దుర్మార్గమైన, విభజించే చర్య అన్నారు.

# మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారం

### సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు




**న్యూఢిల్లీ,జూన్13(జనంసాక్షి) :** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి సంబం ధించి ఇద్దరు వైద్యులు సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశారు. తక్షణమే సుమోటోగా విచారణ చేపట్టి, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబాలకు అహ్మదాబాద్‌లోని బిజె మెడికల్ కాలేజీ రెసిడెంట్ వైద్యులతో సహా ఒక్కొక్కరికి రూ.50 లక్షల మధ్యంతర పరిహారాన్ని వెంటనే ప్రకటించాలని, వెంటనే పంపిణీ చేయాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులు, విమానయాన నిపుణులు, ఆర్థికవేత్తలు, బీమా సంస్థల నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు- చేయాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. త్రివేణి కోడ్కనీ వర్సెస్ ఎయిర్ ఇండియా లిమిటెడ్ కేసులో సుప్రీంకోర్టు ఏర్పాటు- చేసిన సూత్రాల ప్రకారం.. బాధిత కుటుంబాలకు తుది పరిహారాన్ని ఈ కమిటీ నిర్ణయించాలని స్పష్టం చేశారు. దీనితో పాటు-, బాధిత కుటుంబాలు సుదీర్ఘ న్యాయ పక్రియ ద్వారా వెళ్ళాల్సిన అవసరం లేకుండా.. పరిహారం క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించడానికి ఎయిర్ ఇండియా లిమిటెడ్‌ను ఆదేశించాలని పిటిషన్ కోరారు. మృతులకు అర్హులైన బంధువులకు పునరావాస సహాయం, ఉపాధి అవకాశాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వానికి దిశానిర్దేశర చేయాలని పిటిషన్‌లో కోరారు. అలాగే.. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

# బిడ్డ కోసం కలలు కన్న యువకుడు

### పురిట్లోనే బిడ్డ మరణం తట్టుకోలేక ఆత్మహత్య

**నిజామాబాద్,జూన్13(జనంసాక్షి) :**జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓ యువకుడు ఆత్మహత్య కలకలం రేపుతోంది. సాయిలు అనే యువకుడు ఆస్పత్రి ఆవరణలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే సాయిలు బలవన్మరణానికి గల కారణాలు తెలిసి అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భర్త మరణంతో భార్య కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. అప్పుడే పుట్టిన బిడ్డ అనారోగ్యంతో మరణించడంతో ట్టుకోలేక పోయిన సాయిలు అనే యువకుడు ఉరేసుకుని ఆస్పత్రి ఆవరణలో మృతి చెందాడు. జిల్లాలోని జుక్కల్ మండలం మాహమ్మదా బాద్ గ్రామానికి చెందిన పానుగంటి సాయిలుకు కొద్ది నెలల క్రితం వివాహం జరిగింది. భార్య గర్భవతి కావడం, భార్యకు పురిటి నొప్పులు రావడంతో డెలివరీ కోసం ఆస్పత్రికి తీసుకొచ్చాడు. మరికొద్ది గంటల్లో తమకు బాబో, పాపో పుట్టబోతున్నారని ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ వారి ఆనందం ఎంతో సేపు నిలవలేదు. డెలివరీ తర్వాత వైద్యులు చెప్పిన విషయంతో సాయిలు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సాయిలు భార్యకు పండంటి మగ బిడ్డ జన్మించాడు. దీంతో కుటుంబసభ్యులతో పాటు సాయిల ఆనందం అంతా ఇంతా కాదు. కానీ బాబు పుట్టిన వెంటనే అనారోగ్య సమస్యతో మరణించాడు. ఈ విషయాన్ని సాయిలుకు చెప్పారు ఆస్పత్రి సిబ్బంది. పుట్టిన బిడ్డను చూడాలని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న యువకుడికి కుమారుడి మరణవార్త విని చలించిపోయాడు. తీవ్ర మనస్థాపానికి గురైన సదరు యువకుడు ఆస్పత్రి ఆవరణలోనే ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. విషయం తెలిసిన భార్య తీవ్రంగా విలపించింది. ఓ వైపు అప్పుడే పుట్టిన బిడ్డ, మరోవైపు కట్టుకున్న భర్త ఇలా బలవన్మరణం చెందడంతో ఆ భార్య బాధ వర్ణణాతీతం. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాయిలు మృతితో మహమ్మదాబాద్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# తెలంగాణలో మరో ఐదు రోజులు భారీ వర్షాలు



**హైదరాబాద్,జూన్13(జనంసాక్షి) :**
నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాహనాలపై వెళ్తున్న వాహనదారులు తడిసి ముద్దయ్యారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణగూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వరద చేరడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నైరుతి రుతుపవనాలు మరింత విస్తరించడంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి.. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజులపాటు- మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ విభాగం వెల్లడించింది. దక్షిణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురవచ్చని.. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. ఇవాళ ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండతో పాటు- వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. రుతుపవనాల ప్రభావంతో హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం కురిసింది. ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణ కంటే ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గోదావరి కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వీలైనంత వరకు ప్రాణ, ఆస్థి, ఆర్థిక నష్టం జరగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతా ల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించే దానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్ర స్థాయిలో ప్రధానంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్య లు, విపత్తుల నిర్వహణా విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డిజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంట ర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్ అండ్ బి, ఆరోగ్య శాఖల కమిషనర్లతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ- వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని కమిటీ- నివేదిక ప్రకారం చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

# మానసిక ఆరోగ్యానికి వన్ స్టాప్ వన్ సొల్యూషన్

### అమృత సంకల్ప్ క్లినిక్ ప్రారంభించిన కెటిఆర్




**హైదరాబాద్,జూన్13(జనంసాక్షి) :**
మానసిక ఆరోగ్యానికి వన్ స్టాప్ వన్ సొల్యూషన్ సరైన మార్గమని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లో అమృత సంకల్ప్ పేరుతో ఏర్పాటు చేసిన క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మానసిక అనారోగ్యాన్ని కేవలం అనారోగ్య సమస్యగా మాత్రమే కాదని, వెల్‌నెస్ లెన్స్ ద్వారా కూడా చూడాలని అన్నారు. ఈ మార్పునకు నాయకత్వం వహించడానికి డాక్టర్ సురేంద్ర ముందుకు రావడం ప్రశంస నీయమని కొనియాడారు. దీర్ఘకాలిక భావోద్వేగ స్థితిస్థాపకతను పెంపొందించడంతో పాటు- మానసిక అనారోగ్యానికి చికిత్స చేసే క్లినిక్ సమగ్ర విధానాన్ని ఆయన ప్రశంసించారు. మీ క్లినిక్ పిల్లలు, పెద్దలు, వృద్ధులకు క్రమబద్ధమైన సంరక్షణను అందిస్తుందని పేర్కొన్నారు. దీంతో ఒత్తిడి, ఆందోళన, నిరాశ, సంబంధ సమస్యలు, ఓసీడీ, వ్యసనంతో పాటు- మరింత తీవ్రమైన పరిస్థితులతో సహా విస్తృతశ్రేణి సమస్యలను పరిష్కరిస్తుందని అన్నారు. మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యంతో పాటు- ముఖ్యమైనదని కేటీ-ఆర్ అన్నారు. ప్రస్తుతం ఉన్న జీవనశైలి వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు- మానసిక ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యమైనదిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడుతోంది. కేవలం శారీరక బాధలు మాత్రమే కాకుండా, మానసిక రుగ్మతలు, సమస్యల విషయంలో కూడా ప్రజలు అవసరమైన వైద్యుల సహాయాన్ని పొందాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సందర్భంలో ఈ రోజు ప్రారంభించిన ఈ తరహా సౌకర్యాలు అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అనేక మానసిక సమస్యలను తల్లిదండ్రులకు, స్నేహితులకు చెప్పుకునే పరిస్థితి లేకపోవడం వల్ల... మానసిక నిపుణులు, మానసిక వైద్యుల సహకారంతో స్వాంతన పొందే అవకాశం కలుగుతుంది. మానసిక సమస్యలకు చికిత్స తీసుకోవడం అనేది అవమానకరం కాదనే విషయాన్ని సమాజం అర్థం చేసుకోవాలి. దీనిపై ఉన్న నెగటివ్ అభిప్రాయం మారాల్సిన అవసరం ఉంది.' అని కేటీఆర్ అన్నారు. మానసిక సమస్యల కారణంగా చాలామంది ఆత్మహత్య లాంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని.. ప్రాణం కోల్పోవడం కంటే మానసిక చికిత్స తీసుకోవడం ఎంతో సులభమనీ విషయం ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచించారు. అమృత సంకల్ప్ మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం, సమాజానికి తిరిగి ఇవ్వడం నా మార్గం అని డాక్టర్ సురేంద్ర అన్నారు. అమృత సంకల్ప్ అనేది కేవలం ఒక క్లినిక్ మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి, ఎలా పరిష్కరించాలి అనే దానిని పునర్నిర్మించడానికి ఇది ఒక ఉద్యమం అని తెలియజేశారు.

# రైతు భరోసాపై వెనక్కి తగ్గం

నాయకుడని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణతో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ పాలనలో దేశవ్యాప్తంగా రూ.70,000 కోట్ల రుణమాఫీ చేస్తే, తెలంగాణలో రూ.21,000 కోట్ల రుణమాఫీ పూర్తి చేశామని మంత్రి గుర్తు చేశారు. ఖమ్మం నగరం అభివృద్ధితో ఇతర జిల్లాల వారు ఇక్కడ స్థిరపడాలనే ఆలోచన చేసే స్థాయికి చేరుకుందని తెలిపారు. అధికార పార్టీ నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా ఎన్నికైతే ప్రజలకు సేవలు మరింత అందుబాటులో ఉంటాయని వివరించారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తన రాజకీయ లక్ష్యమని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. రైతు సంక్షేమం ప్రజాపాలన ధ్యేయమని, రైతుల రుణభారం తగ్గించేందుకు పాత రుణాల మాఫీ పూర్తయిందని తెలిపారు. గతంలో రైతు బంధు పేరిట ఇతర పథకాలు ఆపినా, ప్రస్తుతం వాటిని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ.36,000 కోట్లు జమ చేశామని వెల్లడించారు.

### నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు

నకిలీ విత్తనాల అమ్మకంపై కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్ట్ అమలు చేస్తామని మంత్రి హెచ్చరించారు. షిప్ ఆలస్యం వల్ల ఎరువుల సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యాయని, యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. యూరియా వాడకం తగ్గిస్తే పంటలకు ప్రపంచ మార్కెట్‌లో విలువ పెరుగుతుందని, ఈ విషయంలో కేంద్రానికి సలహా ఇచ్చామని తెలిపారు. పామాయిల్ ఉత్పత్తికి ప్రాముఖ్యత ఇస్తున్నామని, కొణిజర్లలో రిఫైనరీ, సీడ్ గార్డెన్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. వచ్చే సీజన్‌కు వెంసూర్, కొణిజర్లలో ఫ్యాక్టరీలు సిద్ధం చేస్తామని తెలిపారు. డ్రై ల్యాండ్ పంటలకు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని, తోటలు వేసిన రైతులకు కూడా రైతు భరోసా అందించే యోచనలో ఉన్నామని పేర్కొన్నారు. రైతు భరోసా మొత్తాన్ని రూ.5,000 నుంచి రూ.6,000కు పెంచినట్లు వివరించారు.

### తెలంగాణ వరి ఉత్పత్తిలో అగ్రస్థానం

తెలంగాణ వరి ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో ఉందని మంత్రి గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈటల రాజేందర్ ఆరోపణలకు స్పందిస్తూ, కమిషన్ రిపోర్ట్ వచ్చిన తర్వాత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, ప్రజాధనం దుర్వినియోగం కాకూడదని, అభివృద్ధి కొనసాగాలని అన్నారు. మార్కెట్ ఛైర్మన్ నియామకం ఎమ్మెల్యే పరిధిలో జరిగిందని స్పష్టం చేశారు. తెలంగాణలో మినిమం గ్యారెంటీ ధర అమలు కావాలని, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి ప్రధానిని కలిసి ఒత్తిడి తీసుకొస్తామని మంత్రి తెలిపారు. పనిచేసే కార్యకర్తలకు పార్టీలో పదవులు దక్కుతాయని, ప్రజాభిమానంతోనే అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమం, ఖమ్మం అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పునరుద్ఘాటించారు.

# కార్యకర్తలు సైనికుడిగా పని చేయాలి

- సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- మంత్రి సీతక్క



**కొత్తగూడ, జూన్ 13 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ,గంగారం మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ నుండి ప్రజా ప్రతినిధులు గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా ఐక్యత తో పని చేసి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సీతక్క అన్నారు.మండలం లోని ఎంచగూడ గ్రామానికి చెందిన జిట్టబోయిన రాములు, జున్ను రవీందర్, తుపాకుల ఎల్లయ్య లను కాంగ్రెస్ పార్టీ లోకి సాధనంగా ఆహ్వానించడం జరిగింది.అనంతరం మంత్రి మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా ఏజెన్సీ ప్రాంతంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు.ప్రధాన పంట వరి ధాన్యముకు ప్రతి క్వింటాకు 500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ దే.... 10 ఎకరాల లోపు రైతు భరోసా ప్రతి ఎకరాకు 12 వేల రూపాయలు.అర్హులైన వారందరికీ 200 ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు.పది ఏళ్లలో ఇవ్వని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వడం జరిగింది.ఇది నిరంతరం ప్రక్రియ దేవుని గుడి లేని ఊరు ఉండొచ్చు...ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదు...ఇందిరమ్మ అంటేనే ఇందిరమ్మ ఇల్లు .. మన ములుగు నియోజకవర్గానికి 5000 ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్న ఘనత మనదే అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో మరో అదనంగా 1000 ఇందిరమ్మ ఇండ్లు రావడం జరుగుతుంది.రానున్న సంస్థ గత ఎన్నికల్లో జడ్పిటిసిలు ఎంపీపీలు సర్పంచులు అత్యధికంగా విజయం సాధించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ఉత్సాహాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వజ్జ సారయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు.జాడి వెంకటేశ్వర్లు గంగారం మండల అధ్యక్షులు.చల్ల నారాయణరెడ్డి రాష్ట్ర నాయకులు,సుంకరబోయిన మొగిలి కొత్తగూడ బ్లాక్ అధ్యక్షులు.బానోత్ విజయ రూప్సింగ్ మాజీ ఎంపీపీ,పులుసం పుష్పలత శ్రీనివాస్ మాజీ జడ్పీటీసీ, బిట్ల శ్రీనివాస్ మండల ప్రధాన కార్యదర్శి. బోల్లు రమేష్ నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్.మల్లెల రణధీర్ మాజీ సర్పంచ్,ఇర్ప రాజేశ్వర్ అధికార ప్రతినిధి,సువర్ణపాక సరోజన మాజీ జడ్పీటీసీ గంగారం, ఈసం రమ మాజీ జెడ్పిటిసి,ముడిగ వీరభద్ర పోతయ్య మాజీ వైస్ ఎంపీపీ గంగారం,బోయినేని ప్రశాంత్ రెడ్డి యూత్ మండల అధ్యక్షులు,నోముల ప్రశాంత్ యాదవ్ జిల్లా నాయకులు,వల్లపు రంజిత్ ఓబీసీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచాలి

- శిథిల భవనాల కూల్చివేతకు తక్షణ చర్యలు
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్,జూన్ 13 (జనం సాక్షి) :** ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేలా బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో, బడిబాట,శిథిల పాఠశాల భవనాల గుర్తింపు, వనమహోత్సవం,సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టే ముందస్తు చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచేలా బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.గత విద్యాసంవత్సరం అంగన్వాడి విద్య పూర్తి చేసిన పిల్లలందరినీ సమీప ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అంగన్వాడి కార్యకర్తలు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో విద్యార్థుల ప్రవేశ శాతం పెంపుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాల గుర్తింపు,బడి బాట కార్యక్రమం అమలుపై మండలాల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల వారిగా డ్రాప్ అవుట్ విద్యార్థుల సమాచారం సేకరించి, ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులతో చర్చించి, పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.జిల్లాలో ఇప్పటివరకు 163 పాఠశాలల్లో 302 తరగతుల గదులు శిథిలావస్థకు చేరినట్లు గుర్తించామని,అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాల కూల్చివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మండలాల వారీగా శిథిల భవనాల వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రారంభ దశ నుంచే ప్రజలకు మొక్కలు పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రభుత్వ కార్యాలయాలు,పాఠశాలల ప్రాంగణాలలోని ఖాళీ ప్రదేశాలు,చెరువుల గట్లు, ప్రాజెక్టులు,చెరువుల కాలువలు,రోడ్లకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటి సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.వర్షాకాలం నేపథ్యంలో గ్రామాలలో శానిటేషన్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని,రోడ్లపై వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.వైద్య సిబ్బంది నిరంతరం గ్రామాలను సందర్శిస్తూ వ్యాధుల నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ రామారావు, జెడ్పీ సీఈఓ గోవింద్, డిపిఓ శ్రీనివాస్,భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, డిఎం అండ్ ఎచ్ఓ రాజేందర్, ఎంపీడీవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఆధార్ కార్డ్ కలిగి ఉండాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 13 (జనంసాక్షి) :** జిల్లాలో పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు ఆధార కార్డు కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లోని గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో యు.ఐ.డి. అసిస్టెంట్ మేనేజర్ మహ్మద్ శౌభన్, ప్రత్యేక ఉప పాలనాధికారి డి.చంద్రకళ, ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రతి ఒక్కరు ఆధార కార్డు కలిగి ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, వసతి గృహాలలో పిల్లలను చేర్పించే సమయంలో ఆధార కార్డు తీసుకోవాలని, 0-8 సం॥ల వయస్సు గల వారికి ఆధార్ నమోదు కొరకు జనన ధృవీకరణ పత్రం తీసుకోవాలని, ఆధార కార్డులో మార్పుల కొరకు నివాస ధృవీకరణ పత్రంను ప్రామాణికంగా తీసుకోవాలని, ఇతర ఏదైనా ఆధారం కలిగి ఉంటే సరి చేయాలని తెలిపారు. తహశీల్దార్ల పరిధిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో 7 మంది అనాథలకు ఆధార్ కార్డులు జారీ చేయడం జరిగిందని, ఆధార్ కార్డు నమోదు కొరకు జిల్లాలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఇంటింటికి ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఆధార కార్డు లేనట్లయితే అర్హత ఉన్నా ప్రభుత్వం నుండి లభించే సదుపాయాలు కోల్పోతారని వివరించాలని తెలిపారు. ఆధార కార్డు కలిగిన వారు పుట్టిన తేదీ ఒకసారి, పేరు 2 సార్లు మాత్రమే మార్చుకోవచ్చని తెలిపారు. ఆధార్కార్డు ఇంటికి రాకపోతే తపాలా కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై అక్రమ కేసులు దారుణం

- జైలులో ములాఖత్‌లో పరామర్శించిన ఎంపి కొండా



**హైదరాబాద్, జూన్ 13 (జనంసాక్షి) :** దళితులపై రేవంత్‌రెడ్డి సర్కారు అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లకు తరలించడం అన్యాయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగర శివారు మైలార్‌దేవ్‌పల్లి పరిధి అత్తాపూర్‌లోని స్థానికులపై పెట్టిన అక్రమ కేసులపై పార్లమెంటులో ప్రస్తావించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం జంతు కళేబరాలను వాంబే కాలనీలోని దళిత వాడకు తరలిస్తుండగా కొందరు యువకులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు సుమారు 21 మందిని అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈక్రమంలో చంచల్‌గూడ జైలులో ఉన్న హిందూ దళిత కార్యకర్తలను కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ములాఖత్ ద్వారా పరామర్శించారు. దళిత వాడలో జంతు వ్యర్థ పదార్థాలను వేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులపై పార్లమెంటులో ప్రస్తావించడమే కాకుండా జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలుస్తామన్నారు

# బిఆర్ఎస్ చేసిన తప్పలను మీరు చేయకండి

- కాంగ్రెస్ ప్రభుత్వానికి కూనంనేని సలహా



**సిద్దిపేట, జూన్13 (జనంసాక్షి) :** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంపన్నమైన తెలంగాణ రాష్ట్రాన్ని కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టి అప్పుల రాష్ట్రంగా మార్చారని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. తెలంగాణలో కాళేశ్వరంపై విచారణ జరుగుతోందని అన్నారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఇంజనీర్స్‌దే పాత్ర ఉందని తమకు ఏం తెలియదని అనడం సరికాదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తీర్చలేక కుంగిపోతోందని విమర్శించారు. బీఆర్ఎస్ చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయొద్దని కూనంనేని సాంబశివరావు కోరారు.సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే ఎడ్ల గురువారెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా చాలా అంశాలపై చర్చ జరుగుతోందని చెప్పుకొచ్చారు. ప్రజలకు హామీలు నెరవేరుస్తామని పార్టీలు మభ్య పెట్టవద్దని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, రుణమాఫీ పూర్తిగా ఇచ్చినట్లు చెబుతూ చేతులు ఎత్తేస్తున్నారని మండిపడ్డారు. జర్నలిస్ట్‌ల కోసం ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఎయిర్ ఇండియా ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై కేంద్రం ప్రభుత్వం పెయిల్ అయిందని విమర్శించారు. మాజీ సీఎం ఈ ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమని అన్నారు. ఆర్థికంగా జర్మనీని దాటినట్లు- చెబుతూ కేంద్రం అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతోందని ధ్వజమెత్తారు. అనేక మంది చాలీచాలని జీతాలతో అర్ధాకలితో చాలామంది ఉన్నారని చెప్పారు. విద్య, వైద్యపరంగా మనం 126వ స్థానంలో ఉన్నామని కూనంనేని సాంబశివరావు వివరించారు. ప్రజలను చైతన్యం చేయడంలో సీపీఐ తన కర్తవ్యాన్ని నిర్వహిస్తోందని ఉద్ఘాటించారు. డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాలను 5లక్షల మందితో నిర్వహిస్తామని ప్రకటించారు. కేంద్రప్రభుత్వం ఉగ్రవాదులతో చర్చల కోసం సిద్ధంగా ఉన్నది కానీ నక్సలైట్లతో చర్చలకి ఎందుకు ముందుకు రావడం లేదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నల వర్షం కురిపించారు.

# గగనతలాన్ని మూసివేసిన ఇరాన్

ఇజ్రాయెల్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ తన గగనతలాన్ని మూసి వేసిన విషయం తెలిసిందే. దీంతో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. న్యూయార్క్ నుంచి ఢిల్లీకి, ఢిల్లీ, ముంబై నుంచి లండన్, న్యూయార్క్‌కు వెళ్లే అనేక విమానాలు ప్రభావితమయ్యాయి. పలు విమానాలను దారిమళ్లించగా.. మరికొన్ని వెనక్కి తిరిగివస్తున్నాయి. దాదాపు 16 ఎయిర్ ఇండియా విమానాలను దారి మళ్లించినట్లు ఎయిర్‌లైన్స్ తెలిపింది.

# కెటిఆర్‌పై కక్షసాధింపు

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత**

**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :** ఫార్ములా-ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేయడాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఖండించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. కాంగ్రెస్ సర్కార్ మళ్లీ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మీరు ఎన్ని కుట్రలు పన్నినా మీ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతాం అని పేర్కొన్నారు. ఫార్ములా ఈ కేసులో ఈనెల 16న విచారణకు రావాలని అవినీతి నిరోధక శా(ఏసీబీ) మరోసారి కేటీ-ఆర్‌కు నోటీ-సులు జారీ చేసింది. మే 26నే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని గతంలో ఏసీబీ నోటీ-సులు ఇచ్చింది. విదేశీ పర్యటన షెడ్యూల్ ఉందని.. తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీ-ఆర్ సమాధానం ఇచ్చారు. దీంతో తాజాగా ఇప్పుడు విచారణకు హాజరు కావాలని కేటీ-ఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు ఇచ్చింది.

# భగ్గుమన్న శత్రుత్వం..

కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐఏఈఏ మరియు పాశ్చాత్య దేశాలు ఆరోపించాయి. ఇరాన్ ఈ ఆరోపణలను ఖండిస్తూనే, అణ్వాయుధాలకు అవసరమైన యురేనియం నిల్వలను సమకూర్చుకుంటోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్, ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉందని భావించి, అణు కేంద్రాలపై దాడులకు దిగింది.

### బలహీనమైన యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్

గత 40 ఏళ్లుగా ఇరాన్, ఇజ్రాయెల్‌తో పరోక్ష యుద్ధం సాగిస్తోంది. హమాస్ (గాజా), హెజ్బొల్లా (లెబనాన్), హూతీలు (యెమెన్), ఇరాక్, సిరియాలోని మిలిషియా సంస్థలతో కూడిన ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఇరాన్ నిర్వహిస్తోంది. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసిన తర్వాత, ఈ 'యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్' బలహీనపడటం ప్రారంభమైంది. హమాస్ స్థావరాలను ఇజ్రాయెల్ నాశనం చేసింది, హెజ్బొల్లా మౌలిక వసతులను కూడా దెబ్బతీసింది. ఈ చర్యలతో ఇరాన్ ఉగ్ర నెట్‌వర్క్ గణనీయంగా బలహీనమైంది. ఇరాన్ నుంచి ముప్పు ఉందని గుర్తించిన ఇజ్రాయెల్, సరైన సమయం కోసం వేచి చూసింది. ఉగ్ర నెట్‌వర్క్ బలహీనపడటం, అమెరికా దౌత్యపరమైన ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడం, భారీ యురేనియం నిల్వల సమీకరణ ఇజ్రాయెల్‌కు అనుకూలంగా మారాయి. ఈ పరిస్థితుల్లో ఇజ్రాయెల్ దాడులకు దిగితే అమెరికా నుంచి ఇరాన్‌కు మద్దతు ఉండదని, పైగా పరోక్షంగా అమెరికా సహకారం లభిస్తుందని భావించింది. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేసి తమపై ఉపయోగిస్తుందనే భయంతో, ఇజ్రాయెల్ అణు కేంద్రాలను నాశనం చేయాలని నిర్ణయించి, ఆపరేషన్ రైజింగ్ లయన్‌ను చేపట్టింది.

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, "ఇరాన్ ముప్పు మా మనుగడను సవాల్ చేస్తోంది. ఈ దాడులు దానిని తిప్పికొట్టేందుకే" అని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ ముప్పు పూర్తిగా తొలగే వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇరాన్ కూడా ప్రతీకార దాడులతో స్పందిస్తూ, భారీ సంఖ్యలో డ్రోన్‌లను ప్రయోగిస్తోంది. ఈ ఉద్రిక్తతలు ఎంతకాలం కొనసాగుతాయనేది అనిశ్చితంగా ఉంది. ప్రస్తుతం రెండు యుద్ధాలతో సతమతమవుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఈ సంక్షోభం మరింత ఒత్తిడి తెస్తోంది. చమురు ధరల పెరుగుదల, స్టాక్ మార్కెట్ నష్టాలు, సరఫరా గొలుసు అంతరాయాలు గ్లోబల్ ఆర్థిక స్థిరత్వాన్ని ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఇజ్రాయిల్ దాడిలో ఇరాన్ మిలిటరీ చీఫ్ మొహమ్మద్ భగేరి మృతి

ఇవాళ ఉదయం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్‌వైపు భారీ నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్స్ అధిపతి హుస్సేన్ సలామీ మృతిచెందినట్లు ఇరానియన్ స్టేట్ టెలివిజన్ తెలిపింది. అంతేకాదు ఇరాన్ మిలిటరీ చీఫ్ మొహమ్మద్ భగేరి కూడా మృతి చెందారు. ఇరాన్ సైనిక దళాల్లో అత్యున్నత ర్యాంక్ కలిగిన ఆఫీసర్ భగేరి. శుక్రవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ జరిపిన దాడిలో మృతిచెందిన వ్యక్తుల్లో భగేరి రెండో కీలక వ్యక్తిగా నిలిచారు.

### ఇరాన్‌పై ఆపరేషన్ రైజింగ్ లయన్

ఇరాన్‌పై దాడులను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్పందించారు. ఇరాన్‌పై ఆపరేషన్ రైజింగ్ లయన్ ప్రారంభించామని ప్రకటించారు. ఇరాన్ అణ్వాయుధీకరణ కార్యక్రమం, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించారు. ఇరాన్ ముప్పును తిప్పికొట్టడమే టార్గెట్‌గా సైనిక చర్య చేపట్టామని చెప్పుకొచ్చారు. ఇరాన్ ముప్పు తొలగించడానికి ఎన్ని రోజులైనా ఆపరేషన్ కొనసాగుతుందని తెలిపారు.

# అక్రిడేషన్ పాలసీని సరళీకృతం చేయాలి

- వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు సంజయ్



**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :** తెలంగాణలో జర్నలిస్టుల అక్రిడేషన్ల విధివిధానాలను వెంటనే ప్రకటించి, అర్హులైన వారందరికీ వీలైనంత త్వరగా కార్డులు ఇవ్వాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ డిమాండ్ చేశారు. అక్రిడేషన్ పాలసీని సరళీకృతం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఏడాది నుంచి ఈ అంశాన్ని తేల్చకపోవడం సమంజసం కాదన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పటిష్ఠమైన ఇన్సూరెన్స్, ఆసుపత్రులలో ఉచిత చికిత్స, ఆరోగ్య కార్డులు తదితర అంశాలతో పాటు- తెలంగాణ పాత్రికేయుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి త్వరలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు- సంజయ్ పేర్కొన్నారు. రైళ్లు, విమానాల టికెట్లలో జర్నలిస్టులకు రాయితీ ఇవ్వాలని, టోల్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని తాము పోరాడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబరులో దిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించి, ఈ అంశాలను ప్రధాని నరేంద్ర మోదీకి విన్నవిస్తామని చెప్పారు. జర్నలిజం ప్రింట్ మీడియా నుంచి మొదలై వివిధ రూపాలకు విస్తరించినందున పాత చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ప్రక్రియలో పాత్రికేయులకూ భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, గెజిటెడ్ అధికారులకు కల్పించే సౌకర్యాలను జర్నలిస్టులకు వర్తింపజేయాలన్నారు. ప్రస్తుతం దేశంలోని 16 రాష్ట్రాల్లో తమ పాత్రికేయుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో తమ సభ్యులు ఉన్నారని సంజయ్ ఉపాధ్యాయ తెలిపారు. జాతీయ స్థాయిలో బీఎంఎస్‌కు అనుబంధంగా పని చేస్తున్నామని, త్వరలో నేపాల్‌కు కూడా విస్తరించబోతున్నట్లు- వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అనిల్ దేశాయ్, సిద్ధిరెడ్డి శ్రీనివాసరెడ్డి , కార్యదర్శి క్రాంతి, హైదరాబాద్ సిటీ- అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానం-2020, మీడియా పాత్ర అనే అంశంపై డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు- డబ్ల్యూజేఐ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఉత్తమ జర్నలిస్టులకు పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు- చెప్పారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## నిరుద్యోగ భారతం

నిరుద్యోగ భారతములో
ఒక్క ఉద్యోగం అద్భుత గమ్యం,
వందల వాగ్దానాలు గాలి నమ్మకం
యువత చరిత్ర అజరామరం

బాల్యపు అడుగు భవితకు భారం
బలిపశువుగా మారింది తరం
కవచ బలమున్నా కర్మే పరమం
తప్పటడుగులె తలపడే వరం

గంధపు వృక్షాలను నరకంతే
సువాసన వెలువడినట్లు
గాయాల రుచి చూడనిదే
శిల దైవం కానట్లు
కొండ తొలవనిదే
ఇల్లు నిర్మాణం కానట్లు

క్షీరసాగర మథనం చేయక
రాదు ఉద్యోగ ప్రాప్తం
యత్నము వదిలేస్తే మిగిలేది శూన్యం
విద్యాధనమే అమృత మూల్యం

వెదురు గాయాలతో వేణువై లోక ప్రియమైనట్లు
అవమానాల కొలిమి ఎంత రగిలితే
అంతా స్వర్ణము మెరియు

కాగితాల పూలదండే,
కుర్చీ దిగని ఆరాటం
డిగ్రీలు దిండు గా మారి
బంగారు బతుకు బాటకై పోరాటం

ఉదయం అక్షరాల వేట,
సాయంత్రం తల్లడిల్లే ఆశ

ప్రశ్నలు యజ్ఞపు హవిసై,
జవాబులు జాడ తప్పితే
మారదు బతుకు దిశ

నువ్వు పోతే నీడలు పోతాయి,
నువ్వే లేక లేదు నీకు వెలుగు

అంధకారం ముగిసిన వెంటనే
తారలు రాలిపడినట్లు
లక్ష్యము దరి చేరగానే
ప్రేలాపనలు దూదిపిండలు

నీ పోరాట కీర్తి కాంతుల యందు
ఏ మాయ మాటలు నిలబడవు

**డా.ఐ.చిదానందం**
**చరవాణి - 8801444335**

# తెలంగాణ తొలి శతావధాని శిరశనహాళ్ సాహిత్యప్రతిభ

**ప్రస్తావన :** తెలంగాణ ప్రాంతపు అవధాన క్షేత్రంలో కీర్తిశిఖరాలను అధిరోహించిన మొదటి తరం శతావధాని శిరశనహాళ్ కృష్ణమాచార్యులు.

**జననం, కుటుంబ నేపథ్యం**

శిరశనహాళ్ కృష్ణమాచార్యులు 13 జూన్ 1905న జన్మించారు. తల్లిదండ్రులు రంగనాయకమ్మ, వెంకటాచార్యులు. వీరికి నలుగురు సంతానము -ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. కృష్ణమాచార్యులు రెండవ కుమారుని. వీరి ఇంటిపేరు అసలుగా "సిరిసెనగండ్ల". అయితే ఈ పేరు తమిళ రూపంలో ఉన్నదని భావించి, వారి అన్న వరదాచార్యులు తమ శతక రచనలో దీనిని లి"శిరశనహాళ్"లిగా సంస్కరించారు. ఈ నామాంతరం కాలక్రమేణ తెలుగు సాహిత్యంలో స్థిరంగా స్థానం పొందింది.

**"శిరశనహాళ్" అనే పద విశ్లేషణ :** ఈ పదములో రెండు భాగాలున్నాయి - "శిర" అంటే శిరస్సు లేదా శ్రేష్ఠత, "సనహాళ్" అనేది ప్రాచీన ద్రావిడ మూలాలతో కూడిన పదరూపం. "శిరసైన్యులలో అగ్రగణ్యుడు" అనే భావన దీనిలో అంతర్లీనంగా ప్రతిఫలిస్తుంది. ఇది కేవలం ఇంటిపేరుగా కాక, ఆయన ప్రతిభ, పాండిత్యానికి చిహ్నంగా మారింది.

**పాఠశాల స్థాయి నుంచి ప్రతిభ వికాసం**

కృష్ణమాచార్యుల విద్యాభ్యాసం గురించి పూర్తి సమాచారం అందుబాటులో లేకపోయినప్పటికీ, వారి అవధాన ప్రావీణ్యం వారిలో బాల్యంలోనే పండిత్యం వికసించినదనీ రచన శైలి ద్వారా తెలుస్తుంది.

**విద్యాభ్యాసం - శాస్త్రీయ పటిమకు బీజం**

శిరశనహాళ్ కృష్ణమాచార్యులు ప్రాథమికంగా కోరుట్లలోని మద్రాస్ వేదాంత కళాశాలలో విద్యను ప్రారంభించారు. ఆ కాలంలో ఇది ఆధునిక సాంప్రదాయ పాఠశాలలకంటే ఎంతో అధికంగా తాత్విక, ధార్మిక, న్యాయశాస్త్రాలకు ప్రాధాన్యతనిచ్చే కేంద్రముగా పేరొందింది. ఆపై తర్కశాస్త్ర విద్యను కనకాపురంలోని ప్రముఖ పండితుడు శ్రీనివాసాచార్యుల వద్ద అభ్యసించారు. అంతకుముందు మోర్తాడులోని కందరూల వెంకన్న పర్యవేక్షణలో సిద్ధాంత భాగాన్ని (సాంఖ్య, యోగ, వేదాంత భాగాలు కలిసిన తత్వపాఠాలు) అధ్యయనం చేశారు. తదుపరి, పిఠాపురంలో రంగాచార్యుల పర్యవేక్షణలో వేదాంత శాస్త్రాన్ని అభ్యసించారు.అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత మత పాఠ్యప్రక్రియలను ఈ విద్యాసంస్కరణలో భాగంగా అధ్యయనం చేశారు. ఫలితంగా, ఆయనకు ఉభయ వేదాంత విద్వాన్ అనే బిరుదు కూడా లభించింది (1965).

**ఉద్యోగ జీవితం - ఉపన్యాసమూర్తిగా కృషి**

శిరశనహాళ్ కృష్ణమాచార్యుల సాహిత్య జీవనంలో విద్యాబోధన ప్రాధాన్యత ఇస్తూ ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. 1926లో, కృష్ణమాచార్యులు కోరుట్లలోని ఉభయ వేదాంత సంస్కృత పాఠశాలలో ఉపాధ్యాయులుగా తన ఉపన్యాస జీవనాన్ని ప్రారంభించారు. పదవీ విరమణ అనంతర కాలంలో కూడా ఆయన విద్యాపరమైన సేవలు ఆగలేదు. సభలలో, ధార్మిక వేదికలలో, మరియు అవధాన కార్యక్రమాలలో పాఠ్యవ్యాఖ్యానాల రూపంలో తన విద్యాబోధన కొనసాగించారు. ఈ విధంగా కృష్ణమాచార్యుల ఉపన్యాస జీవితం ఉపాధ్యాయునిగా ప్రారంభమై, పండితునిగా పరిపూర్ణతను సాధించింది.

**శిరశనహాళ్ కృష్ణమాచార్యుల రచనలు**

శిరశనహాళ్ కృష్ణమాచార్యులు కేవలం శతావధానిగా మాత్రమే కాకుండా, విస్తృత రచనా వైశాల్యంతో కూడిన మహాకవి, తత్వవేత్త, అనువాదకుడు, సంస్కృతాంధ్ర సాహిత్య కర్మయోగి. ఆయన రచనలు నాలుగు ప్రధాన విభాగాలలో విభజించవచ్చు: గద్య కావ్యాలు, సంస్కృత కావ్యాలు, ఇతర రచనలు, స్వీయ చరిత్ర. వాటిని చూస్తే గద్య కావ్యాలు విభాగంలో తత్వ ప్రకాశిక, వేదాంత దీపిక, రహస్యత్రయమ్ వంటి రచనలు చేశారు. వీరి తత్వ ప్రకాశిక - తత్వ విషయాలను సాధారణ శైలిలో విశ్లేషించిన గద్యరచన.అక్షరాది మార్గం - విద్యాభ్యాస మార్గదర్శి గ్రంథంగా చూడవచ్చు.శ్రీ వచన భూషణమ్ (అనువాదం) - రామానుజాచార్యుల తాత్విక


జనంసాక్షి

భావనలకు వ్యాఖ్యాతగా నిలిచిన రచన.పూర్వపక్ష సిద్ధాంత సంయోజనం - వేదాంత వాద సంప్రదాయాలలో తర్కభరిత సమాలోచన. సంస్కృత కావ్యాలు విభాగములో మనస్సందేశ కావ్యం (1950) - కాళిదాసుని మేఘసందేశం శైలిలో ప్రేమోన్మాదతతో కూడిన సందేశకావ్యం.సంపత్కుమార సంభవమ్ - ఆల్వారుల పీఠాధిపతుల పురాణ నేపథ్యాన్ని ఆధారంగా చేసుకున్న శిల్పకావ్యం.గురువంశ మహాకావ్యం - ఆయన వంశపారంపర్య గురు సంప్రదాయ చరిత్రను ఆధా రంగా రాసిన మహాకావ్యం.మనోజ విజయభాణం (1961) - భాణ నాటక శైలిలో నాట్యరస ప్రబోధక కావ్యం.ధర్మపురి సుప్రభాతం - ఆలయప్రాంగణ భక్తిరస ధారావాహిక.జియ్యర్ స్వామి చరిత్రమ్ - శ్రీ వైష్ణవ సంప్రదాయ గురుపరంపర చరిత్ర. ఇతర రచనలు విభాగంలో భిన్న రకాల సాహిత్య ప్రక్రియలలో ఆయన నైపుణ్యం మెరిపించింది. కళాశాలా భ్యుదయం (1929) - వేదాంత పాఠశాల స్థాపన చరిత్రను వర్ణించిన రచన.విశిష్టాద్వైత మత సంగ్రహం (1972) - విశిష్టాద్వైత సూత్రాలను సంక్షిప్తంగా వెల్లడించిన తాత్విక రచన.గాంధీ తాత నీతి శతకం (1975, సంస్కృతంలో)-గాంధీజీ భావాలను నీతిపద్యాలుగా సంస్కృతంలో తీర్చిదిద్దిన విభిన్న ప్రయోగం,ధర్మపురి లక్ష్మీనరసింహ సుప్రభాతం - ఆలయ ఆరాధనలో భాగమైన సుప్రభాత సేవా గీతం,ఆంధ్ర మహానాటకం (అనువాదం), హనుమన్నాటకం (అనువాదం) రామానుజ, చరిత్ర (1981) - శ్రీరామానుజుని జీవిత విశేషాలను శాస్త్రీయంగా వివరించిన రచన,స్తుతి గీతములు (1967, మూడు భాగాలు) భక్తి గీతాల సమాహారం,ఆళ్వారులు - శ్రీ వైష్ణవ భక్త కవుల పరిచయాత్మక గద్యం.జయతాల కోరుట్ల శతావధానాలు - శతావధాన కార్యక్రమాల కథనచిత్రణ.వీరి స్వీయ చరిత్ర- స్వీయ కవితానుజీవనం (1986) - స్వీయ జీవితం, రచనా పర్వాలను విశ్లేషిస్తూ తన అనుభవాలను వెల్లడించిన సూక్ష్మ రచన.

**శిరశనహాళ్ కృష్ణమాచార్యుల ప్రతిభ**

తెలంగాణలో అవధాన ప్రక్రియను సమర్థవంతంగా విన్యసించిన శిరశనహాళ్ కృష్ణమాచార్యులు కేవలం శతావధాని మాత్రమే కాదు, సమస్యలు, చిత్రబంధ కవిత్వం, తాత్విక గద్యాలు, సామాజిక చైతన్యమయ కవితలలోనూ దక్షత గలవారిగా నిలిచారు. సాహిత్యంలో "చిత్ర బంధ గర్భ రచన" అనే వైవిధ్యానికి జీవం పోసారు.

**"చేకొని రామలక్ష్మణులు**
**సీతాకాదమ్ములు శంభుడన్నయున్"**

పైన పేర్కొన్న పద్యరూప సమస్యను కృష్ణమాచార్యులు సులభంగా విపరిణమించి, శబ్దప్రయోగ నైపుణ్యాన్ని బహిరంగపరిచిన సందర్భం అరుదైనది.

**తొలి రచన: మనోజ విజయ భాణం**

ఈ రచన భాణ నాటక శైలిలో అభినవ రూపాన్ని పొందిన కృషి. ఇందులో మనోరథ రూపంలో రచయిత నాయకుడు అయి తన మనోభావాల పయనాన్ని వెదుకుతాడు. నాట్యవిద్యాభివృద్ధికి కృషిచేసే భాణ కావ్యాల్లో ఇది తెలుగులో అరుదైన రచనలలో ఒకటి. కళాశాల అభ్యుదయం (1929) రచన కృష్ణమాచార్యులు పనిచేసిన కోరుట్ల ఉభయవేదాంత పాఠశాల అభివృద్ధికి నిక్షిప్తమైన చరిత్ర. చిత్ర బంధ ప్రబంధం (1940) గ్రంథంలో కవిత్వంలోని చిత్రబంధాల విశేష శిల్పచాతుర్యాన్ని చూపారు.మనస్సందేశ కావ్యం కాళిదాసు మేఘసందేశం శైలిలో ఉంది.

**శిరశనహాళ్ కృష్ణమాచార్యుల ప్రత్యేకతలు**
**- అవధాన పరంపరలో తెలంగాణ తొలి చరిత్ర**

తెలంగాణ ప్రాంత సాహిత్య చరిత్రలో శిరశనహాళ్ కృష్ణమాచార్యులు ఒక అరుదైన మైలురాయి.తెలంగాణ ప్రాంతంలో మొట్టమొదటి శతావధానిగా చరిత్రకు లిఖితమైన ఘనత ఆయనకే చెందింది. 1928లో తన తొలి శతావధానాన్ని నిర్వహించడం ద్వారా, తెలంగాణ ప్రాంతంలో కొత్త అధ్యాయానికి నాంది పలికారు.జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి వంటి పట్టణాలలో ఆయన నిర్వహించిన శతావధానాలు (మొత్తం 5), అష్టావధానాలు (40) ప్రజల్లో ఆయన ప్రతిభను ప్రసరింపజేశాయి. అవధాన కళ మాత్రమే కాకుండా, సంస్కృతం, తమిళం, తెలుగు భాషలపై ఆయనకు పాండిత్యం ఉండటం విశేషం. ఆయన ఖ్యాతి ప్రముఖ సాహిత్య పురోగామి సురవరం ప్రతాపరెడ్డి దృష్టిని ఆకర్షించింది. "గోల్కొండ కవుల సంచిక" అనే ప్రఖ్యాత ప్రచురణలో కృష్ణమాచార్యుల పేరు ప్రస్తావించారు.

**శిరశనహాళ్ కృష్ణమాచార్యుల బిరుదులు**

శిరశనహాళ్ కృష్ణమాచార్యులు తన సాహిత్యచరిత్రలో అనేక బిరుదులను పొందారు. ఈ బిరుదులు ఆయన పాండిత్యానికి, కవిత్వానికి, అవధాన ప్రతిభకు నిలువెత్తు గుర్తింపులుగా నిలిచాయి. ఈ బిరుదుల విశ్లేషణ ద్వారా, ఆయన జీవితం - సాహిత్య, తత్వ, అవధాన పరంపరలలో ఆయన స్థానం ఎంత విశిష్టమో అర్థమవుతుంది. అభినవ కాళిదాసు-ఈ బిరుదు ఆధునిక కాళిదాసుగా కాళిదాసు వంటి సంస్కృత కవికి సదృశంగా కవిత్వ ప్రతిభ, రూపక నైపుణ్యం, నైపుణ్యమైన దృక్పథాన్ని కలిగినవారికి మాత్రమే ఈ బిరుదు ఇస్తారు. విద్యాభూషణ (1940)-ఈ బిరుదు ఆయన విద్యాప్రతిభను, ప్రత్యేకించి శాస్త్రీయ విద్యాభ్యాసాన్ని ప్రశంసిస్తూ 1940 సంవత్సరంలో లభించింది. ఇది భారతదేశంలోని శాస్త్ర, వేద విద్యా సంస్థల నుండి విద్యావేత్తలకే లభించే ఒక గౌరవనామం. పండిత రత్న (1946) ఈ బిరుదు పాండిత్య శ్రేణిలో అత్యున్నత గౌరవాన్ని సూచిస్తుంది. ఉభయ వేదాంత విద్వాన్ (1965)-వేదాంతంలో రెండు ప్రధాన సంప్రదాయాలైన అద్వైత మరియు ద్వైత వేదాంతముల పట్ల సవ్యంగా అవగాహన కలిగిన వారిని ఉభయ వేదాంత విద్వాన్‌గా పిలుస్తారు. ఉభయ వేదాంతాచార్య (1973)-ఈ బిరుదు ఉభయ వేదాంత విద్వాన్ కంటే మరింత గౌరవ సూచకం. ఆచార్య అనే పదం శాస్త్ర బోధనలో నేర్పరితనం, శిష్య శిక్షణలో నైపుణ్యాన్ని సూచిస్తుంది. నైజాం రాష్ట్రద్య శతావధాని బిరుదు నైజాం కాలంలోనే కృష్ణమాచార్యులు శతావధాన ప్రతిభను ప్రదర్శించిన ఘనత కలిగినవారు. ప్రపంచ తెలుగు మహాసభల కవి సత్కారం (1975), తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం (1992) ఈ బిరుదులు కేవలం పదాలు కాదు. కృష్ణమాచార్యుల బహుముఖ ప్రతిభకు బహుముఖ గుర్తింపులు.

**బిరుదులు, పురస్కారాలు**

శిరశనహాళ్ కృష్ణమాచార్యులు తమ సాహిత్య కార్యచరణ ద్వారా అనేక బిరుదులు, కీర్తి గుర్తింపులు పొందిన అరుదైన పండితులలో ప్రముఖులు. వాటిని చూస్తే అభినవ కాళిదాసు, కృష్ణమాచార్యులు రచించిన గురువంశ మహాకావ్యం, సంపత్కుమార సంభవం, మనస్సందేశ కావ్యం అనే సంస్కృత కావ్యాలు ప్రసిద్ధ కవి కాళిదాసుని త్రయీ రచనలు ు రఘువంశం, కుమార సంభవం, మేఘదూతం ులకు ప్రత్యుత్తరంగా వినిపిస్తాయి. ఈ త్రయీ శిల్ప నైపుణ్యం కారణంగా పండితలోకం వారు వారిని "అభినవ కాళిదాసు"గా పేరొందారు. విద్యాభూషణ (1940) బిరుదు 1928లో తొలి శతావధానాన్ని విజయవంతంగా నిర్వహించి సాహితీ ప్రపంచంలో ప్రతిభావంతుడిగా నిలిచిన కృష్ణమాచార్యులకు, ప్రముఖ పండితులలో ఒకరైన సేనాపతి నర్సింహాచార్యులు "విద్యాభూషణ" బిరుదును 1940లో ప్రదానం చేశారు.పండితరత్న (1946) శతావధాన సాధనతో పాటు సమస్యలు, ఛందోబద్ధ రచనల నైపుణ్యం చూపించిన కృష్ణమాచార్యులకు 1946లో "పండితరత్న" బిరుదు ప్రదానం చేయబడింది. ఉభయ వేదాంతాచార్య (1973) బిరుదు వైష్ణవ వేదాంతం, విశిష్టాద్వైత తాత్విక పరిణామాల్లో కృష్ణమాచార్యులు కలిగిన ప్రవేశాన్ని గుర్తిస్తూ, పెద్దజీయర్ స్వామి చేత 1973లో "ఉభయ వేదాంతాచార్య" బిరుదును అందుకున్నారు.

**అంతర్జాతీయ, సంస్థాగత సత్కారాలు :** 1975లో ప్రపంచ తెలుగు మహాసభలలో కవి సత్కారాన్ని పొందారు.1992లో తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం పొందడం ద్వారా విద్యా రంగానికి వారి చేసిన కృషికి గౌరవమిచ్చారు.



**డా.ఐ.చిదానందం**
**తెలుగు అధ్యాపకులు**
**వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ**
**చరవాణి - 8801444335**

# బాల్యాన్ని కోల్పోతున్న బాలలు

బడి గంట మ్రోగుతున్న వేళ, ఆటపాటల్లో మునిగి తేలాల్సిన సమయం, ఆశలతో కళ్ళు మెరవాల్సిన చిన్నారి ప్రపంచం - ఇవేవీ లక్షలాది భారతీయ చిన్నారుల జీవితాల్లో లేవు. వారి లేత చేతులు నిత్యం ఏదో ఒక పనిలో నిమగ్నమై, మోముపై చిరునవ్వుకు బదులు అలసటను మోస్తున్నాయి. భారతదేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సామాజిక సవాళ్ళలో బాలకార్మిక వ్యవస్థ ఒకటి. పేదరికం, నిరక్షరాస్యత, కట్టుబాట్లు, చౌక శ్రామికుల కోసం ఎగబడే మారీచ స్వభావం -ఈ అంశాలన్నీ కలిసి మన పిల్లల భవిష్య త్తును చీకట్లోకి నెడుతున్నాయి. ఈ సమస్యను కేవలం చూసి సరిపుచ్చుకోకూడదు. దీనిని వేళ్ళతో సహా పెకిలించి, మన చిన్నారుల ముఖా లపై నిజమైన చిరునవ్వులు పూయించడానికి పటిష్టమైన, నిరంతర, సానుభూతితో కూడిన విధానం అత్యవసరం.

**బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం:** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అంతర్జాతీయ కార్మిక సంస్థ 2002 సంవత్సరంలో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని జూన్ 12 గా నిర్ణయించింది. ఈ ఏడాది " పురోగతి స్పష్టంగా ఉంది, కానీ ఇంకా ఎక్కువ పని చేయాల్సి ఉంది: ప్రయత్నాలను వేగవంతం చేద్దాం! " అనే ఇతివృత్తాన్ని తీసుకున్నారు. బాలకార్మికుల వ్యవస్థ అంతానికి తీసుకోవలసిన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ రోజు ప్రధాన లక్ష్యం.

**బాలకార్మికులు అంటే ఎవరు?**

కొన్ని దేశాలలో 5 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు, ఇంకొన్ని దేశాలు 5 నుండి 18 సంవత్సరాల మధ్యలో ఉన్న వారిని బాలలుగా పరిగణిస్తాయి. బాల్యాన్ని నాశనం చేసే రీతిలో బాలల శారీరక, మానసిక అభివృద్ధికి ఆటంకమై కనీస అక్షరాస్యతను, వినోదాన్ని కూడా పొందని వారిని బాలకార్మికులని అంటారు. ఈ బాలకార్మిక వ్యవస్థ ప్రపంచ దేశాల అభివృద్ధికి ఆటంకాలను కలిగిస్తుంది.

**గణాంకాల మాట- అంకెల్లో ఆవేదన:**

నిజం చెప్పాలంటే 2011 జనాభా లెక్కల ప్రకారం 5 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల 10.1 మిలియన్లకు పైగా పిల్లలు పని చేస్తున్నారని గణాంకాలు గట్టిగా చాటి చెబుతున్నాయి. ఇది మొత్తం పిల్లల జనాభాలో దాదాపు 4% కావడం ఎంతగానో ఆందోళన కలిగిస్తుంది. 2001 నుండి 2011 మధ్య కాలంలో బాల కార్మికుల సంఖ్య 2.6 మిలియన్లు తగ్గింది అన్నది కొంత ఊరట కలిగించినా ఈ సానుకూల ధోరణి ఎక్కువగా గ్రామ ప్రాంతాలకే పరిమితమైంది. ఆందోళనకరంగా, పట్టణ ప్రాంతాలలో బాల కార్మికుల సంఖ్య పెరిగింది. ఇది పట్టణాలలో చౌకైన, దోపిడీకి గురయ్యే శ్రామికుల పట్ల పెరుగుతున్న డిమాండ్‌ను స్పష్టంగా సూచిస్తుంది. ఇక ఇటీవల యూనివెఫ్ విశ్లేషణలు (2018-19 పిఎల్ఎఫ్ఎస్ డేటా ఆధారంగా) ఒక లక్షా యాభై వేల నుండి మూడు లక్షల ముప్పై మూడు వేల మంది పిల్లలు బాల కార్మికులుగా ఉన్నారని వారిలో దాదాపు సగం మంది తమ సొంత కుటుంబాలలోనే పని చేస్తున్నారని వెల్లడించాయి. దీనివల్ల వారిని గుర్తించడం, సహాయం అందించడం మరింత కష్టమవుతోంది. వ్యవసాయం, ఇటుక బట్టీలు, తివాచీలు నేయడం, వస్త్ర పరిశ్రమలు, గృహ



సేవ వంటి ప్రమాదకర రంగాలలో అత్యంత బలహీన వర్గాలకు చెందిన చిన్నారులు తరచుగా కష్టపడుతున్నారు.ఇవితరచుగా బహిరంగ దృష్టికి, ఎలాంటి నియంత్రణకు దూరంగా ఉంటాయి.

అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రపంచవ్యాప్తంగా 16 కోట్ల బాలకార్మికులు ఉన్నారని చెబుతోంది. వారిలో 6.3 కోట్లు బాలికలు కాగా, 9.7 కోట్లు బాలురు. వీరిలో 7.9 కోట్లు మంది అత్యంత ప్రమాదకరమైన పరిశ్రమలలో పనిచేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలోని ప్రతి పది మంది బాలకార్మికులలో తొమ్మిది మంది ఆఫ్రికా, ఆసియా, పసిఫిక్ ప్రాంతాలలోనే ఉన్నారు. అత్యధికంగా 8.66 కోట్ల మంది సబ్ సహారాన్ ఆఫ్రికా ప్రాంతంలో నమోదయ్యారు. ఈ బాల కార్మికులలో 70 శాతం మంది వ్యవసాయ రంగంలో, 20 శాతం మంది సేవా రంగంలో, 10 శాతం మంది ఇతర పరిశ్రమలలో పనిచేస్తున్నారు. ఆశ్చర్యకరంగా, గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో బాల కార్మికుల సంఖ్య మూడు రెట్లు ఎక్కువగా ఉంది.

**చరిత్ర అద్దంలో బాలకార్మికులు : నాడు-నేడు:**

బాలకార్మిక సమస్య అనేది కొత్తది కాదు. చరిత్రను పరిశీలిస్తే 16, 17వ శతాబ్దాల నాటికే ఈ సమస్య ఉందని తెలుస్తుంది. ఆనాడు పేద దేశాలలోని ప్రజలు తమ ఆర్థిక అవసరాల కోసం తమ పిల్లలను ఇతరులకు అమ్మివేసేవారు. అలాంటి బానిసలందరూ బాలకార్మికులే. పారిశ్రామిక విప్లవం తరువాత కర్మాగారాలలో పెద్దల కంటే తక్కువ వేతనానికే పిల్లలు లభించడం వలన వీరి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆ తర్వాత అన్ని రంగాలలో బాల కార్మికులు పెరుగుతూ వచ్చారు. నేటి కాలంలో కూడా బాలకార్మిక సమస్యకు ప్రధాన కారణం పేదరికం మాత్రమే. కోవిడ్ మహమ్మారి అనంతర ఆర్థిక అవసరాలు పెరగడం, పాఠశాలలు మూసివేయబడటం, కుటుంబ పెద్దలు ఉపాధి కోల్పోవడం, వ్యాపారంలో నష్టాలు, తల్లిదండ్రుల మరణాలు, యుద్ధాలు (ఉదాహరణకు రష్యా-ఉక్రెయిన్, పాలస్తీనా-ఇజ్రాయిల్), ప్రకృతి వైపరీత్యాలు వంటివి బాలకార్మికుల సంఖ్య వృద్ధికి ప్రధాన కారణాలు. రష్యా-ఉక్రెయిన్, పాలస్తీనా-ఇజ్రాయిల్ యుద్ధాలు ఎన్నో పాఠశాలలు మూతపడటానికి, లక్షలాది మంది ప్రజలు తమ నివాసాలను వదిలి వెళ్లడానికి దారితీశాయి. చాలా మంది పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయారు. వీరందరూ బ్రతుకుతెరువు కోసం తప్పకుండా ఏదో ఒక పని చేయవలసిందే. విచారకరంగా, వీరందరూ రేపటి బాలకార్మికులే! ఐఎల్ఒ అంచనాల ప్రకారం 2023 చివరినాటికి బాలకార్మికుల శాతం మరింత పెరుగుతుందని తెలిపింది. నేడు బాలకార్మికులు ఎక్కువగా వ్యవసాయ రంగం, గృహసంబంధ పనులు, బాణాసంచా, వస్త్ర, బొమ్మలు, గొడుగుల తయారీ, గనులు, మైనింగ్ వంటి ప్రమాదకర రంగాలలో అధికంగా ఉన్నారు. ఇంకా పాడి, మత్స్య, అటవీ, రిటైల్ రంగాలలో, రెస్టారెంట్లు, వస్తువులు లోడింగ్, చెత్త ఏరుకోవడం, బూట్లు పాలిష్ చేయడం, పారిశ్రామిక యంత్రాల ఆపరేటింగ్, ఉప్పు, అద్దాల తయారీ పరిశ్రమల లోనూ కనిపిస్తున్నారు. చైల్డ్ ట్రాఫికింగ్ వలన అమ్మాయిలు వ్యభిచార వృత్తులలోకి, అబ్బాయిలు బిచ్చగాళ్లుగా మారుతున్నారు. కొన్ని కుటుంబాలలో సంపాదించే వ్యక్తులు తక్కువగా ఉండి, వారిపై ఆధారపడేవారు ఎక్కువగా ఉండటం, చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణిం చడం, రోడ్ల మీద వదిలివేయబడిన పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, తల్లిదండ్రులలో కొందరు పిల్లలతో పనికోసం వలసలు వెళ్ళడం వల్ల బాలలు విద్యకు దూరమవుతున్నారు. వ్యవసాయా నికి తోడుగా పిల్లలను ఉంచుకోవడం వంటి అనేక కారణాలు చిన్నారులను బాలకార్మికులుగా మారుస్తున్నాయి.

**వినాశకరమైన పరిణామాలు- తరతరాల బాధలు:**

బాలకార్మికుల వల్ల కలిగే పరిణామాలు కేవలం వ్యక్తిగతం కాదు. అవి సమాజం మొత్తాన్ని, దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి. బిడ్డకు, అది దొంగిలించబడిన బాల్యం. దీని స్థానంలో ప్రమాదకరమైన పని వాతావరణం, శారీరక, మానసిక దుర్వినియోగం, సుదీర్ఘ పని గంటలు ఉంటాయి. ఇవి వారి శారీరక, మానసిక, భావోద్వేగ అభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తాయి.



**కింజరాపు అమరావతి**
**8247286357**

# జీవనదాత.. రక్త దాత..!

రక్తదానం అనేది మీరు ఇచ్చే దానాలలో అత్యంత కీలకమైనది.ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మంది రోగులకు సహాయపడుతుంది. మొత్తం రక్తం అనేక ఉపయోగకరమైన భాగాలతో తయారవుతుంది కాబట్టి ఇది సాధ్యమవుతుంది.మీ శరీరంలో మరియు మీ రక్తాన్ని స్వీకరించే రోగుల శరీరంలో ప్రత్యేక విధులను నిర్వహిస్తాయి. వివిధ రక్త భాగాలు ఎర్ర రక్త కణాలు,తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్లు, ప్లాస్మా, ఎంచుకున్న ప్లాస్మా ప్రోటీన్లు. ఈ భాగాలలో ప్రతి ఒక్కటి.మీరు దానం చేసిన రక్త పరిమాణం నుండి వేరు చేయబడి, ఆ నిర్దిష్ట భాగం అవసరమయ్యే నిర్దిష్ట రోగికి మార్పిడి చేయబడుతుంది.అందువల్ల, చాలా మంది ఒక యూనిట్ రక్తం నుండి ప్రయోజనం పొందవచ్చు.రక్తదానం ప్రాణదానం అంటే ఒక వ్యక్తి తన రక్తాన్ని ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు దానం చేయడం.రక్తదానం చేయడం ద్వారా అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఇది అత్యవసర పరిస్థితులలో మరియు కొన్ని వైద్య చికిత్సల కోసం కూడా ఉపయోగపడుతుంది. రక్తదానం ప్రాణాలు కాపాడే ఒక గొప్ప పని. ఇది చాలా మంది రోగులకు సహాయపడుతుంది. వారిని ప్రమాదకరమైన పరిస్థితుల్లోంచి బయట పడేస్తుంది. రక్తదానం ద్వారా, రోగులకు తక్షణ చికిత్స లభిస్తుంది. వారి ఆరోగ్య పరిస్థితి మెరుగు పడుతుంది. రక్తం ఊపిరితిత్తుల నుండి మన శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను తీసుకు వెళుతుంది.ఈ ప్రక్రియకు అంతరాయం కలిగిన క్షణంలో,ఒక వ్యక్తి ప్రాణం ప్రమాదంలో పడుతుంది. అందుకే చాలా ప్రమాదాల సమయంలో,అధిక రక్త నష్టం లేదా మెదడు రక్తస్రావం కారణంగా బాధితుడు మరణిస్తాడు.రక్త దానం అనేది ప్రతీ ఒక్కరూ చేయాల్సిన సామాజిక బాధ్య. రక్తం సరైన సమయంలో అందక పోవడం వల్ల ఎంతో మంది తమ ప్రాణాలను కోల్పోతున్నారు. రక్త దానంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో ప్రతి ఏడాది కేవలం 10 శాతం మంది మాత్రమే రక్తం దానం చేస్తున్నారు.రక్త దానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, బలహీనంగా మారుతారని అందరికీ ఓ అపోహ ఉంది. కానీ తప్పుడు అపోహ మాత్రమే.రక్త దానం చేయడం వల్ల ఐరన్ స్థాయిలు అనేవి అదుపులో ఉంటాయి.రక్త దానం చేయడం వల్ల ఐరన్ నిల్వలు తగ్గి,ధమనులు చక్కగా పని చేస్తాయి.దీంతో గుండె పోటు ప్రమాదం తగ్గుతుంది.క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్ల నుండి ప్రమాదం తగ్గించుకోవచ్చు. రోగానిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండే వ్యక్తులు రక్త దానం చేయడం వల్ల బరువు తగ్గడమే కాకుండా శక్తిని పెంచుకునేందుకు ఉపయోగ పడుతుంది.రక్త దానం చేయడం వల్ల అనేక ఆరోగ్య



ప్రయోజనాలను అందిస్తుంది.రక్తదానం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. అందుకోసమే ప్రతి సంవత్సరం జూన్ 14 న ప్రపంచ రక్త దాతల దినోత్సవం నిర్వహించుకుంటాం. రక్తదానం చేసే వ్యక్తి రక్తదానం చేయడం వల్ల స్వీకరించే వ్యక్తికి మేలు జరుగుతుంది.ప్రతి వ్యక్తి ఆరు నెలలకోసారి రక్తదానం చేయవచ్చు.పూర్తి ఆరోగ్యకరమైన వ్యక్తి ప్రతి మూడు నెలల కోసారి కూడా రక్త దానం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.ఇది కొత్త రక్త కణాల ఉత్పత్తికి సహాయపడుతుంది. ఆరోగ్యంగా ఉన్న 18 సంవత్సరాలు పైబడిన వారందరూ రక్త దానం చేయవచ్చు. 18 ఏళ్ల నుంచి క్రమం తప్పక రక్తదానం చేయగలిగితే జీవిత కాలం మొత్తంలో దాదాపు 168 సార్లు రక్తదానం చేయవచ్చు. రక్తదానం చేయడానికి ముందు, పల్స్, రక్తపోటు, శరీర ఉష్ణోగ్రత, హిమోగ్లోబిన్ స్థాయిలతో సహా ప్రాథమిక ఆరోగ్య పరీక్ష చేయించుకోవడం తప్పనిసరి. ఇది మన శరీరం గురించి మరింత తెలుసుకోవడానికి, ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే పరిష్కరించడానికి సహాయపడుతుంది. మనం దానం చేసిన రక్తం ఒకరి జీవితాన్ని కాపాడగలదు. ఆ విషయం మన మెదడుకు అర్థం అవుతుంది. అది మానసికంగా ఉత్సాహాన్ని, ఆనందాన్ని అందిస్తుంది. కాబట్టి ఆనంద హార్మోన్లు విడుదల అవుతాయి.రక్తదానం అనేది నిస్వార్థమైన దయ, దాతృత్వ చర్య, ఇది ప్రాణాలను కాపాడుతుంది. గ్రహీత, దాత ఇద్దరి శ్రేయస్సును మెరుగు పరుస్తుంది. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలు,ప్రాణాలను రక్షించే సామర్థ్యం, సంభావ్య ఆరోగ్య ప్రయోజనాలు మరియు భావోద్వేగ బహుమతులు వంటివి, తాత్కాలిక అలసట, ఇనుము లోపం ప్రమాదాలు మరియు సంక్రమణ సంభావ్యత వంటి ప్రతికూలతల కంటే ఎక్కువగా ఉంటాయి.ప్రపంచ రక్తదాతల దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 14 న జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని మొదటిసారిగా 2004లో నాలుగు ప్రధాన అంతర్జాతీయ సంస్థలు నిర్వహించాయి. రక్తం గ్రూపులు వేరైనా రంగు మాత్రం ఒక్కటే. రక్తదానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఏడాది జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం 2025 థీమ్ ను చుసినట్లయితే "రక్తదానం చేద్దాం, ఆశను పంచుకుందాం: కలిసి మనం ప్రాణాలను కాపాడుకుందాం. "రక్తం మనందరినీ కలుపుతుంది.రక్తదానం చేయండి, ఒక జీవితాన్ని రక్షించండి ." రక్తంలోని ఏ, బీ, ఓ గ్రూపులను కనుగొన్న కార్ల్ స్టైనర్ జన్మదినం జూన్ 14ను పురస్కరించుకొని ఆ రోజున రక్తదాతల దినోత్సవంగా పాటిస్తున్నారు.రెడ్‌క్రాస్, రెడ్‌క్రీసెంట్ సొసైటీ,ఇంటర్‌నేషనల్ బ్లడ్ డోనర్ ఆర్గనైజేషన్లు ప్రపంచ ఆరోగ్య సంస్థలతో కలిసి రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి.మనిషి దినచర్య సక్రమంగా జరగాలంటే రక్త ప్రసరణ ఎంతో అవసరం.సకాలంలో రక్తం అందక చనిపోతున్నవారు ఎందరో. రక్తదానం తరువాత పునరుత్పత్తి ప్రారంభం కావడానికి నాలుగు రోజుల సమయం పడుతుంది.సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన ప్రస్తుత శాస్త్ర, సాంకేతిక సమాజంలో మనిషి స్వతహాగా తయారు చేయలేని పదార్థాల్లో రక్తం ఒకటి. మన దేశ వ్యాప్తంగా ఉన్న 140 కోట్ల మందిలో అత్యవసర పరిస్థితుల్లో ఏటా ఐదు కోట్ల యూనిట్ల రక్తం అవసరం ఉందని నిపుణుల అంచనా. అయితే రక్తదాతల నుంచి లభిస్తున్నది మాత్రం సుమారు 50 లక్షల యూనిట్లు మాత్రమేనని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో ప్రతిరోజు దాదాపు 12 వేల మంది రక్తకొరత కారణంగా చనిపోతున్నారు.ఒక వ్యక్తి శరీరంలో ఉన్న రక్తం మోతాదు వారి ఎత్తు, బరువు మరియు వయస్సు ఆధారంగా నిర్ణయించబడుతుంది. సాధారణ మానవ వయోజన శరీరం దాదాపు ఐదు లీటర్ల రక్తాన్ని కలిగి ఉంటుంది. ఈ మోతాదు 4,500 నుండి 5,700 మిల్లీలీటర్ల మధ్య మారుతూ ఉంటుంది. గర్భిణీలలో 300 మి.లీ నుండి 400 మి.లీ రక్తం అదనంగా ఉంటుంది. గర్భిణీలలో ఉన్న ఈ అదనపు రక్తం ప్రసవ సమయంలో జరిగే రక్తస్రావాన్ని సరిచేస్తుంది.అనారోగ్యంతో ఉన్న వారు రక్తదానం చేయకూడదు.ఇప్పుడు దరిదాపుగా ప్రతిదానికి ఒక యాప్ అందు బాటులో ఉంటోంది. రక్తదానానికి కూడా ఒక యాప్ అందుబాటులో ఉంది. రక్తదానం చేయడానికి ఆసక్తి ఉన్న వారి కోసం జాతీయ ఆరోగ్య మిషన్ ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా అందుబాటులో ఉండేలా ఈరక్తకోష్ అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. రక్తం దానం చేయడానికి ఆసక్తి ఉన్నవారు ఈ యాప్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చు.తాత్కాలిక అనారోగ్యం ఉన్న వాళ్లు ఆరోగ్యం సరైన తర్వాత రక్తదానం చేయవచ్చు.



**డాక్టర్ మోటె చిరంజీవి,**
**సామాజికవేత్త, విశ్లేషకులు**
**9949194327**

# ప్రతి పేదవాడి సొంతింటి కల దశలవారీగా నెరవేరుస్తాం

- పోలీసులు ప్రజలకు జవాబుదారీగా పని చేయాలి
- విజయ రమణారావు పట్టువదలని విక్రమార్కుడు
- మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,దుద్దిల్ల శ్రీధర్ బాబు



**ఎలిగేడు, జూన్ 13 (జనంసాక్షి) :** ప్రజా పాలనలో ప్రతి పేదవాని సొంతింటి కలను నెరవేర్చుటకు దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, దానికి సంబంధించి పూర్తి అధికారం జిల్లా కలెక్టర్ కె అప్పగించామని, ఎలాంటి అవినీతికి తావు లేకుండా నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని,రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం ఎలిగేడు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ కార్యాలయాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు ,రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝ తో కలిసి ప్రారంభించారు.అనంతరం జరిగిన సమావేశంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ తాను జిల్లా పరిషత్ సభ్యునిగా ఉన్నప్పుడు ఎలిగేడు మండల కేంద్ర ఏర్పాటు కోసం పోరాటం రిలే నిరాహార దీక్షలు చేసి 57వ మండలం గా ఎలిగేడు మండలాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. అంతేకాకుండా మండలం గా ఏర్పాటు ఎలిగేడు అయినప్పటినుండి 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఏ లాంటి అభివృద్ధికి నోచుకోలేదని, అప్పటి మాజీ ఎంపీ బాల్క సుమన్ ఎలిగేడు మండల కేంద్రంలో నూతన పోలీస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తానని ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఎలిగేడు మండల కేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని మంత్రులను ఎమ్మెల్యే విజయ రమణారావు కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పోరాట స్ఫూర్తితో ఎలిగేడు మండల కేంద్రం ఏర్పాటు కావడమే కాకుండా తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి తో చర్చించి ఎలిగేడు మండల కేంద్రంలో నూతన పోలీస్ కార్యాలయానికి శ్రీకారం చుట్టామన్నారు. పట్టువదలని విక్రమార్కునిలా ఎమ్మెల్యే విజయరమణారావు నిరంతరం ప్రజల సంక్షేమం కోసమే పరితపిస్తూ ప్రజాసేవ చేస్తున్నారని అలాంటి నాయకుడు దొరకడం ఎలిగేడు మండల ప్రజలకు వరం లాంటిదని ప్రశంసించారు. పోలీసులు ప్రజలకు జవాబుదారీగా పనిచేసే మన్ననలను పొందాలని, పోలీస్ స్టేషన్కు రావాలని ఉండదని వచ్చిన ప్రతి ఫిర్యాదుకు న్యాయం చేసే విధంగా పోలీస్ వ్యవస్థ ఉండాలని సూచించారు. గత బి ఆర్ఎస్ ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీస్ పేరుతో భార్య భర్తను కిరాతకంగా హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని తద్వారా పోలీసులపై చెడ్డ పేరు వస్తుందని వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో విద్య వైద్యం రక్షణ కు ప్రాధాన్యత నిచ్చి ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందే విధంగా చర్యలు చేపట్టుతోందని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు ముందుండాలని ప్రతి ఫిర్యాదుకు న్యాయం చేస్తేనే పోలీసులకు మంచి పేరు వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా పాలనలో ఇప్పటివరకు ఇచ్చిన ప్రతి హామీని పారదర్శకంగా, ఆర్థికంగా లోటు ఉన్న హామీలన్నీ దశలవారీగా నెరవేర్చుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే విజయ రమణారావు కోరిక మేరకు ఎలిగేడు మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ముఖ్య మంత్రితో చర్చించి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం 22,500 కోట్ల నిధులు కేటాయించి,నాలుగు సంవత్సరాల పాలనలలో 20 లక్షల మంది నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని వారు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్ రెడ్డిని శ్రీధర్ బాబును, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు ను, ఎమ్మెల్యే విజయరమణారావును ,మక్కాన్సింగ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ ను, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావును ,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను ,పోలీస్ అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝ తోపాటు డిసిపి కరుణాకర్, సిఐలు, ఎస్సైలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయి రి మహేందర్, నాయకులు దన్నాయక్ దామోదర్‌రావు, దన్ నాయక్ శ్రీనివాసరావు, కుమార్ కిషోర్, బిరుదు కృష్ణ, పల్ల సురేష్, ముస్త్యాల రవీందర్, ఎలిగేడు మాజీ సర్పంచ్ సింధుజ తో పాటు నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# తిరుమల హిల్స్ పార్కు స్థలం పూర్తిస్థాయిలో కాపాడాలి




**రాజేంద్రనగర్, జూన్ 13 (జనం సాక్షి) :** గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ సర్వే నెంబర్ 87, 119 సర్వే నెంబర్లలో హైడ్రా ఆదేశాల మేరకు కడీలు పాతిన పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఎందుకు వేయడం లేదని స్థానిక కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 87,119 సర్వే నెంబర్ లలో తిరుమల హిల్స్ కాలనీ వాసుల ఫిర్యాదుతో మే21 న హైడ్రా మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగి తిరుమల హిల్స్ పార్క్ స్థలాన్ని కాపాడారు. కానీ తిరుమల హిల్స్ పార్కు స్థలం మొత్తం 6054 చదరపు గజాల స్థలానికి కడీలు పాతి ఆదేశాలు జారీ చేసిన కేవలం 5000 చదరపు గజాల స్థలం వరకే పెన్సింగ్ వేశారని మిగతా 1054చదరపు గజాల స్థలం కు కడీలు పాతిన ఫెన్సింగ్ ఎందుకు వేయడం లేదని స్థానిక కాలనీవాసులైన తిరుమల హిల్స్ ,డాలర్ హిల్స్, సెక్రటేరియట్ కాలనీ, బైయూట్ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీ సంక్షేమం కోసం ఇప్పటికైనా మున్సిపాలిటీ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులు హైడ్రా ఆదేశాల మేరకు మిగతా 1054 గజాల స్థలంను కలుపుకొని పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ వేసి, పార్కు అభివృద్ధి పనులు ప్రారంభిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

### కోర్టు ఆదేశాల మేరకే ఫెన్సింగ్ వేశాం

తిరుమల హిల్స్ పార్కు స్థలం గౌరవ హైకోర్టు న్యాయస్థానంలో కేసు ఉన్నందున కోర్టు ఆదేశాల మేరకే 5000 చదరపు గజాల స్థలం వరకే ఫెన్సింగ్ వేశామని మిగతాది కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని కమిషనర్, టిపిఓ తెలిపారు.

# వైకుంఠరథం లయన్స్ క్లబ్‌కు అందజేత

**సుల్తానాబాద్, జూన్ 13 (జనంసాక్షి) :** ప్రజల అవసరార్థం వైకుంఠ రథాన్ని సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ కు కీర్తి శేషులు వెంగల శంకరయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అందించారు.సుల్తానాబాద్ మండల కేంద్రంలోని స్వప్న కాలనీలో శుక్రవారం జిల్లా గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన 320 జి జిల్లా గవర్నర్ లయన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు సమక్షంలో కీ.శే.వెంగళ శంకరయ్య జ్ఞాపకార్థం అతని భార్య పద్మ కుటుంబ సభ్యులు కిషోర్–కవిత లు ప్రజల అవసరాల దృష్ట్యా వైకుంఠ రథాన్ని సుల్తానాబాద్ లయన్స్ క్లబ్బుకు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి జిల్లా గవర్నర్ వైకుంఠ రథాన్ని ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ మాట్లాడుతూ కీ.శే.లు వెంగళ శంకరయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు సేవలందించాలనే గొప్ప సంకల్పంతో వైకుంఠ రథాన్ని అందజేసి తమ ధాతృత్వాన్ని చాటుకున్నారని అభినందించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా కుల మతాలకతీతంగా ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను, ప్రాముఖ్యతను వివరించారు. అలాగే సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ గత 24 సంవత్సరాలుగా అవసరార్థులకు, ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా 320 జి జిల్లా గవర్నర్ లయన్




నడిపెల్లి వెంకటేశ్వరరావు, పెరుమాండ్ల హర్ష చక్రవర్తి, క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా కోశాధికారి ఇరుకుల్ల ఆనంద్, జి ఎల్ టి కోఆర్డినేటర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, జిల్లా కో–ఆర్డినేటర్లు వలస నీలయ్య, మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, గజబీంకర్ జగన్, జూపల్లి తిరుమల్ రావు, ఎరబెల్లి సుధీర్ రావు, పిట్టల వెంకటేశం, పూసాల సాంబమూర్తి, తమ్మనవేణి సతీష్, పల్ల అనిల్ కుమార్, నాగమల్ల ప్రశాంత్, ఏనుగు నరేందర్ రెడ్డి, ఆడెపు సదానందం, దాసరి ప్రసాద్, నోముల వేణుగోపాల్ తో పాటు కీ.శే.లు వెంగళ శంకరయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధుల చొరవతోనే స్వచ్ఛ భారత్

**ఖైరతాబాద్, జూన్ 13 (జనం సాక్షి) :** భారత దేశం ప్రజాస్వామిక దేశమని, ప్రజల ద్వారా ఎన్నుకున్న నాయకులకే భారత రాజ్యాంగం పట్టం కట్టిందని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజా ప్రతినిధులు చురుగ్గా పాల్గొన్నప్పుడు అభివృద్ధి బాగా జరుగుతుందని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. 543 మంది పార్లమెంట్ సభ్యులు, 4123 మంది ఎమ్మెల్యేలు, సుమారు రెండున్నర లక్షల మంది గ్రామ సర్పంచు లు కాకుండా జిల్లా పరిషత్ చైర్మన్లు, మున్సిపల్ ఛైర్మన్స్, కౌన్సిల్ సభ్యులు, వార్డు మెంబర్లు దేశం మొత్తంలో వేలల్లో ఉంటారని, వీరందరి ప్రధాన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథ కాలను ప్రజలకు అందేలాగా కృషి చేయడమ న్నారు. స్వచ్ఛ భారత్ కింద సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ గురించి టౌన్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యు లకు ఇచ్చే రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని డాక్టర్ రామేశ్వర్ రావు శుక్రవారం ఎస్కీలో ప్రారంభించారు. కర్ణాటక రాష్టం బెళగావి జిల్లా రామ్ దుర్గ్ టౌన్ మునిపల్ సభ్యులు 36 మంది పాల్గొన్న ఈ సమావేశంలో రామేశ్వర్ రావు మాట్లాడారు. స్వచ్ఛ భారత మిషన్ ఎక్సపర్ట్ ఎస్.ఏ ఖాదర్ సాహెబ్ సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ పాలసీ, ఆచరణపై మాట్లాడితే, మాగంటి జె. ముత్తుకుమార స్వామి వివిధ సంఘ సభ్యుల ద్వారా గ్రౌండ్ లెవెల్ నుండి స్వచ్ఛ భారత్ మిషన్ ఆచరణ, నిర్వహణపై మాట్లాడారు. రియల్ టైం



మానిటరింగ్, అక్యురేట్ డేటా కలెక్షన్, స్ట్రీమ్ లైన్ ఆపరేషన్స్ ద్వారా స్వచ్ఛ భారత్ ను సాధించ వచ్చని శివ సుబ్బారాయుడు కస్తూరి మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా రామ్ దుర్గ్ టౌన్ మునిసిపల్ కౌన్సిల్ సిబ్బంది రేపు సూర్యాపేట మున్సిపాలిటీని సందర్శిస్తారు. సమావేశంలో ఎస్కి పర్యావరణ విభాగం హెడ్ అనితా అగర్వాల్, ప్రోగ్రాం మేనేజర్ జి.నాగ మల్లేశ్వర రావు, అసిస్టెంట్ మేనేజర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేస్తే కేసులు నమోదు చేయాలి

**హైదరాబాద్, జూన్ 13 (జనంసాక్షి) :** హైదరాబాద్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల అట్రాసిటీ, ల్యాండ్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, భూ సమస్యలపై ఏర్పాటుచేసిన సమావేశంలో కమిషన్ సభ్యులతో పాటు చైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొని అట్రాసిటీస్, ల్యాండ్ సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులపై నిర్లక్ష్యం చేస్తే కమిషన్ చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి డిఎంసి, ప్రతి నెల సివిల్ రైట్స్ డే నిర్వహించి చట్టాలపై, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని అందుకు గాను ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. పోలీస్ డివిజన్ల పరిధిలో 2022 2025 వరకు ఇప్పడి వరకు 571 కేసులు నమోదు కాగా 135 ఇన్వెస్టిగేషన్ దశలో ఉన్నాయని అలాగే 15 చార్జిషీట్ కేసులు ఉన్నాయని పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని మిగిలిన వివిధ అంశాలకు సంబందిచిన కేసులు పరిష్కారం చేయడం జరిగిందని అన్నారు. ఇప్పుటివరకు అట్రాసిటీ కేసులలో 210 కేసులకుగాను ఇప్పటివరకు రెండు కోట్ల 47 లక్షలకు వరకు నష్టపరిహారం, మిగిలిన 343 కేసులకు నష్ట పరిహార అందించడం జరుగుతుందన్నారు. ఎస్సీ ఎస్టీల భూ సమస్యలకు సంబందించిన కేసులను పరిశీలించి సత్వర న్యాయం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ముకుంద రెడ్డి, డిసిపి




శ్వేత, కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, కురసం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి రాంప్రసాద్, బి. ఎల్లేష్, డి సుదర్శన్ బాబు, ఇటిక గోపి, బి వెంకటేశ్వర్ రావు, ఎన్జీవో పులి కల్పన, సోషల్ వెల్ఫేర్ ఉప సంచారకులు యూ. ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆర్డిఓ లు సాయిరామ్, రామకృష్ణ, అన్ని డివిజన్ల అదనపు పోలీస్ కమిషనర్లు, తహసీల్దార్లు వివిధ శాఖల జిల్లా సంక్షేమ అధికారులు ఆర్. కోటజీ, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న గుడి నిర్మాణానికి భారీ విరాళం

**చేవెళ్ల, జూన్ 13 (జనంసాక్షి) :** చేవెళ్లలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న గుడి నిర్మాణానికి చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగి రెడ్డిలు రూ.30 లక్షల భారీ విరాళం అందించారు. గుడి నిర్మాణ పనులు కోసం అప్పట్లో కొంత డబ్బు నగదు రూపంలో చెల్లించారు. మిగత డబ్బులు శుక్రవారం చెక్కు రూపంలో చెల్లించారు. ఆలయ నిర్మాణంకు ప్రకటించిన విరాళంను మొత్తం చెల్లించిన చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి దంపతులు, చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగి రెడ్డి దంపతులను గుడి ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి దంపతులు, చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి దంపతులు మాట్లాడుతూ...గుడి నిర్మాణంలో అందరి భాగస్వామ్యం ఉండాలని, చేవెళ్ల నిర్మిస్తున్న మల్లన్న గుడి నిర్మాణంలో తాము భాగస్వామ్యం కావడం పూర్వ జన్మ సుకృతమన్నారు. మల్లన్న స్వామి గుడి నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండాల రాములు, గుత్తి మల్లేష్, ఒగ్గు కుమార్, శ్రీనివాస్, టేకులపల్లి మల్లేష్ శేఖర్, కాంగ్రెస్ పార్టీ మాజీ యూత్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య

- ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత సాధించాలి
- విద్యార్థుల పట్ల వ్యక్తిగతమైన శ్రద్ధతో బోంచాలి
- యాలాల మండల ఎంపిడిఓ పుష్పలీల

**తాండూరు, జూన్ 13 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని యాలాల మండలం ఎంపీడీవో పుష్పలీల అన్నారు.శనివారం యాలాల మండలం దేవనూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయ శంకర్ సార్ బడి బాటలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుమిత్ర రాజేందర్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు పటేల్ మహేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యాలాల ఎంపిడిఓ పుష్పలీల,ఎంఈఓ ధర్మిది రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. దాత ఎస్ఐగా బోయినపల్లిలో విధులు నిర్వహిస్తున్న లింగమంతుల రాజు విద్యార్థిని



విద్యార్థులకు తనవంతుగా పెన్నులు, పెన్సిల్స్ మరియు టిఫిన్ బాక్సులు తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాలాల మండల ఎంపడీవో పుష్పలీల మాట్లాడుతూ బడి ఈడు పిల్లల్ని బడికి పంపించాలంటూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన విద్యను అభ్యసించిన ఉపాధ్యాయులు ఉంటారని, నాణ్యమైన విద్యను అందిస్తారన్నారు.తమ పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాల పంపించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, రెండు జతల యూనిఫామ్స్, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, వారానికి మూడు కోడిగుడ్లు, నాణ్యమైన ఉచిత విద్య, వెనుకబడిన విద్యార్థుల పట్ల వ్యక్తిగతమైన శ్రద్ధ, విశాలమైన తరగతి గదులు, అనుభవజ్ఞులైన, అర్హత గల ఉపాధ్యాయులచే విద్య బోధన చేస్తారన్నారు.ప్రభుత్వ పాఠశాలలో ఈ విధంగా చేయడం నా సర్వీస్ లో ఎక్కడ చూడలేదన్నారు. ప్రధానోపాధ్యాయులు మహేష్ కుమార్ చాలా ఘనంగా అందరి సహకారంతో నిర్వహించడం ఉత్తమ మన్నారు. ప్రధానోపాధ్యాయులు మహేష్ను ప్రత్యేకంగా అభినందించారు. ఎస్ఐ రాజు ఇదే పాఠశాలలో చదువుకొని అందరు నాకన్నా యున్నత స్థాయికి వెళ్ళాలి అని కోరినందులకు వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్ట్ ఖాసీం ,ఎస్.ఎం.ఎస్ మాజీ చైర్మన్ చెన్నప్ప, ఎ.పిఎం ప్రమీల, కృష్ణా, రఫీక్, రవిగౌడ్, శ్రీనివాస్, నర్సిములు, వీరేందర్ యువకులు, విద్యాభిమానులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, గ్రామస్తులు మరియు పాఠశాల బృందం శ్రీశైలం, పండరి, శ్రీనివాస్, కృష్ణా, హిమజా మరియు ఎడబ్య టీచర్స్ పద్మావతి, శిరీషా,గ్రామస్తులు లింగమంతుల నాగలింగం తదితరులు పాల్గొన్నారు.

# బండ లేమూర్ - పొర్లగడ్డ రోడ్డును వెంటనే రిపేర్ చేయించాలి

**ఇబ్రహీంపట్నం, జూన్ 13 (జనం సాక్షి) :** ఇటీవల కురిసిన వర్షానికి బండ లేమూర్ పొర్లగడ్డ రోడ్డు కొట్టుకుపోయి ఆర్టీసీ బస్సు అగిపోయినందున వెంటనే ఆ రోడ్డును రిపేర్ చేయించాలని మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. వర్షాలకు బండ లేమూర్ పొర్లగడ్డ రోడ్డుపై గుంతలు, వారెలు పడి రాకపోకలకు ఆటంకం ఏర్పడి ఆర్టీసీ బస్సు ను ఆర్టీసీ అధికారులు నిలిపివేశారని చెప్పారు. రంగారెడ్డి జిల్లా యాధాద్రి ,నల్లగొండ జిల్లాలకు చెందిన అనేక గ్రామాల ప్రజలకు ఇక్కడ నడుస్తున్న ఆర్టీసీ బస్సు ఎంతో సౌకర్యంగా ఉందని అన్నారు. ఈ బస్సు ఆపివేయడం వలన ప్రజలకు అసౌకర్యంగా ఉన్నదని వెంటనే ఆ రోడ్డుకు రిపేర్ చేసి బస్సు నడిచేలా చూడాలని స్థానిక ఎంపి,ఎమ్మెల్యే,ప్రభుత్వ అధికారులను కోరుతున్నట్లు చెప్పారు. గతంలో రోడ్డు రిపేర్ కి ప్రత్యేక నిధులు కేటాయించి రిపేర్ చేయడం జరిగింది. తాత్కాలికంగా రిపేర్లు చేస్తే ప్రతిసారీ వర్షాకాలంలో కొట్టుకపోతుందని అన్నారు. శాశ్వితంగా ఉండేటట్లు బిటి రోడ్డుకు నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు.



# కొల్చారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

- విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవు
- నిరంతరం వాహన తనిఖీలు చేసి రోడ్డు ప్రమాద నివారణ కు కృషి చేయాలి
- సైబర్ నేరాల పై ప్రజలకు నిరంతరం అవగాహనా కల్పించాలి
- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు




**కొల్చారం, జూన్ 13 (జనం సాక్షి) :** విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పోలీస్ సిబ్బందిని హెచ్చరించారు. కొల్చారం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బంది వివరాలను ఎస్సై మహ్మద్ గౌస్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సిబ్బంది యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిదప పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాలు, సిబ్బంది పని తీరును పరిశీలించడంతో పాటు పెండింగ్లో తీవ్రమైన నేరాల సి.డి ఫైల్స్, స్థిరాస్థి చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో కల నేర ప్రవృత్తి కల వారిని ప్రతి రోజు తనిఖీ చేయాలని, అలాగే ఆస్తి నేరాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని, పోలీస్ స్టేషన్ల పరిధిలో తిరిగే అనుమానితుల సమాచారాన్ని సేకరించాలని సిబ్బంది అంకితభావంతో విదులు నిర్వర్తించాలని కష్టంలో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు పోలీసులు స్వాంతన చేకూర్చాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అలాగే ప్రజలు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియామాలు పాటించాలని తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. అలాగే బ్లూ కోట్స్, పెట్రో కార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని మరియు డయల్ 100 కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్.పి గారు స్టేషన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీస్పీ ప్రసన్న కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్మాణాలకు జీరో పర్మిట్ సిస్టం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాలు



**మెదక్, జూన్ 13 (జనం సాక్షి) :** ప్రభుత్వ నిర్మాణాలకు జీరో పర్మిట్ సిస్టం ద్వారా కాంట్రాక్టర్లు ఆన్లైన్లో మైనర్, మినరల్స్, ఇసుక, కంకర కొనుగోలు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వీడియోకాన్ కాన్ఫరెన్స్ హాల్ నందు కలెక్టర్ రాహుల్ రాజ్ అధ్యక్షతన జరిగిన మైనింగ్ శాఖ సమన్వయ సమావేశంలో మైనింగ్ లైసెన్సుల జారీ, ఖనిజ వనరుల నిర్వహణ, మైనింగ్ లీజుల అనుమతులు అక్రమ మైనింగ్, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా ఒకటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి పనులకు కావలసిన ఇసుక ఇండెంట్ఇరిగేషన్, పంచాయిరాజ్, రోడ్లు భవనాలు, తదితర శాఖల ఇంజనీరింగ్ అధికారులు జిల్లాలో ఉన్న స్టాక్ పాయింట్ల నుండే తెప్పించుకోవాలని, అదనపు అవసరం నిమిత్తం ఇతర జిల్లాల ఇసుక రీచ్ నుండి తెప్పించుకోవాలన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి ప్రతి మండలంలో ఏర్పాటుచేసిన ఎన్ఫోర్స్మెంట్ బృందాలు క్రియాశీలకంగా పనిచేసే అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలన్నారు. జిల్లాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను అవసరమయ్యే ఇసుకను ఉచితంగా అందించాలని, దానికి అవసరమైన రవాణా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడు భరిస్తారని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఏడి మైన్స్ విజయకుమార్ రాజు, రోడ్ల భవనాల ఇరిగేషన్, రవాణా, రెవెన్యూ సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం




**చేర్యాల, జూన్ 13 (జనంసాక్షి) :** భూభారతితో భూ సమస్యలకు పరిష్కారమవుతాయని చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్ తెలిపారు. శుక్రవారం చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో భూభారతి కార్యక్రమానికి తహసిల్దార్ హాజరై గ్రామ రైతుల భూమి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి సమస్యలు ఉన్న రైతులు భూభారతిలో దరఖాస్తు చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్ము రవి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, ఆకునురు గ్రామ అధ్యక్షులు ఆకుల రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బూమని బాలరాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి



**సంగారెడ్డి, జూన్ 13 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పెద్ద గోపులారం, గొర్రె గట్టు తాజా మాజీ ఎంపీటీసీ బి. పాండు అన్నారు. శుక్రవారం మునిపల్లి మండలంలోని పెద్ద గోపులారం గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బి. పాండు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూభారతి ద్వారా రైతుల భూ పరిధిని సరి చేసుకునే అవకాశం లభించిందన్నారు. రైతులకు భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే రెవిన్యూ సదస్సుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



**మల్దకల్, జూన్ 13 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో విద్యా నూతన విద్యా సంవత్సరంగాను మండలంలోని ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశాని ఉద్దేశించి ఎంఈఓ సురేష్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పిల్లల యొక్క వివరాలు ఆన్లైన్లో రిజిస్టర్లు ఒకే విధంగా ఉండాలని,పిల్లలకు నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని ఆదేశించారు.విద్యార్థులందరికీ బుక్స్,యూనిఫామ్స్, నోట్ బుక్స్ అందించాలని,అలా ఇచ్చిన వాటిని ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, మండలనోడల్ అధికారి వి. నరేష్, మండల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పరమన్న, పద్మావతి సిబ్బంది, వెంకటేష్, విజయ్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని యాదగిరిగుట్టకు పాదయాత్ర



**చేర్యాల, జూన్ 13 (జనంసాక్షి) :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం చేర్యాల పట్టణ బీఆర్ఎస్ నాయకులు భూమిగారి రాజేందర్, పుట్ట యశ్వంత్, కల్లాటి విశ్వతేజ లు పాదయాత్రగా తరలివెళ్ళారు. అంతకు ముందు పట్టణంలోని అంగడి బజార్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల నర్సయ్య, మండల అధ్యక్షులు అనంతుల మల్లేశం లు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభింపజేశారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో గాయపడి సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనగామ పల్లా రాజేశ్వర్ రెడ్డి త్వరగా కోలుకోవాలన్న కోరికతో ఈ పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఎమ్మెల్యే ఆరోగ్యం త్వరగా మెరుగుపరచాలని, వారికి లక్ష్మి నర్సింహా స్వామి ఆశీస్సులు ఉండాలని నేడు గుట్టలో మొక్కులు చెల్లించనున్నారు. ఈ జెండా ఊపి ప్రారంభించిన కార్యక్రమంలో దూల్మిట్ట మండల నాయకుడు నాచగొని వెంకట్ గౌడ్, పూర్మ వెంకటరెడ్డి,ఎర్రోళ్ల రామచంద్రం, మంచాల కొండయ్య, యూత్ మండల అధ్యక్షులు రాజేష్, కొమురవెల్లి మండల యూత్ అధ్యక్షులు ఎరుపుల మహేష్, కర్రోల్ల ఎల్లీషా, భూమిగారి దామోదర్,రామగళ్ళ నాగరాజు, భూమిగారి శ్రీరామ్, పాకాల అనిల్, కర్రోల్లయాదయ్య, సుంచు నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అపరిచితుల వ్యక్తుల మాటలు నమ్మొద్దు
- చేర్యాలలో షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన




**చేర్యాల, జూన్ 13 (జనంసాక్షి) :** ప్రజలకు మహిళలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాలపై శుక్రవారం చేర్యాల పట్టణంలోని ఎస్ బీఐ బ్యాంక్ వద్ద మహిళలకు హుస్నాబాద్ షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్కూల్ వెళ్లే పిల్లల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని సూచించారు. సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిది సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి బానిసలు కావద్దు సూచించారు. పిల్లలను వేసవికాలం అయినందున ఎటుపడితే అటు మరియు ఈతకు పంపవద్దని సూచించారు. రాత్రి సమయాలలో ఇంటికి తాళం వేసి ఇంటి ముందర లేదా డాబాపై పడుకునే అలవాటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మహిళలు వ్యవసాయ పనులపై ఒంటరిగా వెళ్లేటప్పుడు వంటిపై బంగారం ఉంటే దొంగతనం జరిగే అవకాశం ఉంటుంది జాగ్రత్త పడాలి మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. అవగాహన కల్పించిన షీటీమ్ బృందం హెడ్ కానిస్టేబుల్ సదయ్య, మహిళ కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే



**గద్వాల్ రూరల్, జూన్ 13 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల టౌన్ లో వివిధ వార్డ్ లకు సంబంధించిన సీఎం సహాయం నిధి ద్వారా 17 మంది లబ్ధిదారులు 5 లక్షల 500 రూపాయలు మంజూరైన చెక్కులను గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జి.వేణుగోపాల్,మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్,మాజీ ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ మాజీ కౌన్సిలర్స్ విష్ణు ప్రియదొలు,మురళి, విజయ మెస్ నాగిరెడ్డి,నరహరి శ్రీనివాసులు,నాయకులు గోవిందు,ధర్మ నాయుడు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా భూభారతి చట్టం



**మహమ్మదాబాద్, జూన్ 13 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్తగా భూభారతి చట్టం తెచ్చింది శుక్రవారం మహమ్మదాబాద్ మండల పరిధిలో గాదిర్యాల్ గ్రామంలో భూభారతి సదస్సు కార్యక్రమం నిర్వహించారు.అనంతరం మండల అధ్యక్షుడు కే.నారాయణ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా భూ సమస్యలను భూభారతి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.రైతులు తమ భూమి సమస్యలను భూభారతి చట్టంద్వారా సులుభంగా పరిష్కరించువచ్చు అని తాసిల్దార్ విద్యాసాగర్ రెడ్డి తెలియజేశారు.కార్యక్రమంలో ఆర్ఐ హైమద్,కేఎం నారాయణ,వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. రాఘవేందర్ రెడ్డి మాజీ సర్పంచి పి వెంకట్రాంరెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఇ. హన్మంత్ గౌడ్,జి చంద్రయ్య,శీలం హన్మయ్య, కేశవులు, నారాయణ, పంచాయతీ సెక్రెటరీ హాజీ, సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల సంఖ్య పెంచాలి



**సంగారెడ్డి, జూన్ 13 (జనం సాక్షి) :** అంగన్వాడి కేంద్రాలలో పిల్లల సంఖ్య పెరిగేలా చూడాలని మండల విద్యాధికారి భీమ్ సింగ్ అన్నారు. శుక్రవారం మునిపల్లి మండలంలోని పెద్ద చల్మెడ అంగన్వాడి కేంద్రంలో ఉపాధ్యాయురాలు రేణుక ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరైనారు. ముందుగా అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో పిల్లల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న పిల్లలకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు అర్థమయ్యేలా బోధన చేయాలని అంగన్వాడి ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయురాలు రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

- సిడిపిఓ హేమలత



**మల్దకల్, జూన్ 13 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నెలవారి సమీక్ష సమావేశం స్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎమ్స్ సూపర్వైజర్స్, ఎంఎల్హెచ్‌పి హెచ్ఎస్‌కు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, డయేరియా విరేచనాలు దృష్టిలో ఉంచుకొని మీ గ్రామాల పారిశుద్ధ్య సిబ్బందితో వర్షం నీరు నిల్వ ఉండకుండా గుంతలలో ఆయిల్ బాల్స్. వేయించాలని తద్వారా దోమలు వృద్ధి చెందకుండా అరికట్టవచ్చని డాక్టర్ అన్నారు.వారంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో తప్పక నిర్వహించాలని, దోమలు వృద్ధి చెందకుండా అప్డేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని,గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న వారిని తక్షణమే వారికి చికిత్స చేయించాలని లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని డాక్టర్ స్వరూపారాణి సిబ్బందికి సూచించారు.సిడిపిఓ హేమలత మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్వాడీలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో పరస్పరం సమన్వయంతో పిల్లలను సూచించిన ఎత్తు బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి తగిన పోషకాహారం అందించడం అవసరమైతే డాక్టర్ ద్వారా చికిత్సలు అందించి గర్భిణీలకు పోషకాహారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిహెచ్ ఓ వెంకటస్వామి, సూపర్వైజర్ శ్రీధర్,వెంకట నర్సమ్మ,హెల్త్ అసిస్టెంట్లు దేవన్న, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో 50 శాతం ఫీజు రాయితీ



**సంగారెడ్డి, జూన్ 13 (జనం సాక్షి) :** వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులో 50 శాతం రాయితీ ప్రకటించింది. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా విద్య అధికారి వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 50 శాతం వరకు ఫీజులో రాయితీ కల్పించాలని సంగారెడ్డి జిల్లా విద్యాశాధికారి (డీఈఓ) వెంకటేశ్వర్లు యాజమాన్యాలను కోరారు. దీనికి సంబంధించి ఉత్తర్వులను జూన్ 11న విడుదల చేశారు. సంగారెడ్డి జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్ట్ ల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో 50 శాతం వరకు ఫీజులో రాయితీ కల్పించాలని సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సాయినాథ్, ఉపాధ్యక్షులు ఎర్ర వీరేందర్ కోరారు. దీనికి డీఈవో వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించారు. వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు. ఏదైనా పాఠశాల యాజమాన్యం వినకపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉత్తర్వులు జారీ చేయడం పట్ల డీఈవో వెంకటేశ్వర్లుకు సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శ లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సాయినాథ్ మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని సంగారెడ్డి జిల్లాలోని జర్నలిస్టులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు గుణాత్మక విద్య

- విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వ కృషి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 13 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టేకుమట్ల, కిష్టాపూర్ లలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, టేకుమట్లలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి హాజరు పట్టికలు, రిజిస్టర్లు, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు, వంటశాల, భోజనశాల ఇతర అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయులు తమకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలని, అంగన్వాడీ కేంద్రంలో నూతనంగా చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో భాగంగా పిల్లలతో అక్షరాలు దిద్దించారు. అంగన్వాడీ కేంద్రాల నుండి పాఠశాలలకు వచ్చే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలను అమలు చేస్తూ నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు, కొలతలు ఎప్పటికప్పుడు పరిశీలించి వారి శారీరక, మానసిక ఎదుగుదలను పర్యవేక్షిస్తూ లోపం గల పిల్లలను గుర్తించి వారు సాధారణ స్థితికి చేరుకునే వరకు పోషకహారం, అవసరమైన మందులను అందించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులు ఇంగ్లీష్ వ్రాయడం, చదవడం, మాట్లాడటం నేర్పించాలని తెలిపారు. బడి వయస్సు గల ప్రతి ఒక్కరు పాఠశాలలోఉండాలని, బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి విద్య ఆవశ్యకతపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలు పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలలో అందిస్తున్న ఆహారం, సౌకర్యాలపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకొని బడికి రాని తమ స్నేహితులను పాఠశాలకు తీసుకురావాలని వారికి తెలిపారు. చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలలో నిలువాలని ఆకాంక్షించారు. టేకుమట్ల, కిష్టాపూర్ గ్రామాలలోని గ్రామపంచాయతీ కార్యాలయాలలో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులను మండల తహశిల్దార్ వనజారెడ్డితో కలిసి సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులను రికార్డులతో సరి చూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాలలో (పైలెట్ మండలం అయిన భీమారం మినహా) కార్యచరణ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్డ్ దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు జతపరిచినట్లయితే త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. శ్రీధర్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఇంటర్ బోర్డు అధికారి యాదగిరి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జూన్ 13 (జనం సాక్షి) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించి, తద్వారా విద్య ప్రమాణాల పెంచేందుకు కృషి చేస్తామని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ కార్యదర్శి యాదగిరి తెలిపారు. శుక్రవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో మౌలిక సదుపాయాలు, కల్పించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి, ఆ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్ కళ్యాణి ఆయనను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్య ప్రమాణాలు పెంచేందుకు ప్రణాళికలు తయారు చేసుకుని, తదనుగుణంగా విద్య ప్రమాణాలు పెంచేందుకు అధ్యాపకులు పని చేయాలని సూచించారు. కళాశాలలో సమస్యలను ఇంటర్ బోర్డు కమిషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేస్తాం

- ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 13 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి నిర్మాణాలను సాధ్యమైనంతగా త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు పట్టణ ప్రజల సహకారంతో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ లను కూల్చివేసే కార్యక్రమాలను పరిశీలించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ... గురువారం ప్రారంభించిన ఆలయ ప్రాంగణంలోని షాపింగ్ కాంప్లెక్స్ ను రెండు మూడు రోజుల్లో పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. విశ్వనాథస్వామి ఆలయాల అంతర్భాగంలో కూడా ఆగమ శాస్త్ర పండితుల సలహాలతో మెరుగుపరుచేందుకు కృషి చేస్తామని అన్నారు. అలాగే పట్టణంలోని రోడ్డు వెడల్పు కార్యక్రమాలు ఐటీ పార్కు నిర్మాణ పనులను లక్ష్మీ టాకీస్ నుండి రంగపేట వరకు వెళ్లే ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణాలు పట్టణంలో మాతా శిశు ఆసుపత్రి పనులు ఇదివరకే చేపట్టడం జరిగిందని వచ్చే ఐదు ఆరు నెలల్లో ఇవన్నీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూతగాదాలో ఇద్దరికి గాయాలు

**బచ్చన్నపేట జూన్ 13 ( జనం సాక్షి):** భూతగాదాలలో తండ్రి కొడుకులకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కొన్నే గ్రామంలో జరిగింది వివరాల్లోకి వెళితే మండలంలోని కొన్నె గ్రామంలో కుర్రం కిష్టయ్య. కుర్రం నరసింహులు ఇద్దరూ సొంత అన్నదమ్ములు. ఇద్దరికీ భూమి సమస్యలు ఉన్నాయి, గురువారం సాయంత్రం వ్యవసాయ పొలాల్లో నరసింహులు కుమారుడు గణేష్ కిష్టయ్య అతని కుమారుడు భాస్కర్ తో గొడవ పడ్డారు. ఇంటికి వచ్చిన తర్వాత, కుర్రం నరసింహులు, అతని భార్య అంజమ్మ కుమారుడు గణేష్ తమ మనస్సులో పగ పెంచుకుని కుర్రం కిష్టయ్య ఇంటికి వెళ్లి కిష్టయ్య కుటుంబంతో గొడవపడి కొట్టడంతో . ఆ సమయంలో గణేష్ కిష్టయ్య అతని కుమారుడు భాస్కర్ పై కత్తితో దాడి చేశాడు. ఆ దాడిలో కిష్టయ్య అతని కుమారుడు భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు.

# దేశంలో మోడీ పాలన ఆదర్శనీయం

- 11 ఏళ్లుగా చిత్తశుద్ధితో పనిచేస్తున్న బిజెపి ప్రభుత్వం..
- తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చి తీరుతాం..
- బిజెపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లాపూర్ శ్రీనివాస్..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** దేశంలో నరేంద్ర మోడీ పాలన ఆదర్శనీయంగా కొనసాగుతుందని, గత 11 ఏళ్లుగా భారత్ ప్రగతి పథంలో దూసుకెళ్తుందని, రానున్న రోజుల్లో తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చి బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు చేస్తామని బిజెపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా ఇంచార్జి అల్లాపూర్ శ్రీనివాస్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరునగర్ లో గల బిజెపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అల్లాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ పాలన 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆయా జిల్లాల్లో బిజెపి ప్రత్యేక సమావేశాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు రావడం జరిగిందన్నారు. ముఖ్యంగా నరేంద్ర మోడీ సారథ్యంలో దేశంలో బిజెపి మెరుగైన పాలనను అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ, అవగాహన లేక కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదని చెప్పారు. బిజెపి లోని అన్ని కమిటీల సభ్యులు క్షేత్రస్థాయిలో మోడీ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. అనంతరం బిజెపి రామగుండం నియోజకవర్గ ఇన్చార్జి కందుల సంధ్యారాణి మాట్లాడుతూ దేశంలో 11 సంవత్సరాల పాటు బిజెపి అన్ని వర్గాల ప్రజలకు మంచి పాలన అందించడం జరిగిందన్నారు. ముఖ్యంగా నిరుద్యోగులకు, యువకులకు, రైతులకు, మహిళలకు, అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమైన పథకాలను దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టి ప్రధాని నరేంద్ర మోడీ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. మౌలిక సదుపాయాలు, అభివృద్ధి మార్గాలను అన్వేషిస్తూ, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తూ భారత్ ముందంజలో ఉండేలా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. దేశ సరిహద్దు విషయంలో సింధూర్ లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారని తెలియజేశారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు కూడా అవకాశవాద పార్టీలని, ప్రజలు వారిని నమ్మే పరిస్థితిలో లేరని, రానున్న రోజుల్లో బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు చేయడం ఖాయమని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు, క్రమశిక్షణ సంఘం కన్వీనర్ నాగపూరి రాజమౌళి గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపయ్య, జిల్లా వికసిత్ భారత్ కన్వీనర్ జన్నె మొగిలి, పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, వికసిత్ భారత్ కో కన్వీనర్ దొంగల రాజేందర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు బట్టు రవి, పార్టీ ముఖ్య నాయకులు పొలుసాని తిరుపతిరావు, వేషాల సత్యవతి, సయ్యద్ గాలిఫ్, పులుగుజ్జు రాజు, కలివేద మోహన్, ఊరటి మునీందర్, ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

- విద్య, వైద్యం, ఆరోగ్యం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**కొత్తగూడ జూన్ 13 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని గోవిందాపురం గ్రామపంచాయతీ నూతన భవనం ప్రారంభం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీల పంపిణీ తదితర కార్యక్రమాల నిమిత్తం జిల్లా కలెక్టర్,మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ తో కలిసి రాష్ట్ర మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం తమ బాధ్యత అన్నారు. గత 10 సంవత్సరాలలో పేదవారికి ఇండ్లు నిర్మించే పథకం ఎవరు ప్రవేశపెట్టలేదని ప్రస్తుత ఇందిరమ్మ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవారికి సొంత ఇంటి నిర్మాణం కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది ఇందిరమ్మ పథకం అని మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల మంజూరు నిర్మాణాలు కొనసాగుతున్నాయని, దశలవారీగా ప్రతి ఒక్కరికి సొంత ఇంటిని నిర్మించి ఇవ్వడం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. స్వయం సహాయక మహిళా బృందాలలో సభ్యురాలుగా ఉన్నవారికి వడ్డీ లేని రుణాల ద్వారా ఇండ్ల నిర్మాణం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క మహిళలు స్వయం సహాయక బృందాలలో చేరి ఆర్థిక అభివృద్ధి చెందాలని కుటుంబానికి చేయూతగా ఉండాలని కోరారు. ఇప్పటికే మహిళ ఆర్థిక అభివృద్ధి కోసం గ్రామ ఐక్య సంఘాలకు మహిళ పొదుపు సంఘాలకు బస్సు రుణాలు, పెట్రోల్ పంపులు, రైస్ మిల్లులు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, మంజూరు, వడ్డీ లేని రుణాలు అందించడం జరుగుతుందన్నారు. స్కూల్ యూనిఫార్మ్ స్టిచ్చింగ్ కోసం మహిళల సంఘాలకు జతకు 75 రూపాయల చొప్పున అందించి అటు వారి ఆర్థిక అభివృద్ధి ఇటు పిల్లలకు చదువు అందించడం జరుగుతుందని అన్నారు. కొత్తగూడ మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం, డిగ్రీ కాలేజ్ , పాకాల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పాకాల కొత్తగూడం గంగారం వరకు సాగు నీరును ఇవ్వడం కోసం ప్రత్యేక కార్యచరణ చురుకుగా కొనసాగుతుందని తెలిపారు. అంతకుముందు మండలంలో 20 లక్షల వ్యయంతో నిర్మించిన గోవిందాపురం నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవం చేశారు. బోయ రజిత-శ్రీను, దంపతుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ముగ్గు పోసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంక్షేమ పథకాలు సన్న బియ్యం, రైతు బంధు, రైతు భరోసా, బోనస్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, తదితర పేదల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టొప్పో, రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణవేణి, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా వెల్ఫేర్ అధికారిని ధనమ్మ, ప్రత్యేక అధికారి సురేష్, గంగారం కొత్తగూడా మండలాల తహసిల్దారులు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు సిబ్బంది ఉన్నారు.

# సేంద్రియ వ్యవసాయం కిచెన్ గార్డెన్స్ పై అవగాహన సదస్సు



**నూగూర్ వెంకటాపురం జూన్ 13(జనం సాక్షి):** వెంకటాపురం మండలం కేంద్రంలో తిప్పాపురం పంచాయతీ పరిధిలో గల కలిపాక గ్రామంలో సేంద్రీయ వ్యవసాయం కిచెన్ గార్డెన్స్ పై అవగాహన సదస్సు కాఫేడ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యం లో ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఈఓ శ్రీ కన్య పాల్గొని హాజరై మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో పంటల పెంపకానికి ఖరీదైన ఎరువులు పురుగుల మందులు వాడవలసిన అవసరం లేదని అన్నారు. అదనపు ఖర్చు ఉండదు రసాయన ఎరువులు వినియోగించే ఉత్పత్తులతో పోలిస్తే సేంద్రియ ఉత్పత్తులు మరింత పోషకమైనవి ఆరోగ్యానికి మంచివని తెలిపారు. ఇంటిలో కొంచం ఖాళీ స్థలం లో కూరగాయల మొక్కలు పెంచటం వలన స్వంతంగా పరిశుభ్రమైన వాతావరణంలో పండి%శీ%చడమే కాకుండా ఎంతో సమయం డబ్బు ఆదా అవుతుందని అన్నారు. అన్నిటికి మించి ఆరోగ్యం ఆత్మ సంతృప్తి కలుగుతుంది అని తెలియచేశారు. ఈ కార్యక్రమానికి వెంకటాపురం మండల కోఆర్డినేటర్ జి హనుమంత,వాజేడు కోఆర్డినేటర్ జి కామేష్, యానిమేటర్ ప్రశాంత్ , నరేష్ గ్రామస్తులు 80మంది పాల్గొన్నారు.

## భూభారతితో భూసమస్యల పరిష్కారం

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, జూన్ 13(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సమస్యను పరిష్కార మయ్యేలా చూస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం గీసుగొండ మండలం ఎలుకుర్తి లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొని భూ సమస్యలపై అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలపై ఎవరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగొద్దన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని.. ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి భూ భారతి చట్టంతో పరిష్కార మార్గం చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బల్దియా కమిషనర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన చాహాత్ బాజ్ పేయి



**వరంగల్ ఎంజీఎం, జూన్ 13(జనంసాక్షి):** బల్దియా నూతన కమిషనర్ గా చాహాత్ బాజ్ పయ్ శుక్రవారం ప్రధాన కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తానని, కరీంనగర్ లో మున్సిపల్ కమిషనర్ గా పనిచేసిన అనుభవం ఉందని మున్సిపల్ సర్వీసుల పై అవగాహన ఉందని స్పష్టంచేసిన కమిషనర్ సానిటేషన్పై ప్రత్యేక దృష్టి సారించి నగర పరిశుభ్రతకు తోడ్పడడంతోపాటు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే లక్ష్యం,భవన నిర్మాణ అనుమతులకు జారీ చేసే విధానాన్ని, శానిటేషన్ విభాగం లో విధులు నిర్వహించే సిబ్బంది సంఖ్య చెత్త తరలింపు జరిపే వాహనాలకు జీ పి ఎస్ అనుసంధానం, తదితర అంశాలను సంబంధిత విభాగాల అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాల అధికారులు సిబ్బంది సహకారంతో నగర అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. అనంతరం బల్దియా లోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు సిబ్బంది కమిషనర్ కు పుష్పగుచ్చాలు, పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషనర్ కు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో డిప్యూటీ కమిషనర్ (అడ్మిన్)రాజేశ్వర్ సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఇంచార్జి ఎస్ఈ, సిటీ ప్లానర్ లు శ్రీనివాస్, రవీందర్ రాడేకర్,పి ఆర్ ఓ ఆయుబ్ అలీ, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, ఈ ఈ లు డి ఈ లు, ఆర్ ఓ లు ఆర్ ఐ లు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే హరీష్ బాబు, కలెక్టర్ వెంకటేష్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జూన్ 13 ( జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపనకు కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, జిల్లా కలెక్టర్ వెంకటేశులు కోరారు. శుక్రవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని బట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లలచే అక్షరాభ్యాస కార్యక్రమం చేయించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా, ఏ మాత్రం తేడా లేకుండా విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, తాహ సిల్దార్ మధుకర్, ఎంపీడీవో కోట ప్రసాద్, మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు దేవాజీ, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ పాల్గొన్నారు.

## నాటకం అంటే గుర్తుకు వచ్చేది సురభి నాటకం

- పల్లగుట్ట సురభి థియేటర్లో భూకైలాస్ నాటకం



**స్టేషన్ ఘన్పూర్, జూన్ 13 ( జనం సాక్షి ) :** నాటకం అంటే గుర్తుకు వచ్చేది సురభి నాటకం అని చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట సురభి థియేటర్లో వేసిన భూకైలాస్ నాటకం అందర్నీ ఆకట్టుకుందని సురభి నాటక కళా సంఘం అతిథులు ఆవేటి రామ్మో హన్ రావు, ఆవేటి వేణు మాధవ్, రేకంధర్ నాగబాబు అన్నారు. నాటకం అంటే మొదటిగా గుర్తుకు వచ్చేది సురభి నాటకం అని, అటువంటి నాటక చరిత్రకు ప్రాణం పోసి తమ జీవితాలను నాటక కళకు అంకితం చేసిన ఎందరో మహానుభావులను స్మరించుకుంటూ సురభి మనగడకోసం కొత్తఅడుగులు వేయడం కోసం, పల్లగుట్ట సురభిథియేటర్ వేదికగా సెమినార్ నిర్వహిం చారు. దీనికి సురభి నాటక కళా సంఘం పూర్వ అధ్య క్షుడు ఆవేటి రామ్మోహన్ రావు అధ్యక్షత వహించగా అతిథులుగా ఆవేటి వేణుమాధవ్, రేకంధర్ నాగబాబు, నిఖిలేష్, నాగరాజు, శివశంకర్ తో పాటు 50 మంది కళాకారులు సెమినార్ లో పాల్గొన్నారు. ఇందులో రావణబ్రహ్మగా మోహన్, కైకసిగా హేమ మాలిని, శంకరుడుగా అజయ్, విరూపాక్షకుడిగా శివశంకర్, పార్వతిగా సాయి, మండోదరిగా దీపిక, విశాలాక్షిడిగా గోపి, దర్శకత్వం రామ్మోహన్, హార్మోని యం కోటేశ్వర్, తబలా బాబురావు తదితర కళాకారు లు చక్కగా ప్రదర్శించారు.

జనంసాక్షి www.janamsakshi.org | శనివారం 14 జూన్ 2025

# అభివృద్ధి పనుల్లో ఖమ్మంను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు



**రఘునాథపాలెం , జూన్ 13 (జనం సాక్షి) :** రఘునాథపాలెం మండలంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు పర్యటించి రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. రేగులచలక గ్రామం ఎస్సీ కాలనీలో 20 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన, రేగులచలకలో 22 లక్షల 50 వేలతో నిర్మించిన అంతర్గత రోడ్లను ప్రారంభోత్సవం చేసారు. కోయచలక గ్రామం ఎస్సీ కాలనీలో 20 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు, కోయచలక నుండి కామాంచికల్ వరకు 2 కోట్ల 50 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన, కోయచలకలో 16 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభోత్సవం చేసారు. కోయచలక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఆదర్శంగా ఖమ్మంను తీర్చిదిద్దుతామని సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం అందరూ ప్రశాంతంగా, కలిసి మెలిసి పని చేసుకోవాలని రాష్ట్రంలో గత పాలకులు ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అదనంగా వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని,ప్రజా పాలనకు ప్రకృతి కూడా సహకరిస్తుందని, సమృద్ధిగా వర్షాలు పడుతున్నాయని రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారని, నాట్ల కంటే ముందే రైతుల బ్యాంకు ఖాతాలో రైతు భరోసా నిధులు జమ చేయడం జరుగుతుందని గ్రామాలలో రోడ్లు ఇరుగ్గా ఉన్నాయని, భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు వస్తాయని, గ్రామస్తులు చర్చించుకుని రోడ్డు విస్తరణ పనులు చేసేందుకు సహకరించాలని, ప్రజలు ఒప్పుకుంటే డబుల్ రోడ్డు వేస్తామని అన్నారు. మన గ్రామాలను పరిశుభ్రంగా పెట్టుకుంటే రోగాలు రావని, మన డబ్బులు మన చేతిలో ఉంటాయని, పిల్లలను ఉన్నత చదువులు చదివించుకొని సుఖంగా ఉండవచ్చని అన్నారు. అపరిశుభ్రత వల్ల కుటుంబాలు నాశనం అవుతాయని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసిన తర్వాత వాటి నిర్వహణ కూడా పకడ్బందీగా జరగాలని రాష్ట్రంలో ఖమ్మం జిల్లాకు మంచి పేరు ఉందని, అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రిని ఒప్పించి మరో వంద కోట్లు తీసుకుని వచ్చిన వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే అభివృద్ధి పనులను సమాంతరంగా చేపడుతున్నామని అన్నారు. అనంతరం మంత్రి, లబ్ధిదారులకు రేషన్ కార్డులను, కోయచలక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలను అందజేశారు. చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డి.సి.సి.బి. చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి డి. పుల్లయ్య, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 13 (జనంసాక్షి) :** నేడు జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులు, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, డ్రంకన్ డ్రైవ్ కేసులు, మోటారు ట్రాన్స్ పోర్ట్, రోడ్ నిబంధనల ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని తెలిపారు.రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకోవద్దన్నారు.న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీపడ తగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీపడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు సంబంధిత పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని అన్నారు.

## పోగొట్టుకున్న13 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగింత

- ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 2276 మొబైల్ ఫోన్లను రికవరీ
- అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్




**ఖమ్మం, జూన్ 13 (జనం సాక్షి) :** ఖమ్మం కమిషనరేట్ పోగొట్టుకున్న13 మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు తెలిపారు. పోగొట్టుకున్న/చోరీకి గురైన మొబైల్ ఫోన్ ను బాధితులు %జజు×=% పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో మొబైల్ ఫోన్ ట్రాక్ చేసిన ఐటి సెల్ బృందం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచనలతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో యజమానులకు అడిషనల్ డీసీపీ చేతుల మీదుగా అప్పగించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ విధానంతో సుమారు నాలుగు లక్షల విలువ గల 13 ఫోన్లను ట్రేస్ చేసి, నిజమైన యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. ఒక్కొక్క మొబైల్ ఫోన్ యాభై వేల నుండి 10 వేల రూపాయలు ఖరీదు గల ఫోన్లను ట్రాక్ చేయడం జరిగిందన్నారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే 4483 మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు పోర్టల్ ఫిర్యాదులు నమోదు కాగా 2276 ఫోన్ల ట్రాక్ ను గుర్తించి మొబైల్ ఫోన్లను రికవరీ చేసాం అని ప్రస్తుత జీవన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక పరికరం అయ్యిందని, ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్న...నగదు లావాదేవీలు చేయాలన్న మొబైల్ ఫోన్ పైనే ఆధారపడేంతగా ప్రాదాన్యం సంతరించుకుందని అన్నారు. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్న/చోరికి గురైతే పరిస్తితి ఎలా ఉంటుందో ఊహించనవసరం కష్టమేనని అన్నారు. పోయిన ఫోన్ లను వెతికి పెట్టడానికి పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందన్నారు ఆయన అన్నారు. అనంతరం సెల్‌ఫోన్ల రికవరీలో కీలకంగా వ్యవహరించిన ఐటి సెల్ ఎస్సై సత్యనారాయణ, టెక్నికల్ బృందాన్ని ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అభినందించారు.

## మంత్రి వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపిన ముదిరాజ్ సంఘం నేతలు



**సుల్తానాబాద్, జూన్ 13 (జనంసాక్షి) :** ఇటీవల కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కిన రాష్ట్ర పశు సంవర్ధక మత్యశాఖ మాత్యులు వాకిటి శ్రీహరిని శుక్రవారం మంత్రి నివాసంలో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు బండ ప్రకాష్ ముదిరాజ్,రాష్ట్ర ముదిరాజ్ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్, ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య ముదిరాజ్, వెంగలపూడి గోపాల్ ముదిరాజ్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండ ప్రకాష్ ముదిరాజ్, గుర్రాల మల్లేశం ముదిరాజ్ మాట్లాడుతూ, వాకిటి శ్రీహరిని గుర్తించి మంత్రి పదవి లో చోటు కల్పించడం చాలా సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజులలో మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ముదిరాజులకు మంచి రోజులు రానున్నాయని తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చుతాడన్న నమ్మకం ఉందని వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన విధంగా ముదిరాజులను బీసీ డీ నుండి బిసి ఏలోకి మార్చడానికి ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరిపి ముదిరాజుల,న్యాయమైన డిమాండ్ ను నెరవేర్చుటకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజులను గుర్తించి వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు ఇతర మంత్రులకు ఎమ్మెల్యేలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తారని వారు తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## భూ భారతి రైతులకు వరం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్, జూన్ 13 (జనసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రైతుల పాలిట వరమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని పినపాక పట్టీనగర్ పంచాయతీ కార్యాలయంలో తహాశీల్దార్ శిరీష అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భూ భారతి చట్టంతో రైతుల భూములకు రక్షణ కల్పిస్తుందని, భూ భారతి చట్టం రైతులకు వరమన్నారు. భూ సమస్య అనేది లేకుండా ఉండేందుకు ఈ చట్టం రైతులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఇప్పటికే మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా రైతులు తమ భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారని, ఈ దరఖాస్తులను అధికారులు పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తారన్నారు. అనంతరం గ్రామంలో అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ శిరీష, డీటీ రాంనరేష్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంఈవో యదుసింహరాజు, ఎంపీవో బాలయ్య, ఆర్ ఐ నర్సింహారావు, ఐకేపీ ఏపీఎం, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, భజన సతీష్, భజన ప్రసాద్, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు భూక్య సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నిర్మితమవుతుంది

- కుడకుడ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆకస్మిక సందర్శన
- అక్షరభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 13 (జనంసాక్షి) :** దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నిర్మితమవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు.ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించి అడ్మిషన్, హాజరు రిజిస్టర్లు పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మొత్తంలో నూతనంగా విద్యార్థులు చేరేలా చూడాలని సూచించారు.ప్రాథమిక పాఠశాల నుండి ఐదో తరగతి అయిపోయిన విద్యార్థులను వెంటనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరో తరగతిలో చేర్పించే విధంగా చూడాలని ఆదేశించారు.ఇప్పటి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 మంది నూతనంగా అడ్మిషన్ పొందారని ఉపాధ్యాయులు వివరించారు.ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న షేక్ ఉమేజా,షేక్ హైరసభ లకు అక్షరభాస్యం చేపించి ఆంగ్లంలో ఏబిసిడిలు రాయించారు.రెండవ తరగతిలోని విద్యార్థులకు బుక్స్,యూనిఫామ్ అందజేశారు.ప్రాథమిక స్థాయి నుండే మంచిగా చదువుకోని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ ఎస్ ఇంచార్జి హెడ్‌మాస్టర్ కవిత, ఉపాధ్యాయులు వెంకట నర్సమ్మ, ప్రతాప్ కుమార్, రాజు, ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అనురాధ, సత్తయ్య, కోటయ్య, రవీందర్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.



## మోడీ సంకల్పంతోనే సుపరిపాలన



**వెల్దండ, జూన్ 13 (జనంసాక్షి) :** వెల్దండ మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కురుమిద్దె యాదగిరి అధ్యక్షతన బిజెపి పార్టీ 11 సంవత్సరాల కార్య శాల సమావేశానికి అధ్యక్షత చేయడం జరిగింది. కల్వకుర్తి నియోజకవర్గంలో బిజెపి నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన 'వికసిత్ భారత్ కా అమృత్ కాల్' కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గం నాయకులు వెల్దండ మండల ఇన్చార్జ్ బండెల రామచంద్ర రెడ్డి మండల అధ్యక్షులు కురిమిద యాదగిరి మాట్లాడుతూ11 సంవత్సరాలలో ప్రధాని నరేంద్ర మోదీ అందించిన అద్భుతమైన సుపరిపాలనలో పరిపూర్ణాత్మకమైన అభివృద్ధి సాధించిన అనేక అంశాలను మోడీ గారి పరిపాలనలో నేషనల్ హైవే, రైల్వే, ఎయిర్పోర్ట్స్, నిరుద్యోగ పరిష్కారం, రక్షణ రంగం, ఉత్పత్తులు అనేక రంగాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలో పాల్గొన్నడం జరిగింది. భారతదేశం 2047 కళ్ళ వికసిద్భారత్‌గా పురోగమించడంలో ప్రజలు నిండు మనసుతో మోడీని ఆశీర్వదించాలని కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కల్వకుర్తి సీనియర్ నాయకులు బండల రామచంద్రారెడ్డి బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు అందోజు శ్రీనివాస్ చారి నాయకులు మాజీ జంగయ్య యాదవ్ సింగల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి మోహన్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి కెశముని జంగయ్య శ్రీశైలం ముదిరాజ్ బిజెపి సీనియర్ నాయకుడు శశిధర్ రెడ్డిబిజెపి మండల కార్యవర్గ సభ్యులు శ్రీశైలం శ్రీకాంత్ బిజెపి మండల కార్యవర్గ సభ్యులు, వెంకటేష్ బీజేవైఎం మండల కార్యవర్గ సభ్యులు, బిజెపి మండల అన్ని గ్రామాల బూతు అధ్యక్షులు బిజెపి సీనియర్ నాయకులు పాల్గున్నారు.

## ఈవీఎం గోదాముల తనిఖీ



**వరంగల్ ప్రతినిధి, జూన్ 13 (జనంసాక్షి) :** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ( ఈవీఎంల)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి గోదాములను తనిఖీ చేశారు. శుక్రవారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని ఈవీఎం గోదాములను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఐఎన్సి నుండి రాజేష్, టిడిపి నుండి శ్యామ్ సుందర్, ఏఐఎంఐఎం నుండి ఫైజోద్దీన్, బిజెపి హరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.


# అహ్మదాబాద్ విమాన ప్రమాదం భారత్‌కు ఓ పీడకల



**శేరిలింగంపల్లి, జూన్ 13 (జనంసాక్షి) :** గుజరాత్ రాష్ట్ర రాజధాని అహ్మదాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన ప్రమాద ఘటన దేశానికి ఓ పీడకలని, ఈ మధ్యకాలంలో ఇంత భారీ స్థాయి ప్రమాదం చోటు చేసుకున్న దాఖలాలు లేవని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అహ్మదాబాద్ ఎయిర్పోర్ట్ వద్ద అనివార్య పరిస్థితులలో బోయింగ్ 737 విమాన దుర్ఘటన చోటు చేసుకోవడం, ఇందులో సుమారు 270 మంది దుర్మరణం చెందడం తనను తీవ్రంగా కలిచి వేసిందని గాంధీ పేర్కొన్నారు. మృతులకు నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించిన పిఎసి చైర్మన్ అరికపూడి భగవంతుడు వారికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

### బోయింగ్ విమాన దుర్ఘటన దేశ చరిత్రలో ఓ చీకటి రోజు

గుజరాత్ రాష్ట్ర పరిధి అహ్మదాబాద్ లో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకున్న బోయింగ్ విమాన ప్రమాదం వల్ల అందులోని 242 మంది ప్రయాణికులు, సిబ్బంది, పైలెట్ లతోపాటు మెడికల్ కాలేజ్ భవనం పై విమానం కూలడంతో 20 కి పైగా మెడికోలు దుర్మరణం చెందడం భారతదేశ చరిత్రలో ఓ చీకటి రోజని జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ అభివర్ణించారు. ఏ మేరకు శేరిలింగంపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అనుకోకుండా జరిగిన విమాన ప్రమాదం భారీ స్థాయి నష్టాన్ని చేకూర్చిందని, ఈ మధ్యకాలంలో బోయింగ్ విమానాలు తరచుగా ప్రమాదానికి గురవుతుండడం ఆందోళనను కలిగిస్తుందన్నారు. ఈ సమయంలో మృతుల కుటుంబాలకు దేశ ప్రజలు అండదండలు అందించాలని, కష్టకాలంలో తోడ్పాటు అందించిన వారే జీవితంలో ఉన్నతమైన స్థానంలో నిలుస్తారని వాలిదాసు అభిప్రాయపడ్డారు. మృతులకు నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ఆయన సానుభూతిని వ్యక్తం చేశారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని, అహ్మదాబాద్ ఎయిర్పోర్ట్ పరిసర ప్రాంతాలలో వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితిలను పునరుద్ధరించాలని వాలిదాసు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకురాళ్ళు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.




# ఆకాశానికి చమురు ధరలు

## తీవ్రమవుతున్న మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు

ప్రపంచ దేశాల హెచ్చరికలను ధిక్కరిస్తూ ఇజ్రాయెల్ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై జరిపిన దాడులతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. ఈ దాడుల ప్రభావంతో శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు 12 శాతానికి పైగా పెరిగాయి. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ బ్యారెల్ ధర 12.6 శాతం పెరిగి 76.61 డాలర్లకు చేరగా, బ్రెంట్ నార్త్ సీ క్రూడ్ 12.2 శాతం పెరిగి 77.77 డాలర్లకు చేరుకుంది.

**చమురు సరఫరాపై ఆందోళనలు**

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం హార్మోజ్ జలసంధి ద్వారా జరిగే ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ జలసంధి ద్వారా రోజుకు 2.1 కోట్ల బ్యారెళ్ల చమురు (ప్రపంచ వినియోగంలో 21 శాతం) మరియు అంతర్జాతీయ ఎల్ఎన్‌జీ వినియోగంలో 20 శాతం సరఫరా జరుగుతుంది. ఈ దాడులతో సరఫరా అంతరాయం ఏర్పడే ప్రమాదం పెరిగిందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఈ జలసంధిని అడ్డుకుంటే చమురు ధరలు 100 డాలర్ల బ్యారెల్‌ను దాటవచ్చని, తీవ్ర సందర్భాల్లో 300 డాలర్లకు కూడా చేరే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**చమురు రంగ షేర్లపై ప్రభావం**

ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు రంగ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 6.1 శాతం తగ్గి రూ.299.20 వద్ద ట్రేడ్ అవుతున్నాయి.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ షేర్లు 3.9 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 5.3 శాతం నష్టపోయాయి. ఈ ధరల పెరుగుదల విమానయాన రంగంపై కూడా ప్రభావం చూపింది, ఎందుకంటే ఇరాన్ గగనతలంలోకి విమానాల రాకపోకలు రద్దయ్యాయి.

### హార్మోజ్ జలసంధి: గ్లోబల్ ఆయిల్ సరఫరా గొలుసు

హార్మోజ్ జలసంధి, ఒమన్-ఇరాన్ సముద్ర మార్గంలో ఉన్న ఒక కీలక చోక్‌పాయింట్, ఇది 40 కి.మీ. వెడల్పుతో ఉంటుంది, అందులో 2 కి.మీ. నావిగేషన్ ఛానల్ నౌకల రాకపోకలకు వినియోగించబడుతుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ నుంచి రోజుకు 2.1 కోట్ల బ్యారెళ్ల చమురు ఈ మార్గం ద్వారా ఎగుమతి అవుతుంది. ఈ జలసంధి అడ్డంకి ఏర్పడితే, ప్రపంచ చమురు సరఫరా గొలుసు తీవ్రంగా దెబ్బతినవచ్చు, ఇది గ్లోబల్ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. ఇజ్రాయెల్ దాడులు మరియు ఇరాన్ ప్రతీకార చర్యలతో మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం తీవ్రమవుతోంది. ఈ ఘర్షణ చమురు సరఫరాకు అంతరాయం కలిగించే అవకాశం ఉందనే భయాలు మార్కెట్లను కలవరపెడుతున్నాయి. అంతర్జాతీయ సమాజం ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు చర్యలు తీసుకోకపోతే, చమురు ధరల పెరుగుదలతో పాటు గ్లోబల్ ఆర్థిక స్థిరత్వం ప్రమాదంలో పడవచ్చు.

# ఎయిర్‌టెల్ కస్టమర్ల రక్షణ వ్యవస్థ

## ఏఐ ఆధారిత సైబర్ నేరాల నివారణ




హైదరాబాద్, (జనంసాక్షి) : తెలంగాణలో సైబర్ మోసాల నుండి కస్టమర్లను కాపాడేందుకు భారతీ ఎయిర్‌టెల్ అత్యాధునిక ఏఐ-ఆధారిత ఫ్రాడ్ డిటెక్షన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ వినూత్న టెక్నాలజీ ద్వారా కేవలం 25 రోజుల్లో దేశవ్యాప్తంగా 180,000 హానికరమైన లింక్‌లను బ్లాక్ చేసి, తెలంగాణలో 5.4 మిలియన్ కస్టమర్లను సురక్షితంగా కాపాడింది. ఈ ప్రయత్నం రాష్ట్రంలో సైబర్ నేరాలను అరికట్టడంలో ఎయిర్‌టెల్ యొక్క దృఢమైన నిబద్ధతను సూచిస్తుంది.

ఎయిర్‌టెల్ యొక్క ఈ ఏఐ ఆధారిత సిస్టమ్ రియల్ టైమ్‌లో హానికరమైన లింక్‌లు మరియు సైబర్ బెదిరింపులను గుర్తించి, వాటిని నిరోధిస్తుంది. ఈ టెక్నాలజీ ఎలాంటి ఇన్‌స్టలేషన్ అవసరం లేకుండా నేపథ్యంలో నిరంతరం పనిచేస్తూ, వినియోగదారులకు ఉచితంగా రక్షణ కల్పిస్తుంది. తెలుగుతో సహా బహుళ భాషల్లో హెచ్చరిక సందేశాలను పంపడం ద్వారా, ఈ వ్యవస్థ విభిన్న భాషా వినియోగదారులకు అనుకూలంగా ఉంటుంది. ఈ సిస్టమ్ దేశవ్యాప్తంగా 59 మిలియన్ కస్టమర్లను కాపాడినట్లు ఎయిర్‌టెల్ పేర్కొంది.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌టెల్ సీఈఓ అజయ్ అనంతపద్మనాభన్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శ్రీమతి శిఖా గోయెల్‌తో జరిగిన సమావేశంలో ఈ ఏఐ టూల్ యొక్క సామర్థ్యాలను వివరించారు. కస్టమర్లను సైబర్ మోసాల నుండి రక్షించడం తమ ప్రధాన బాధ్యత అని అజయ్ అనంతపద్మనాభన్ తెలిపారు. ఈ సందర్భంగా శిఖా గోయెల్, సైబర్ నేరాల నివారణలో ఎయిర్‌టెల్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ సహకారం రాష్ట్రంలో సురక్షితమైన డిజిటల్ పర్యావరణాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

ఎయిర్‌టెల్ యొక్క ఈ ఏఐ ఆధారిత ఫ్రాడ్ డిటెక్షన్ సిస్టమ్, సైబర్ నేరాలకు వ్యతిరేకంగా ఒక బలమైన రక్షణ కవచంగా నిలుస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా తెలంగాణలోని కస్టమర్లు ఆన్‌లైన్ మోసాల నుండి సురక్షితంగా ఉంటారని, డిజిటల్ లావాదేవీలలో వారి విశ్వాసం పెరుగుతుందని ఎయిర్‌టెల్ భావిస్తోంది. సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో కలిసి, ఎయిర్‌టెల్ రాష్ట్రవ్యాప్తంగా సురక్షితమైన డిజిటల్ భవిష్యత్తును నిర్మించే దిశగా అడుగులు వేస్తోంది.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 610 | ₹ 59.2 |
| వరంగల్ | ₹ 612 | ₹59.4 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| | |
|---|---|
| ₹1,01,400 (24 క్యారెట్లు) | ₹ 92,950 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹ 99,200 (22 క్యారెట్లు) | ₹1,01,200 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹1,20,000



## ప్రీపెయిడ్ నుంచి పోస్ట్‌పెయిడ్‌కు మార్పు సులభతరం

మొబైల్ వినియోగదారుల సౌలభ్యం కోసం టెలికమ్యూనికేషన్ విభాగం కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్) ఆధారిత ప్రక్రియ ద్వారా ప్రీపెయిడ్ నుంచి పోస్ట్‌పెయిడ్‌కు లేదా పోస్ట్‌పెయిడ్ నుంచి ప్రీపెయిడ్‌కు మారే ప్రక్రియను సరళీకరించింది. ఈ నూతన విధానం ప్రకారం, వినియోగదారులు కేవలం 30 రోజుల్లోనే తమకు నచ్చిన ప్లాన్‌కు మారవచ్చు. గతంలో, వినియోగదారులు తమ అవసరాలకు తగ్గట్టు ప్లాన్‌లను మార్చుకోవాలంటే 90 రోజుల కూలింగ్ ఆఫ్ పీరియడ్‌ను వేచి ఉండాల్సి వచ్చేది. అయితే, జూన్ 10, 2025న జారీ చేసిన కొత్త మార్గదర్శకాలతో ఈ వ్యవధిని డాట్ 30 రోజులకు తగ్గించింది. ఓటీపీ ఆధారిత కేవైసీ ప్రక్రియ ద్వారా ఈ సేవలు సులభంగా అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులు తమ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ ఔట్‌లెట్‌ను సందర్శించి, ఓటీపీ ఆధారిత కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి. ఈ విషయాన్ని డాట్ తన అధికారిక 'X ఖాతాలో ప్రకటించింది. అయితే, ఈ సౌలభ్యం మొదటిసారి ప్లాన్ మార్చుకోవాలనుకునే వారికి మాత్రమే వర్తిస్తుంది. మరోసారి మార్పు చేయాలనుకుంటే 90 రోజులు వేచి ఉండాలి. ఈ కొత్త నిబంధన వినియోగదారుల సమయాన్ని ఆదా చేయడంతో పాటు, సౌకర్యవంతమైన టెలికాం సేవలను అందిస్తుంది.

***భారతీయులు విదేశాలకు పంపే సొమ్ము (ఓవర్సీస్ రెమిటెన్స్) కు సంబంధించిన నిబంధనలను ఆర్‌బీఐ కఠినతరం చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దేశం బయటికి పంపిన సొమ్ముతో విదేశీ కరెన్సీల్లో లాకిన్ పీరియడ్‌తో కూడిన ఎఫ్‌డీ చేయడం లేదా వడ్డీ ఆర్జిత అకౌంట్లో జమ చేయడాన్ని నిషేధించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.***

## ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు

అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంలో 271 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘోర దుర్ఘటనను మరువక ముందు మరో ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. AI 379 విమానం 156 మంది ప్రయాణికులతో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పుకెట్ నుంచి ఢిల్లీ బయలుదేరింది. అయితే మార్గ మధ్యలో విమానంలో బాంబు ఉన్నట్లు విమాన సిబ్బందికి బెదిరింపు వచ్చింది. దీంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యా రు. విమానాన్ని థాయిలాండ్‌లో ఎమర్జెన్సీ ట్యాండింగ్ చేశారు. విమానం గాల్లో ఉండగా బెదిరింపు మెయిల్ రావడంతో అధికారుల సూచన మేరకు పైలెట్ విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారని ఓ ప్రకటనలో తెలిపారు. ఆ సమయంలో అండమాన్ సముద్రం మీదుగా వెళ్తున్న విమానం.. చాలా సేపు గాలిలోనే చక్క ర్లు కొట్టి చివరికి సురక్షితంగా ల్యాండ్ అయింద న్నారు. విమానం ఐలాండ్‌లో దిగిన వెంటనే అధికారులు తనిఖీలు చేపట్టారు. అయితే విమానంలో ఎలాంటి బాంబూ కనిపించక పోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రమవడంతో అంతర్జాతీయ మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి, ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపై కూడా పడింది. ఫలితంగా సెన్సెక్స్ ఉదయం 1000 పాయింట్లకు పైగా నష్టపోయి, నిఫ్టీ 24,600 స్థాయికి దిగువకు చేరింది. చివరకు రెండు ప్రధాన సూచీలు నష్టాలతో ట్రేడింగ్ ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,427.81 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,691.98) భారీ నష్టాలతో ట్రేడింగ్ ప్రారంభించి, ఇంట్రాడేలో 80,354.59 వద్ద కనిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 573 పాయింట్ల నష్టంతో 81,118 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 24,473.00 వద్ద కనిష్ఠాన్ని తాకి, 169 పాయింట్ల నష్టంతో 24,718 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 86.07గా నమోదైంది.ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా చమురు రంగ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఐటీసీ, ఎస్బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ షేర్లు నష్టపోయాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్, సన్‌ఫార్మా, మారుతీ సుజుకీ షేర్లు మాత్రమే లాభాలను నమోదు చేశాయి.

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.39 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 3,445 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఈ ఉద్రిక్తతలు మరియు చమురు ధరల పెరుగుదల మార్కెట్లలో అస్థిరతను మరింత పెంచే అవకాశం ఉంది.

## టాటా సన్స్ చైర్మన్ కీలక హామీ




టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, అహ్మదాబాద్ సమీపంలో జరిగిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ క్రాష్ గురించి మరోసారి స్పందించారు. టాటా గ్రూప్ చరిత్రలో ఇది అత్యంత అంధకారమైన రోజుల్లో ఒకటని అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉద్యోగులకు పంపిన భావోద్వేగమైన లేఖలో, చంద్రశేఖరన్ తన బాధను వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తాము షాక్‌లో ఉన్నామని, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**ఇప్పటికే విచారణ బృందాలు..**


దీంతోపాటు ఈ ఘటనపై తాము పూర్తి పారదర్శకంగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మాటలతో సాంత్వన ఇవ్వలేము. కానీ ఈ ప్రమాదంలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని లేఖలో పేర్కొన్నారు. చంద్రశేఖరన్ తన సందేశంలో ఏమి తప్పు జరిగిందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. భారతదేశం, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ నుంచి విచారణా బృందాలు అహ్మదాబాద్‌కు చేరుకున్నాయన్నారు. ఈ క్రమంలో టాటా గ్రూప్ పూర్తి సహకారం వారికి అందిస్తుందని ఆయన వెల్లడించారు.

## గుజరాత్ నైపుణ్య అభివృద్ధికి ఏడీబీ రూ.927 కోట్ల రుణం




గుజరాత్‌లో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా ఆసియా అభివృద్ధి బ్యాంకు 109.97 మిలియన్ డాలర్ల (సుమారు రూ.927 కోట్ల) రుణాన్ని ఆమోదించింది. ఈ నిధులు కౌసల్య: ది స్కిల్ యూనివర్సిటీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, అధిక వృద్ధి కలిగిన రంగాలలో పారిశ్రామిక శిక్షణను అందించడం ద్వారా శ్రామిక శక్తిని సామర్థ్యవంతం చేయడానికి ఉపయోగపడనున్నాయి. గుజరాత్‌లోని ఐటీఐలను ఆధునీకరించడం, టెక్నికల్ మరియు వొకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రత్యేక కేంద్రాలను స్థాపించడంపై ఈ నిధులు దృష్టి సారిస్తాయి.

గుజరాత్ ప్రభుత్వం ఏడు కీలక రంగాలైన లాజిస్టిక్స్, ఆటోమోటివ్, తయారీ, సమాచార సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, మరియు వ్యవసాయ సాంకేతికతలపై నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. మార్కెట్ డిమాండ్ మరియు ఉద్యోగ ధోరణులకు అనుగుణంగా పరిశ్రమల సహకారంతో కోర్సులను రూపొందించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా 2030 నాటికి కనీసం 60,000 మంది విద్యార్థులకు అధునాతన నైపుణ్యాలతో శిక్షణ అందించడం, ఇంజనీరింగ్ విభాగాల్లో మహిళల నమోదును పెంచడం, మరియు 1,75,000 మంది వెనుకబడిన వర్గాల వ్యక్తులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే శిక్షణను అందించడం లక్ష్యంగా ఉంది. ఈ చర్యలు గుజరాత్‌లో శ్రామిక శక్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి, ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని భావిస్తున్నారు.



- టెహ్రాన్‌లో సైనిక స్థావరాలు లక్ష్యంగా దాడులు
- రేడియేషన్ లీకేజీ లేదు : ఐఏఈఏ
- అణ్వాయుధ నిరోధించేందుకు దాడులు చేశాం : ఇజ్రాయెల్
- డ్రోన్ దాడులతో ఇరాన్ ప్రతీకార దాడులు
- పెరుగనున్న ఆయిల్ ధరలు

# ఇరాన్ అణు స్థావరాలపై ఇజ్రాయెల్ దాడి

## అపరేషన్ రైజింగ్ లయన్‌తో ఇరాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

### నటాంజ్ అణు కేంద్రంపై దాడి.. ఇరాన్ సైనిక అధికారులు, శాస్త్రవేత్తలు మృతి

**నటాంజ్ :** ఇజ్రాయెల్ చేపట్టిన ఆపరేషన్ రైజింగ్ లయన్, ఇరాన్‌లోని అణు మరియు సైనిక స్థావరాలపై జరిగిన దాడులతో మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు మరోసారి ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. నటాంజ్ అణు శుద్ధీకరణ కేంద్రం, టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలు, మరియు ఇతర కీలక సౌకర్యాలపై జరిగిన ఈ దాడులు ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని నిరోధించడం, దాని సైనిక సామర్థ్యాన్ని బలహీనపరచడం లక్ష్యంగా చేపట్టబడ్డాయి. ఈ దాడులు తాత్కాలికంగా ఇరాన్ అణు కార్యక్రమానికి గణనీయమైన దెబ్బ తీసినప్పటికీ, వాటి దీర్ఘకాలిక పరిణామాలు మరియు ప్రాంతీయ శాంతి స్థిరత్వంపై ప్రభావం ఆందోళన కలిగిస్తున్నాయి.

**ఇజ్రాయెల్ దృక్కోణం: భద్రతా ఆందోళనలు**

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడులను "ఇరాన్ అణ్వాయుధ సమీకరణను అడ్డుకునే కీలక చర్య"గా వర్ణించారు. ఇరాన్ 408.6 కిలోగ్రాముల 60% శుద్ధి యురేనియం కలిగి ఉందని, ఇది 9-10 అణు బాంబులకు సరిపోతుందని ఐఏఈఏ నివేదికలు చెబుతున్నాయి. ఈ ఆందోళనలు ఇజ్రాయెల్ యొక్క జాతీయ భద్రతకు ముప్పుగా మారాయి. అయితే, అణు స్థావరాలపై దాడులు చేయడం అనేది ప్రమాదకరమైన చర్య. ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రఫాయెల్ గ్రాస్సీ హెచ్చరించినట్లు, ఇటువంటి దాడులు అణు భద్రతకు హాని కలిగించే అవకాశం ఉంది, ఒకవేళ రేడియేషన్ లీకేజీ జరిగితే ఫలితాలు వినాశకరంగా ఉంటాయి.

**ఇరాన్ స్పందన: ప్రతీకారం లేదా దౌత్యం?**

ఇరాన్ ఈ దాడులను "యుద్ధ చర్య"గా పరిగణించి, ఇజ్రాయెల్‌పై 100 డ్రోన్‌లతో ప్రతీకార దాడి చేసింది, అయితే ఇవి ఇంటర్‌సెప్ట్ చేయబడ్డాయి. సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ కొత్త సైనికాధికారులను నియమించడం, ఐఏఈఏ మౌనాన్ని ఖండించడం ఇరాన్ యొక్క దృఢమైన వైఖరిని సూచిస్తున్నాయి. ఈ దాడులు ఇరాన్‌ను అణ్వాయుధ తయారీ వైపు లేదా దౌత్యపరమైన చర్చల వైపు నెట్టవచ్చు. ఫోర్డో సౌకర్యం సురక్షితంగా ఉండటం, 60% శుద్ధి యురేనియం స్టాక్ దెబ్బతినకపోవడం ఇరాన్‌కు ఇంకా బలమైన స్థానాన్ని అందిస్తోంది.

**అంతర్జాతీయ స్పందనలు: శాంతి కోసం పిలుపు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను ఒప్పందం కోసం ఒత్తిడి చేస్తూ, యూరోపియన్ యూనియన్ నాయకులు ఉద్రిక్తతలు తగ్గించాలని కోరారు. రష్యా, చైనా, తాలిబాన్లు ఈ దాడులను అంతర్జాతీయ చట్ట ఉల్లంఘనగా ఖండించాయి. ఐఏఈఏ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అత్యవసర సమావేశం ఈ సంక్షోభాన్ని చర్చించనుంది, కానీ ఇరాన్ మరియు ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కనిపించడం లేదు.

ఈ దాడులు క్రూడ్ ఆయిల్ ధరలను 8% పెంచాయి, విమాన రాకపోకలను రద్దు చేశాయి, మరియు మిడిల్ ఈస్ట్‌లో విస్తృత యుద్ధ భయాలను పెంచాయి. నటాంజ్ నష్టం ఇరాన్ అణు కార్యక్రమాన్ని తాత్కాలికంగా దెబ్బతీసినప్పటికీ, ఫోర్డో వంటి సౌకర్యాలు దెబ్బతినకపోవడం ఇరాన్‌కు ఇంకా వ్యూహాత్మక ప్రయోజనాన్ని ఇస్తోంది. ఇజ్రాయెల్ యొక్క లక్ష్యం ఇరాన్ అణు కార్యక్రమాన్ని శాశ్వతంగా నిలువరించడం కాకపోవచ్చు, కానీ దాని సైనిక, అణు సామర్థ్యాలను బలహీనపరచడం ద్వారా సమయం సంపాదించడం.

ఆపరేషన్ రైజింగ్ లయన్ మిడిల్ ఈస్ట్‌లో ఒక కొత్త సంక్షోభానికి తెరతీసింది. ఇజ్రాయెల్ యొక్క భద్రతా ఆందోళనలు న్యాయమైనవైనా, అణు స్థావరాలపై దాడులు ప్రమాదకరమైన ఫలితాలను కలిగిస్తాయి. ఇరాన్ ప్రతీకార దాడులు, అంతర్జాతీయ ఒత్తిళ్ల మధ్య దౌత్య చర్చలు లేదా యుద్ధ సన్నాహాల మధ్య ఎంచుకోవాల్సి ఉంది. అంతర్జాతీయ సమాజం ఈ ఉద్రిక్తతలను తగ్గించడానికి, శాంతి స్థాపనకు కృషి చేయాలి. లేకపోతే, ఈ సంఘర్షణ ప్రాంతీయ యుద్ధంగా మారే ప్రమాదం ఉంది, దాని పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తాయి.



## బ్లాక్ బాక్స్ లభ్యం..

### అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన శిథిలాల నుంచి డిజిటల్ వీడియో రికార్డర్ స్వాధీనం

**అహ్మదాబాద్:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం కూలిపోయిన ఎయిర్ ఇండియా విమాన శిథిలాల నుంచి డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్) లభించింది. గుజరాత్ యాంటీ టెర్రర్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని ఈ డీవీఆర్‌ను స్వాధీనం చేసుకున్నారు. "మేము శిథిలాల నుంచి డిజిటల్ వీడియో రికార్డర్‌ను స్వాధీనం చేసుకున్నాం. ఫోరెన్సిక్ ల్యాబ్ బృందం త్వరలో ఇక్కడికి వస్తుంది" అని ఏటీఎస్ అధికారి మీడియాతో తెలిపారు. ఈ డీవీఆర్‌ను విశ్లేషించడం ద్వారా విమాన ప్రమాదానికి సంబంధించిన కీలక సమాచారం లభించే అవకాశం ఉంది. అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే ఎత్తు కోల్పోయి, సమీపంలోని మెడికల్ కాలేజీ భవనంపై కూలిపోయి పేలుడుకు గురైంది. ఈ ప్రమాదంలో భారీ మంటలు, పొగలు వ్యాపించాయి. విమానంలోని 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందిలో కేవలం ఒక్క ప్రయాణికుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ దారుణమైన ప్రమాదంపై అధికారులు అన్ని కోణాల్లో లోతైన దర్యాప్తు జరుపుతున్నారు.

## బోయింగ్ షేరు ఢమాల్

గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కొద్ది నిమిషాలకే కుప్పకూలింది. దాంతో ఆ విమానంలో ప్రయాణిస్తున్న 242 మందిలో 241 మంది చనిపోయారు. ఈ ఘోర ప్రమాదం నేపథ్యంలో అమెరికా మార్కెట్లో బోయింగ్ షేరు గురువారం ప్రారంభ ట్రేడింగ్‌లో 5 శాతం వరకు క్షీణించింది. మార్కెట్ ప్రారంభానికి ముందు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో 8 శాతం వరకు పతనమైంది. ఈ ఘటనతో అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలకూ అంతరాయం కలిగింది. దాంతో దేశీయ లిస్టెడ్ ఎయిర్‌లైన్స్ ఇండిగో షేరు బీఎస్ఈలో 2.65 శాతం నష్టపోగా.. స్పైస్‌జెట్ షేరు 1.78 శాతం క్షీణించింది. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ధర కూడా 1.54 శాతం తగ్గింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14 జూన్ 2025

# కన్నపు దొంగల ముఠా గుట్టు రట్టు

- ఐదుగురిపై కేసు, ఇద్దరు అరెస్ట్
- కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 13 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా, గంగాధర మండలం వెంకటయ్యపల్లి గ్రామంలో ఈ నెల జూన్ 8న దొంగతనం జరిగింది. ఈ ఘటనపై ఉప్పుగండ్ల గంగారెడ్డి (56) వెంకటయ్యపల్లి నివాసి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల ప్రకారం, జూన్ 8వ తేదీన మధ్యాహ్నం 3:30 గంటలకు మంచినీరు తెచ్చుకోవడానికి ఇంటి నుండి బయలుదేరి, సాయంత్రం 5:15 గంటలకు తిరిగి ఇంటికి వచ్చారు. ఇంట్లోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపు గడియలను పగలగొట్టి లోపలికి ప్రవేశించి, ఇంట్లోని వస్తువులను చిందరవందర చేశారని, దొంగలు మొత్తం రెండు అల్మారాల పగలగొట్టి వాటి నుండి రూ. 3,75,000/- విలువైన 33 తులాల బంగారు ఆభరణాలు, రూ. 12,500/- విలువైన వెండి, రూ. 25,000/- నగదుతో ఉడాయించారని బాధితుడు పేర్కొన్నారు. (హాల్‌లో ఉన్న మొదటి అల్మారాను పగలగొట్టి, అందులో నుండి 33 తులాల బంగారం ఆభరణాలు (సుమారు రూ. 3,75,000/- విలువ చేసేవి) , 25 తులాల వెండి (రూ. 12,500/- విలువ చేసేవి) దొంగిలించారు. అలాగే పడకగదిలో ఉన్న రెండవ అల్మారాను పగలగొట్టి, అందులో నుండి 2 తులాల బ్లాక్ చైన్ (రూ. 30,000/-), 2.5 తులాల నెక్లెస్ (రూ. 37,500/-), 0.5 తులం ఉంగరాలు (రూ.




7,500/-), 1 తులం చైన్ (రూ. 15,000/-), 1.5 తులాల చెవిపోగులు (రూ. 22,500/-), 0.5 తులం ముక్కుపుడక (రూ. 7,500/-) అపహరించారు.) ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. దొంగలను పట్టుకోవడానికి, దొంగిలించబడిన సొత్తును స్వాధీనం చేసుకోవడానికి కరీంనగర్ పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని క్లూస్ టీం , డాగ్ స్క్వాడ్ , సీసీఎస్ పోలీసులతో పటు గంగధార పోలీసులు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితులను గుర్తించారు . ఐదుగురిపై కేసు నమోదు చేసారు. వారిలో ముగ్గురు ప్రత్యక్షంగా దొంగతనానికి పాల్పడగా ఇద్దరు దొంగిలించిన సొత్తులో కొంత బంగారాన్ని తక్కువ ధరకు కొన్నట్లుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అయితే ఐదుగురు నిందితుల్లో ఇద్దరిని పట్టుకోగా ఇంకా ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు.

### పట్టుబడ్డ నిందితుల వివరాలు...

కరీంనగర్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి అనేక దొంగతనాలకు పాల్పడిన రాజన్న సిరిసిల్ల జిల్లా , కోనరావుపేట్ కు చెందిన (ఎ1) గాజుల హేమంత్ (19) అనే యువకుడిని అతని స్నేహితుడైన (ఎ5) కొమ్ము నవీన్ కుమార్ తండ్రి బాలరాజు, 20 సం.లు, లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి దొంగిలించబడిన 20 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి వస్తువులు, ఒక ప్యాషన్ ప్లస్ మోటార్‌సైకిల్, ఒక సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ఇంకా ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడినన నేరస్థులను గుర్తించి పట్టుకుని వారినుండి పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను స్వాధీనం చేయటం లో కృషి చేసిన రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ , చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ , క్లూస్ టీం ఇన్స్పెక్టర్ రాజు, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, సీసీఎస్ ఎస్సై నాగరాజు వారి సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సురేంద్రపాల్ , కానిస్టేబుళ్లు రవీందర్, అవినాష్ , సాయి, సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ కానిస్టేబుల్ ప్రదీప్ లను పోలీసు కమీషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

## డీ సిల్టింగ్ పనులు వేగంగా జరగాలి

- చింతలబస్తీలో నాలాను పరిశీలించిన హైడ్రా కమిషనర్



**హైదరాబాద్, జూన్ 13 (జనంసాక్షి) :** నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు త్వరగా జరగాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ఆదేశించారు. నాలాల్లో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. నాలా ఆక్రమణలుంటే వెంటనే తొలగించాలన్నారు. శుక్రవారం చింతల్‌బస్తీ మీదుగా సాగే బుల్కాపూర్ నాలా విస్తరణ పనులను శుక్రవారం పరిశీలించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12, పింఛను ఆఫీసు దగ్గర 15 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా చింతలబస్తీ వైపు 7 మీటర్ల మేర కబ్జాలు జరగగా బుధవారం హైడ్రా వాటిని తొలగించిన విషయం విధితమే. ఆక్రమణలు తొలగించినా.. కబ్జాల వల్ల కల్వర్టు కింద సగం భాగం పూడికపోయింది. ఆ పూడిక తీతతో పాటు.. కబ్జాల తొలగింపు పనులు త్వరగా జరగాలని ఆదేశించారు. జేసీబీలను కాలువలోకి దించి చెత్తను మొత్తం తొలగించాలని సూచించారు. వరదకు ఆటంకం లేకుండా.. నాలా ఇతర ప్రాంతాల్లో కూడా కబ్జాలుంటే తొలగించాలని ఆదేశించారు. శంకరిపల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి వచ్చే బుల్కాపూర్ నాలా మియాఖాన్ గడ్డ, జన్వాడ, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, రాయదుర్గం, ఓయూకాలనీ, షేక్‌పేట, బీజేఆర్ నగర్, మహాత్మాగాంధీనగర్, హకీమ్సా విరాట్‌నగర్, బృందావన్ కాలనీ, టోలిచౌకి, మెహిదీపట్నం మిలటరీ ఏరియా, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12, చింతలబస్తీ, తుమ్మలబస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్‌సాగర్‌కు వరదనీరును ఈ చారిత్రక బుల్కాపూర్ నాలా తీసుకువస్తుంది.

## రాజన్న ఆలయ ఇంచార్జి ఈఓగా ఆర్డీఓ రాధభాయ్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 13 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవోగా విధులు నిర్వహిస్తున్న కె వినోద్ రెడ్డి బదిలీ అయ్యారు. రాజన్న ఆలయ ఈవోగా వేములవాడ ఆర్డీఓ గా విధులు నిర్వహిస్తున్న రాధభాయ్ ని ఇంచార్జి ఈఓ గా ప్రభుత్వం నియమించిన క్రమంలో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఆమె స్వామి వారిని దర్శించుకుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వాచనం చేయగా ఆలయ ఏఈఓ బి.శ్రీనివాస్ ఇన్చార్జి ఈవోకు స్వామివారి శేష వస్త్రం ప్రసాదాలను అందజేశారు.రాజన్న ఈఓ గా విధులు నిర్వర్తించి దేవాదాయ శాఖ రాష్ట్ర కార్యాలయంలో మల్టీ జోన్ 2 డీసీగా బదిలీపై వెళ్లిన వినోద్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు.వీరికి స్వామి వారి కల్యాణ మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వాదం ఇవ్వగా ఆలయ డిఈ మహిపల్ రెడ్డి, ఏఈ రామ్ కిషన్ రావు స్వామివారి శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేశారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి, జూన్ 13 (జనంసాక్షి) :** వర్షాకాలం జిల్లాలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ (సీజనల్ వ్యాధులు) ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల పై పీపీటీ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధం కావాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డులో మీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇండ్లలో ఉన్న నీటి నిల్వలను గుర్తించి మాపింగ్ చేసి, నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. ప్రతి మంగళ, శుక్ర వారాలలో డ్రైడే కార్యక్రమం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. వాటర్ లాగిన్ పాయింట్ల ఆయిల్ బాల్, గంబుషియా చేపలు వేయాలన్నారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అధికంగా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల పై గ్రామసభలలో సమావేశాలు నిర్వహించి, అవగాహన




కల్పించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలని, ముఖ్యంగా పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వృద్ధుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి అనుమానితుల నుండి రక్తనమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డెంగ్యూ రాపిడ్ టెస్టులు అవసరమైన మందులు అందుబాటులోఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లావ్యాప్తంగా కూలిపోయే స్థితిలో ఉన్న పాడైపోయిన భవనాలు, పాతబడిన భవనాలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, డిఆర్డీఓ కౌసల్య దేవి , జెడ్పి సీఈఓ రామిరెడ్డి,జిల్లా మలేరియా అధికారి రజిని, డిబిసిడిఓ పుష్పలత, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, వైద్య అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారామిలిటరీ బలగాల్లో అత్యుత్తమం సీఆర్పీఎఫ్

- సీఆర్పీఎఫ్ బలగాల త్యాగాలు, సేవలను మరువలేం
- ఉగ్రవాద, మావోయిస్టుల నిర్మూలనలో సీఆర్పీఎఫ్ పాత్ర కీలకం
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**రాంచీ, జూన్ 13 (జనంసాక్షి) :** జమ్మూ కాశ్మీర్ సహా దేశంలోని ఉగ్రవాదం, వేర్పాటువాదం ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్రవాదంతోపాటు మావోయిస్టుల ఏరివేతలో సీఆర్పీఎఫ్ బలగాలు చూపుతున్న తెగువ అద్భుతమని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశంలోని అంతర్గత శాంతి భద్రతలను పరిరక్షించడంలో సీఆర్పీఎఫ్ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. దేశ అంతర్గత భద్రత విషయంలో సీఆర్పీఎఫ్ బలగాల త్యాగాలను వెలకట్టలేనివని అభివర్ణించారు. రాంచిలోని బిర్సాముండా విమానాశ్రయానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అక్కడి నుండి బీఎస్ఎఫ్ హెలికాప్టర్ (ఎంఐ-17)లో జంషేడ్ పూర్ వెళ్లారు. విప్లవ వీరుడు బిర్సా ముండా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుండి సీఆర్పీఎఫ్ కేంద్రానికి వెళ్లిన బండి సంజయ్ నూతనంగా నిర్మించిన పలు సీఆర్పీఎఫ్ భవనాలను ప్రారంభించారు. అందులో 480 టైప్-2 మరియు 24 టైప్-3 కుటుంబ నివాస గృహాలు, 20 పడకల ఆసుపత్రి, స్టోర్ బిల్డింగ్, ట్రేడ్స్‌మెన్ షాప్, 180 మందికి గల మెన్ బ్యారక్ లు ఉన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎంపీ విద్యుత్ బరణ్ మహతో, అదనపు డీజీ అమిత్ కుమార్, ఐపీఎస్ అధికారులు శాలినీ, సాకేత్ కుమార్ తోపాటు పలువురు పోలీసు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో దుర్మరణం పాలైనవారికి సంతాపం తెలుపుతూ 2 నిమిషాలు మౌనం పాటించారు.

## రోడ్డు విస్తరణ భూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 13 (జనంసాక్షి) :** వేములవాడలో రోడ్డు విస్తరణలో ఇండ్లు,దుకాణాలు కోల్పోతున్న నిర్వాసితులకు శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో చెక్కులు పంపిణీ చేశారు. బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేస్తున్న క్రమంలో ఇండ్లు,దుకాణాలు, భూములు కోల్పోతున్న నిర్వాసితులకు జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, కలెక్టరేట్ అధికారులు చెక్కులు పంపిణీ చేశారు.వేములవాడలోని 40 మంది భూ నిర్వాసితులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవోరాధాబాయి, రెవెన్యూ అధికారులు,భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

## ఆటోలో ఎక్కించి మహిళ బంగారు గొలుసు దోపిడీ

- ఇద్దరు అరెస్ట్, పరారీలో మరొకరు..

**చౌటుప్పల్, జూన్ 9 (జనం సాక్షి) :** చౌటుప్పల్ లో ఈనెల 9న జరిగిన దోపిడీ ఘటనలో పోలీసులు శుక్రవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... బాటసింగారం గ్రామానికి చెందిన చింతల ఉపేంద్రమ్మ (61) ఆమె తన బంధువుల ఇంటికి వెళ్ళేందుకు ఆటోను ఆపి చౌటుప్పల్ బస్టాండ్ వద్ద దించమని కోరగా, ఆటోలో ఇప్పటికే ముగ్గురు యువకులు ఉండగా, ఛార్జీ బస్సు టికెట్‌కు సమానంగా ఉంటుందని చెప్పడంతో ఆమె వెళ్లేందుకు సిద్ధమయింది కాగా చౌటుప్పల్ వైపు ప్రయాణిస్తున్న సమయంలో, కొయ్యలగూడెం సమీపంలోని పెదరాశి పెద్దమ్మ హెూటల్ ఎదురుగా ఆటో అకస్మాత్తుగా 100 మీటర్ల దూరం లోపలికి తీసుకెళ్లారు. విషయం అనుమానాస్పదంగా కనిపించడంతో ఉపేంద్రమ్మ ప్రశ్నించగా, నిందితుల్లో ఒకరు ఆమె నోటిని చేత్తో మూసివేయగా, మిగతా ఇద్దరు ఆమె మెడలో ఉన్న 2.5 తులాల బంగారు గొలుసును లాక్కొని, ఆమెను ఆటో నుండి బయటకు తోసేసి వారు పరారయ్యారు. కాగా శుక్రవారం , బైరమల్గూడ, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఏ 1. రామావత్ రాము (20), ఆటో డ్రైవర్. గాయత్రీనగర్, మిర్‌పేట్ కు చెందిన ఏ 2. నేనావత్ గోపాల్ (30)ల చౌటుప్పల్ బస్టాండ్ వద్ద పట్టుకున్నారు. ఈ కేసులో మూడో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుండి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విమాన మృతుల కుటుంబాలకు సంతాపం




**తాండూరు, జూన్ 13 (జనంసాక్షి) :** గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో అకాల మరణం చెందిన వారందరికీ శుక్రవారం తాండూరు పట్టణంలోని అంబేద్కర్ చౌక్ లో శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి ఆత్మలకు శాంతి చేకూర్చాలని సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి మాజీ కౌన్సిలర్లు అంతారం లలితక్క, సాహూ శ్రీలత, జిల్లా కార్యదర్శి బంటా రం భద్రేశ్వర్, మోత్కుపల్లి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ సాయి రెడ్డి , జగదీష్ యాదవ్, దోమ కృష్ణా, మంతటి రాజు, చిదిరి ప్రకాష్, ప్రహ్లాద రావు, మఠం మల్లు, రమ్య నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి అంతారం కిరణ్ ,మిట్టి శ్రీనివాస్, బండారు శ్రీకాంత్ ,రామచందర్ ,తాంద్ర నరేష్, కావలి కృష్ణ, బబ్లు, ప్రభాకర్ గౌడ్ ,సతీష్, వడ్డే సాయిలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 11 ఏళ్ల మోదీ ప్రభుత్వ పాలన దిగ్విజయం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 13 (జనంసాక్షి) :** 2014లో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిందని 11 ఏళ్ల మోదీపాలన అమృత కాలం లాంటిదని, ఇన్నేళ్లలో ప్రధాని మోదీ భారతదేశ దిశా దశ మార్చేసి , భారత వైభవాన్ని విశ్వ వేదికపై నిలబెట్టారని, సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమమే లక్ష్యంగా ,సబ్ కా సాత్ సబ్ కా విశ్వాస్, సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్ ధ్యేయంగా ప్రధాని మోదీ 11 ఏళ్ల ప్రస్థానం దిగ్విజయంగా కొనసాగుతుందని బిజెపి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం సంకల్ప సాకారం పేరిట చేపట్టిన ప్రోగ్రాంలో భాగంగా కరీంనగర్ పార్లమెంటు కార్యాలయంలో తల్లోజు ఆచారి మీడియాతో మాట్లాడారు. వాగ్దానాలన్నీ కార్యాచరణగా మార్చి, సంక్షేమం నుండి సంరక్షణ వరకు 11 ఏళ్ల కాలంలో, ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ తో నాయకత్వం అంటే ఏమిటో దేశానికి, ప్రపంచానికి ప్రధాని మోడీ చూపెట్టారని తెలిపారు. మేకిన్ ఇండియా , ఆత్మ నిర్భర్ భారత్ తో , వికసిత్ భారత్ లక్ష్యంగా మోడీ ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తూ, నారీ శక్తికి పట్టంకట్టి, యువశక్తికి పగ్గాలిచ్చి, రక్షణ రంగంలో మేటిగా నిలిచి, అంతరిక్షాన పట్టు సాధించి, విద్యా వ్యవస్థకు మెరుగులు దిద్ది, ఎన్నో చారిత్రక సాహసోపేత నిర్ణయాలతో దేశాన్ని పరుగులు పెట్టిస్తు, విశ్వ గురువుగా భారతదేశాన్ని తీర్చిదిద్దుతున్న ఘనత




ప్రధాని మోదీ దే నన్నారు. డబల్ ఇంజన్ సర్కార్ తో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల కోఆర్డినేషన్ తో బిజెపి పాలిత రాష్ట్రాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజానీకాన్ని మోసం చేసిందని విమర్శించారు. ఏ ఒక్క గ్యారెంటీని, ఏ ఒక్క హామీని రేవంత్ రెడ్డి ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేకపోయిందని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ ను విశ్వసించడం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ఓ ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజల ఆశీర్వాదం, విశ్వాసం, నమ్మకంతోనే దేశంలో వరుసగా మూడోసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బి ఆర్ఎస్ , కాంగ్రెస్ లను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ అభివృద్ధికి బిజెపి కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులు , వివరాలను ఆయన ఈ సందర్భంగా సమగ్రంగా వివరించారు. తెలంగాణ లో బిజెపి ప్రభుత్వం రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని , ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎలక్షన్స్ రిజల్ట్ ఇందుకు నిదర్శనం అన్నారు. ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా పార్టీ క్యాడర్ నిరంతరం రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకురావడానికి తగిన కృషి చేయాలన్నారు. మీడియా సమావేశానికి ముందు 11 ఏళ్ల మోడీ ప్రభుత్వ ప్రస్థానంపై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్ ను తెల్లోజు ఆచారి ప్రారంభించారు. అలాగే వివిధ రంగాల ప్రొఫెషనల్ తో మీటింగ్ జరిగింది. ప్రొఫెషనల్ మీటింగ్లో పలువురు మోడీ ప్రభుత్వ పనితీరు పై ప్రశంసలు కురిపిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి , మాజీ ఎమ్మెల్యే బోడిగే శోభ, మాజీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గీతా మూర్తి, మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారి రాజేంద్రప్రసాద్ , ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బత్తుల లక్ష్మీనారాయణ, మాడ వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, ప్రోగ్రామ్ ఇన్చార్జి గుజ్జ శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వేషంలో మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

- రూ. 15.30 లక్షల నగదు, బంగారం, 3 కార్లు, 7 సెల్ ఫోన్‌లు స్వాధీనం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 13 (జనంసాక్షి) :** అమాయక ప్రజలను స్వామి వేషంలో పూజలు చేస్తామంటూ నమ్మించి, లేనిపోని పూజల పేరుతో డబ్బు దోచుకుని, బెదిరింపులకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి రూ. 15 లక్షల 30 వేల నగదు, 7 తులాల బంగారం, మూడు కార్లు (ఒక క్రెటా, ఒక బాలెనో, ఒక తార్), 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదుదారుడు ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ మోసానికి పాల్పడినవారు ఈర్నాల రాజు (చంద్రగిరి గ్రామం), మిరియాల దుర్గయ్య (అగ్రహారం గ్రామం), పెనుగొండ రాజు (చీర్లవంచ గ్రామం), చల్లా అజయ్ (చీర్లవంచ గ్రామం), ఈర్నాల సతీష్ (చీర్లవంచ గ్రామం).

### పోలీసుల దర్యాప్తు అరెస్ట్..

ఈ కేసును చేధించిన కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, కరీంనగర్ రూరల్ ఎస్సై లక్ష్మారెడ్డి, వారి బృందాన్ని కరీంనగర్ కమిషనర్ గౌష్ ఆలం, కరీంనగర్ రూరల్ ఎసిపి శుభం ప్రకాష్ ప్రత్యేకంగా అభినందించారు.

# సౌతాఫ్రికా ముందు 282 పరుగుల టార్గెట్

- ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులకు ఆలౌట్



లండన్ (జనంసాక్షి) : క్రికెట్ అభిమానుల ఉత్కంఠను తారాస్థాయికి చేర్చిన ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ 2025లో, దక్షిణాఫ్రికాకు ఆస్ట్రేలియా 282 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. లార్డ్స్‌లోని బౌలర్లకు స్వర్గధామమైన పిచ్‌పై ఈ లక్ష్యం దక్షిణాఫ్రికాకు ఒక సవాలుగా మారనుంది. ఆస్ట్రేలియా తమ రెండవ ఇన్నింగ్స్‌లో 207 పరుగులకు ఆలౌట్ కావడంతో, మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం 74 పరుగులతో కలిపి మొత్తం 281 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించుకుంది.మ్యాచ్ మొదటి రెండు రోజులు బౌలర్లదే ఆధిపత్యం. ఇరు జట్ల బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమించారు. దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌లో 138 పరుగులకు ఆలౌట్ కాగా, ఆస్ట్రేలియా 212 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా రెండవ ఇన్నింగ్స్‌లో కూడా టాప్ ఆర్డర్ తడబడినప్పటికీ, మిచెల్ స్టార్క్ (58), జోష్ హేజిల్ వుడ్ (17) చివరి వికెట్‌కు విలువైన భాగస్వామ్యం నెలకొల్పి ఆస్ట్రేలియాను గౌరవప్రదమైన స్థితికి చేర్చారు.లార్డ్స్‌లో 250కి పైగా పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం టెస్ట్ చరిత్రలో కేవలం మూడు సార్లు మాత్రమే సాధ్యమైంది. 1984లో వెస్టిండీస్ 344 పరుగులను, 2004లో ఇంగ్లాండ్ 282 పరుగులను, 2022లో ఇంగ్లాండ్ 277 పరుగులను విజయవంతంగా ఛేదించాయి. ఈ గణాంకాలు దక్షిణాఫ్రికా ముందున్న సవాలును స్పష్టంగా తెలియజేస్తున్నాయి. అయితే, ఈ డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఏ క్షణంలోనైనా మ్యాచ్ స్వరూపం మారే అవకాశం ఉంది. పిచ్ ఇంకా బౌలర్లకు అనుకూలంగా ఉన్నప్పటికీ, నాలుగవ ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడానికి కొంత తేలికవుతుందనే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దక్షిణాఫ్రికా బ్యాటర్లు ఈ కఠినమైన లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టిస్తారా, లేదా ఆస్ట్రేలియా తమ బౌలింగ్ పదునుతో డబ్ల్యూటీసీ టైటిల్‌ను నిలబెట్టుకుంటుందా అనేది చూడాలి. తొలి రోజు తరహాలోనే రెండో రోజు కూడా బౌలర్ల హవానే నడిచింది. మొత్తం 14 వికెట్లు నేలకూలాయి. అంతకుముందు 43/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 138 పరుగులకే కుప్పకూలింది. డేవిడ్ బెడింగ్‌హమ్(111 బంతుల్లో 6 ఫోర్లతో 45), టెంబా బవుమా(84 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 36) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్(6/28) ఆరు వికెట్లతో సౌతాఫ్రికా పతనాన్ని శాసించాడు. కమిన్స్‌కు తోడుగా మిచెల్ స్టార్క్(2/41) రెండు వికెట్లు తీయగా..జోష్ హేజిల్ వుడ్(1/27)కు ఓ వికెట్ దక్కింది. వర్షం అంతరాయం కలిగించడం సౌతాఫ్రికాకు కొంపముంచింది. వర్షం అనంతరం పిచ్ కండిషన్స్ బౌలింగ్‌కు అనుకూలంగా మారడంతో సౌతాఫ్రికా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సఫారీ బౌలర్లు నిప్పులు చెరిగారు. దాంతో ఉస్మాన్ ఖవాజా(6), కామెరున్ గ్రీన్(0), స్టీవ్ స్మిత్(13), ట్రావిస్ హెడ్(9), బ్యూ వెబ్‌స్టర్(9), ప్యాట్ కమిన్స్(6) తీవ్రంగా నిరాశపరిచారు. మిచెల్ స్టార్క్ సాయంతో అలెక్స్ క్యారీ పోరాడాడు.

# అందరి దృష్టి భారత బ్యాటింగ్ లైనప్‌పైనే..

- ఇంగ్లాండ్‌తో 20 నుంచి లీడ్స్‌లో తొలి టెస్టు



న్యూఢిల్లీ (జనంసాక్షి) : ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ 2025–27 సైకిల్‌ను ఈసారి విదేశాల్లో భారత్ ప్రారంభించ బోతోంది. ఐదు టెస్టుల సిరీస్‌తో ప్రతిష్ఠాత్మక పోరును మొదలు పెట్టనుంది. ఇంగ్లాండ్‌తో ఈనెల 20 నుంచి లీడ్స్ మైదానంలో జరిగే తొలి టెస్టు ద్వారా చాలెంజింగ్ టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది. ఇక ఈ సారి దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేకుండానే టీమిండియా ఈ టూర్ చేస్తోంది. తాజాగా మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప.. ఇంగ్లాండ్‌లో బరిలోకి దిగబోయే భారత బ్యాటింగ్ లైనప్ పై వ్యాఖ్యానించాడు. ఒక ఓపెనర్ గా యశస్వి జైస్వాల్ ఖాయం కాగా, ప్రస్తుత టూర్లో సత్తా చాటిన సీనియర్ బ్యాటర్ లోకేశ్ రాహుల్ ను జైస్వాల్ కు తోడుగా ఓపెనింగ్ చేయించాలని సూచిస్తున్నాడు. ప్రస్తుత టూర్లో ప్రాక్టీస్ మ్యాచ్ ల్లో ఒక సెంచరీ, ఫిఫ్టీతో సత్తా చాటాడు. అలాగే గతంలో ఇంగ్లాండ్‌లో తోపాటు ఆసీస్ లోనూ రాణించిన అనుభవం అతని సొంతమని చెప్పాడు. ఇక నెంబర్ త్రీలో ఐపీఎల్లో విశేషంగా రాణించిన సాయి సుదర్శన్ ను తీసుకోవాలని సూచిస్తున్నాడు. దీంతో టాప్ త్రీ బలంగా ఉంటుందని పేర్కొన్నాడు. ఇక నాలుగో నెంబర్లో కెప్టెన్ శుభమాన్ గిల్, ఐదో స్థానంలో అనుభవం గల కరుణ్ నాయర్ ను ఆడించాలని సూచించాడు. అప్పుడే బ్యాటింగ్ లో స్థిరత్వం ఉంటుందని పేర్కొన్నాడు. ఇక ఆరో నెంబర్లో డాషింగ్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ ను బరిలోకి దింపాలని పేర్కొన్నాడు. ఇక ఏడో స్థానంలో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డిని ఆడించాలని సూచించాడు. పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్ గా అదిస్తే, అటు నాలుగో పేసర్ గానూ, ఇటు బ్యాటింగ్ లోనూ డెప్త్ ఉంటుందని పేర్కొన్నాడు. ఎనిమిదో స్థానంలో వెటరన్ స్పిన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాను ఆడించాలని సూచించాడు. దీంతో కుల్దీప్ యాదవ్ ను పక్కన పెట్టాలని పేర్కొన్నాడు. ఇక పేస్ బాధ్యతలను జస్ ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలకు అప్పగించాలని, వీరికి తోడుగా నాలుగో పేసర్ గా నితీశ్ ఉంటాడని పేర్కొన్నాడు. ఇంగ్లాండ్ పరిస్థితులకు ఇదే బెస్ట్ బ్యాటింగ్ లైనప్ అని విశ్వాసం వ్యక్తం చేశాడు. తాజా లైనప్ తో జట్టు సమతూకంతో ఉందని వ్యాఖ్యానించాడు. ఏదేమైనా అటు కోచ్ గౌతం గంభీర్, ఇటు కెప్టెన్ గిల్ ఆలోచనకు తగిన ప్లేయింగ్ లెవన్ ఏ విధంగా ఉంటుందో తెలియాలంటే మరో వారం రోజులు ఆగక తప్పని పరిస్థితి నెలకొంది.

# 'హ్యాండిల్డ్ ది బాల్' వివాదం!



ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025లో భాగంగా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న ఫైనల్‌లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. 'హ్యాండిల్డ్ ది బాల్' వివాదం తీవ్ర చర్చనీయాంశమైంది. సౌతాఫ్రికా బ్యాటర్ డేవిడ్ బెడింగ్‌హమ్ తన ప్యాడ్‌లో ఇరుక్కున్న బంతిని చేత్తో కిందపడేయడం వివాదాస్పదమైంది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఘటనపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఔటంటే.. మరికొందరు నాటౌట్ అని కామెంట్ చేస్తున్నారు.గురువారమైన రెండో రోజు ఆటలో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ సందర్భంగా బ్యూ వెబ్‌స్టర్ వేసిన 49వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ మూడో బంతిని వెబ్‌స్టర్ ఆఫ్ స్టంప్ లైన్‌లో వేయగా.. బెడింగ్‌హమ్ డిఫెన్స్ చేసే ప్రయత్నం చేశాడు. కానీ ఇన్‌సైడ్ ఎడ్జ్ తీసుకున్న బంతి బెడింగ్‌హమ్ ప్యాడ్‌లో ఇరుక్కుంది. ఆ బంతి కిందికి వచ్చే అవకాశం ఉండటంతో ఆసీస్ వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ క్యాచ్ కోసం ప్రయత్నించాడు. కానీ బెడింగ్‌హమ్ బంతిని చేత్తో తీసి కిందపడేశాడు. దాంతో ఆసీస్ ఆటగాళ్లు 'హ్యాండిల్డ్ ది బాల్' గురించి అప్పీల్ చేశారు. అయితే అంపైర్లు నాటౌట్‌గా ఇచ్చారు. అప్పటికే బంతి డెడ్ బాల్ అయిందని స్పష్టం చేశారు.క్రికెట్ నియమాల ప్రకారం బంతి బ్యాటర్ ప్యాడ్లలో లేదా దుస్తుల్లో ఇరుక్కుంటే డెడ్ బాల్‌గా పరిగణిస్తారు. బ్యాటర్ పట్టుకున్నా నాటౌట్‌గానే ఇస్తారు. అయితే రిప్లేలో బంతి కిందపడేసే క్రమంలో బెడింగ్‌హమ్ బంతిని పట్టుకోవడం వివాదమైంది. బంతి డెడ్ అయినప్పుడు కాకుండా కదులుతూ ఉన్న సమయంలో పట్టుకున్నాడని, ఔటివ్వాల్సిందని కొంతమంది వాదిస్తున్నారు. బ్యాటర్ ఉద్దేశపూర్వకంగా చేతితో బంతిని అడ్డుకుంటే హ్యాండిల్డ్ ది బాల్ రూల్ కింద ఔటిస్తారు. బ్యాటర్ బంతి వికెట్ల వైపు వెళ్తుండగా అడ్డుకోవడం లేదా ఫీల్డర్ క్యాచ్ పట్టకుండా చేస్తే ఈ రూల్ కింద ఔట్ ఇస్తారు. బ్యాటర్ తన శరీరాన్ని గాయం నుంచి రక్షించుకోవడానికి బంతిని చేతితో తాకితే మాత్రం ఔటివ్వకుండా మినహాయింపు ఇస్తారు. గతంలో 'హ్యాండిల్డ్ ది బాల్' అనేది క్రికెట్ నిబంధనల్లో ఒక ప్రత్యేకమైన ఔట్(లా 33) పద్ధతిగా ఉండేది. 2017లో %విజ% (మేరిల్‌బోన్ క్రికెట్ క్లబ్) ఈ రూల్‌ను సవరించింది. ఈ రూల్‌ను అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్(లా 37) అనే నియమంలో విలీనం చేసింది. ఈ రూల్ ప్రకారం బంగ్లాదేశ్ ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ ఒక మ్యాచ్‌లో ఔటయ్యాడు. బౌలర్ వేసిన బంతిని డిఫెండ్ చేసిన తర్వాత, అది వికెట్ల వైపు వెళ్తుండగా అతను చేతితో అడ్డుకున్నాడు.

# టీ20 ఇన్నింగ్స్‌లో కొత్త ప్రపంచ రికార్డు

- సూర్యవంశీ, గేల్ రికార్డ్‌లను బ్రేక్ చేసిన ఫిన్ అలెన్



మేజర్ లీగ్ క్రికెట్ 2025 సీజన్ అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. టోర్నమెంట్‌లోని మొదటి మ్యాచ్‌లోనే న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ ఫిన్ అలెన్ సంచలనం సృష్టించాడు. శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్స్ తరఫున వాషింగ్టన్ ఫ్రీడమ్ పై అలెన్ కేవలం 51 బంతుల్లో 151 పరుగులు చేసి, టీ20 క్రికెట్ చరిత్రలో పలు రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ అసాధారణ ఇన్నింగ్స్‌తో శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్స్ 123 పరుగుల భారీ తేడాతో వాషింగ్టన్ ఫ్రీడమ్ ను చిత్తు చేసింది.ఫిన్ అలెన్ ఇన్నింగ్స్‌లో అత్యంత ఆకర్షణీయమైన అంశం అతను బాదిన సిక్సర్ల సంఖ్య. అలెన్ 19 సిక్సర్లు కొట్టి, టీ20 ఇన్నింగ్స్ లో అత్యధిక సిక్సర్లు బాదిన క్రిస్ గేల్ (18 సిక్సర్లు) రికార్డును అధిగమించాడు. 2017లో బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ లో రంగపూర్ రైడర్స్ తరఫున క్రిస్ గేల్ ఈ రికార్డును నెలకొల్పగా, ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ కూడా 2024లో 18 సిక్సర్లతో ఈ రికార్డును సమం చేశాడు. ఇప్పుడు ఫిన్ అలెన్ 19 సిక్సర్లతో వారిద్దరినీ అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించాడు. అలెన్ తన 150 పరుగులను కేవలం 49 బంతుల్లోనే సాధించి, టీ20 క్రికెట్ లో అత్యంత వేగంగా 150 పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. గతంలో ఈ రికార్డు డెవాల్డ్ బ్రేవిస్ (52 బంతులు) పేరిట ఉండేది.ఫిన్ అలెన్ 151 పరుగుల ఇన్నింగ్స్ అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నమోదైంది. గతంలో నికోలస్ పూరన్ 2023 ఫైనల్ లో చేసిన 137 పరుగులే అత్యధికం. కేవలం 34 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, అత్యంత వేగవంతమైన సెంచరీని నమోదు చేశాడు. ఇది టీ20 ఫ్రాంచైజ్ లీగ్‌లలో క్రిస్ గేల్ (30 బంతులు, ఐపీఎల్ 2013) తర్వాత రెండో అత్యంత వేగవంతమైన సెంచరీ. శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్స్ అలెన్ విధ్వంసకర బ్యాటింగ్ పుణ్యమా అని 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. ఇది చరిత్రలో అత్యధిక టీమ్ స్కోరుగా నిలిచింది. అమెరికా గడ్డపై టీ20 మ్యాచ్ లో 200 పరుగుల మార్కును దాటిన తొలి జట్టుగా యునికార్న్స్ నిలిచింది. 123 పరుగుల తేడాతో గెలిచిన శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్స్, ఎమ్మెల్సీ చరిత్రలో అత్యధిక పరుగుల తేడాతో విజయం సాధించిన జట్టుగా రికార్డు సృష్టించింది. వాషింగ్టన్ ఫ్రీడమ్ కు కెప్టెన్ గా వ్యవహరించిన గ్లెన్ మాక్స్ వెల్, అలెన్ బ్యాటింగ్‌ను అభినందించాడు. పిచ్ బ్యాటింగ్ కు అనుకూలంగా ఉందని, బౌండరీలు చిన్నవిగా ఉన్నాయని, కానీ అలెన్ ఆధిపత్యం తమ ప్రణాళికలను దెబ్బతీసిందని పేర్కొన్నాడు. ఫిన్ అలెన్ ఈ రికార్డు బ్రేకింగ్ ఇన్నింగ్స్ తో మేజర్ లీగ్ క్రికెట్ 2025 సీజన్ కు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. రాబోయే మ్యాచ్ లలో మరిన్ని అద్భుత ప్రదర్శనలను ఆశించవచ్చు.

## ఆన్‌లైన్ శిక్షణా తరగతులతో
# జర్నలిజం కోర్సులు

- సిఆర్‌ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటికి నిమ్మరాజు వినతి



విజయవాడ, జూన్ 13 (జనంసాక్షి) : భవిష్యత్తు జీవనోపాధి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని ఆన్లైన్ శిక్షణ తరగతులతో జర్నలిస్టులకు జర్నలిజం సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించాలని సిఆర్ ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ను శుక్రవారం కలిసిన సీనియర్ జర్నలిస్టు, ఉమ్మడి రాష్ట్ర అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు నిమ్మరాజు చలపతిరావు విజ్ఞప్తి చేశారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహించామని ఆ పై తొలి చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి సహకారంతో ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం ప్రారంభించామని నిమ్మరాజు తెలిపారు. ఈ తరగతులలో అందించిన సర్టిఫికెట్ల వలన ఆశించినంత ప్రయోజనం కన్పించలేదన్నారు. సెల్ఫోన్ వ్యవస్థ వలన ఏ ఒక్కరు ప్రసంగాలపట్ల దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారని అన్నారు. అసెంబ్లీ తరహాలో తరగతి గది వెలుపల సెల్ఫోన్లను సేకరించడం మంచిదన్నారు. 30 ఏళ్ళ క్రితం గుంటూరులో సురేష్, తను కలిసి పనిచేసిన స్మృతులను నిమ్మరాజు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

## 19న అరిబండి లక్ష్మీనారాయణ మెమోరియల్
# లెక్చర్, వానాకాలం సాగు సెమినార్

- పోస్టర్ రిలీజ్ చేసిన టీ.సాగర్, అరిబండి ప్రసాద్ రావు




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రైతు సంఘం, అరిబండి లక్ష్మీనారాయణ మెమోరియల్ ట్రస్ట్ ల ఆధ్వర్యంలో జూన్ 19న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు అరిబండి లక్ష్మీనారాయణ మెమోరియల్ లెక్చర్, వానాకాలం సెమినార్లను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, అరిబండి మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు లు పిలుపునిచ్చారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో వారు పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అరిబండి లక్ష్మీనారాయణ 7వ స్మారకోపన్యాసాన్ని వ్యవసాయ రంగం – ఎదుర్కొంటున్న సవాళ్ళు అంశం పై అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్ ప్రధాన ఉపన్యాసం చేస్తారని అనంతరం అరిబండి ప్రసాద్ రావు రచించిన నేను మన భూమి ఒక జీవన స్మృతి పుస్తకావిష్కరణ జరుగుతుందని, అనంతరం వానాకాలం సాగు -తీసుకోవాల్సిన చర్యలు అనే అంశంపై సెమినార్ జరుగుతుందని ఈ సెమినార్ కు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి రాజి రెడ్డి, వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ కె విజయకుమార్, రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ విధానాలు, ఎగుమతులు దిగుమతులు విధానాలు రైతాంగం పై దాని ప్రభావం ప్రధానంగా చర్చిస్తామని తెలియజేశారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్ ముందస్తుగానే ప్రారంభమైంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, రైతు భరోసా, రైతు బీమా, పంటల బీమా, బ్యాంకు రుణాలు, దీనిపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రైతులు వీటిని ఏ రకంగా ఉపయోగించుకోవాలి. చీడపీడలను ఎదుర్కోవడానికి ఏ రకమైన జాగ్రత్తలు తీసుకోవాలి అనే సూచనలు సలహాలు చర్చిస్తారు. రాష్ట్ర నలుమూలల నుండి ఎంపిక చేసిన రైతు సంఘం ప్రతినిధులు ఈ సెమినార్ లో పాల్గొంటారు. విద్యావంతులు, మేధావులు కూడా ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు శివకుమార్ లు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యానికి వన్ స్టాప్ వన్ సొల్యూషన్

- అమృత సంకల్ప్ క్లినిక్ ప్రారంభించిన కెటిఆర్




హైదరాబాద్, జూన్ 13 (జనంసాక్షి) : మానసిక ఆరోగ్యానికి వన్ స్టాప్ వన్ సొల్యూషన్ సరైన మార్గమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లో అమృత సంకల్ప్ పేరుతో ఏర్పాటు చేసిన క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మానసిక అనారోగ్యాన్ని కేవలం అనారోగ్య సమస్యగా మాత్రమే కాదని, వెల్‌నెస్ లెన్స్ ద్వారా కూడా చూడాలని అన్నారు. ఈ మార్పునకు నాయకత్వం వహించడానికి డాక్టర్ సురేంద్ర ముందుకు రావడం ప్రశంస నీయమని కొనియాడారు. దీర్ఘకాలిక భావోద్వేగ స్థితిస్థాపకతను పెంపొందించడంతో పాటు– మానసిక అనారోగ్యానికి చికిత్స చేసే క్లినిక్ సమగ్ర విధానాన్ని ఆయన ప్రశంసించారు. మీ క్లినిక్ పిల్లలు, పెద్దలు, వృద్ధులకు క్రమబద్ధమైన సంరక్షణను అందిస్తుందని పేర్కొన్నారు. దీంతో ఒత్తిడి, ఆందోళన, నిరాశ, సంబంధ సమస్యలు, ఓసీడీ, వ్యసనంతో పాటు– మరింత తీవ్రమైన పరిస్థితులతో సహా విస్తృతశ్రేణి సమస్యలను పరిష్కరిస్తుందని అన్నారు. మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యంతో పాటు– ముఖ్యమైనదని కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం ఉన్న జీవనశైలి వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు– మానసిక ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యమైనదిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడుతోంది. కేవలం శారీరక బాధలు మాత్రమే కాకుండా, మానసిక రుగ్మతలు, సమస్యల విషయంలో కూడా ప్రజలు అవసరమైన వైద్యుల సహాయాన్ని పొందాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సందర్భంలో ఈ రోజు ప్రారంభించిన ఈ తరహా సౌకర్యాలు అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అనేక మానసిక సమస్యలను తల్లిదండ్రులకు, స్నేహితులకు చెప్పుకునే పరిస్థితి లేకపోవడం వల్ల... మానసిక నిపుణులు, మానసిక వైద్యుల సహకారంతో స్వాంతన పొందే అవకాశం కలుగుతుంది. మానసిక సమస్యలకు చికిత్స తీసుకోవడం అనేది అవమానకరం కాదనే విషయాన్ని సమాజం అర్థం చేసుకోవాలి. దీనిపై ఉన్న నెగటివ్ అభిప్రాయం మారాల్సిన అవసరం ఉంది.' అని కేటీఆర్ అన్నారు. మానసిక సమస్యలు కారణంగా చాలామంది ఆత్మహత్య లాంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని.. ప్రాణం కోల్పోవడం కంటే మానసిక చికిత్స తీసుకోవడం ఎంతో సులభమనే విషయం ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచించారు. అమృత సంకల్ప్ మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం, సమాజానికి తిరిగి ఇవ్వడం నా మార్గం అని డాక్టర్ సురేంద్ర అన్నారు. అమృత సంకల్ప్ అనేది కేవలం ఒక క్లినిక్ మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి, ఎలా పరిష్కరించాలి అనే దానిని పునర్నిర్వచించడానికి ఇది ఒక ఉద్యమం అని తెలియజేశారు.

# పిల్లలకు అక్షరాభ్యాసం చేయించిన మంత్రి సీతక్క



కొత్తగూడ జూన్ 13 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లోని ఎం పి యూ పి ఎస్ కొత్తగూడ పాఠశాలలో శుక్రవారం రోజున బడి బాట కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, వైభవంగా జరిగింది. విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి బలమైన పునాది వేసే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులతో కలిసి అక్షరాభ్యాసం చేయించి, వారికి ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచుకోవాలి. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి బడి బాట లో భాగస్వాములవ్వాలి అని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, బాలల భవిష్యత్తుకు అవి ఎంతగానో తోడ్పడతాయని ఆమె స్పష్టం చేశారు.అదేవిధంగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచినటువంటి మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి ని ఈ సందర్భంగా అభినందించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నూతన విద్యా రంగ లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులకు బలమైన పునాది వేయాలి అని అన్నారు. అధికారులు సమష్టిగా, సమన్వయంతో పనిచేసి విద్యా నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో జిల్లా విద్యాశాఖ అధికారి డా. రవీందర్ రెడ్డి,ఆర్డీఓ కృష్ణవేణి,ఎం ఈ ఓ గుమ్మడి లక్ష్మి నారాయణ,రమాదేవి,ఎం పి యూ పి ఎస్ కొత్తగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత, ఉపాధ్యాయ బృందం,ఎం ఆర్ సి సిబ్బంది తో పాటు అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సత్యనారాయణ వ్రత టిక్కెట్ల ధర 200 పెంపు

- యాదగిరిగుట్ట ఇవో ఉత్తర్వులు

యాదగిరిగుట్ట, జూన్13 (జనంసాక్షి) : ప్రఖ్యాత పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శనం కోసం నిత్యం వేల మంది భక్తులు తరలి వస్తుంటారు. ఇక, పండుగలు, ప్రత్యేక పర్వదినాలు, వారాంతాల్లో యాదగిరిగుట్టలో రద్దీ భారీగా ఉంటుంది. అయితే, యాదాద్రి ఆలయానికి వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది ఇక్కడ సత్యనారాయణ స్వామి వ్రతం చేయించుకోవడానికి ఆసక్తి చూపిస్తారు.ఈ క్రమంలో ఆలయ దేవస్థానం అధికారులు నరసింహస్వామి భక్తులకు షాక్ ఇచ్చారు. వ్రత టికెట్ ధరను భారీగా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. యాదగిరిగుట్ట దేవాలయంలో నిర్వహించే సత్యనారాయణ స్వామి వ్రతం టికెట్ ధరలను పెంచుతూ ఈవో వెంకటరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు యాదాద్రిలో వ్రతం టికెట్ ధర రూ. 800గా ఉండగా.. దాన్ని ఇప్పుడు రూ. 1000కి పెంచారు. సత్యనారాయణ స్వామి వ్రతం విషయానికి వస్తే.. అన్నవరం తర్వాత ఎక్కువగా యాదగిరిగుట్టలోనే వ్రతాలు చేయించుకుంటారు. ఇప్పుడే టికెట్ రేటు పెంచడంపై భక్తులు ఆగ్రహించడం. ఇప్పటివరకు టికెట్ తీసుకుంటే.. భక్తులకు పూజ సామాగ్రిని ఇచ్చేవారు.. ఇక, ఇప్పటి నుంచి ఈ టికెట్ మీద భక్తులకు పూజ సామాగ్రితో పాటుగా స్వామివారి శేష వస్త్రాలు అలాగే, సత్యనారాయణస్వామి విగ్రహ ప్రతిమ కూడా అందజేయనున్నారు. పెరిగిన టికెట్ ధరలు వెంటనే అమల్లోకి రానున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14 జూన్ 2025



# ప్రభుత్వ పథకాలు మాకొద్దు!

- ఇథనాల్ పరిశ్రమను తరలిస్తేనే సహకరిస్తాం
- రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్
- వెనుదిరిగిన రెవెన్యూ అధికారులు

**రాజోలి, జూన్ 13 (జనంసాక్షి) :** రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో గ్రామస్తులు భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సును బహిష్కరించారు. ఇథనాల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేసి, రైతులపై అక్రమ కేసులు ఎత్తివేస్తేనే భూ భారతి కార్యక్రమానికి సహకరిస్తామని తేల్చిచెప్పారు. శుక్రవారం పెద్ద ధన్వాడ గ్రామంలో భూభారతి కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చారు. రైతులపై అక్రమ కేసులు, 12మందిని వెంటనే విడుదల చేయాలని గ్రామస్థులు అధికారుల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాజోలి తాహసిల్దార్ రామ్మోహన్ కు అక్రమ కేసులు ఎత్తివేసి ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించాకే తమ గ్రామంలోకి రావాలని డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే ప్రభుత్వ పథకాలకు సహకరిస్తామని తేల్చిచెప్పారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగి వెళ్లిపోయారు.

# సీజీఎఫ్ నిధులు పారదర్శకంగా వినియోగించాలి

- టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- సచివాలయంలో ఎండోమెంటు సీజీఎఫ్ కమిటీ మీటింగులో పాల్గొన్న మంత్రి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని తెలంగాణ దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఎండోమెంటు డిపార్టుమెంటు అధికారులు ప్రధానంగా ఈ అంశంపైనే ఫోకస్ పెట్టాల్సిన అనివార్యత ఉందని మంత్రి ఉద్ఘాటించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆమె వెల్లడించారు. ఇక ఆషాఢ బోనాలు ఈ దఫా వరంగల్ భద్రాకాళి టెంపుల్ లో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పండగను, సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నదే తమ ఉద్దేశమన్నారు. మన రాష్ట్ర ప్రజలను ధార్మిక చింతన వైపు తీసుకెళ్ళడంలో తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని చెప్పారు. దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సీజీఎఫ్ నిధులను పారదర్శకంగా వినియోగించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఎండోమెంటు డిపార్టుమెంటు సీజీఎఫ్ కమిటీ మీటింగు జరిగింది. ఈ సమావేశం మంత్రి సురేఖ నేతృత్వంలో జరగ్గా, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్ రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఇతర ఉన్నతాధికారులు, ఈఓలు, సీజీఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### అధికారు కృషి అవసరం

రాష్ట్రంలో చిన్న చిన్న దేవాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులపై మంత్రి కొండా సురేఖ సమీక్ష నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధికి ఈఓలు, ఆ శాఖ ఉన్నతాధికారుల కృషి అనివార్యమని మంత్రి అభిప్రాయపడ్డారు. సీజీఎఫ్ లో భాగంగా, చిన్న దేవాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులపై మంత్రి సురేఖకు అధికారులు వివరించారు. బడ్జెట్ అనుమతులు, సీజీఎఫ్ నిధుల కోసం వచ్చిన విజ్ఞప్తుల మీద అధికారులతో మంత్రి సమగ్రంగా చర్చించారు. శుక్రవారం జరిగిన సీజీఎఫ్ సమావేశంలో రూ. 72.47 కోట్ల విలువైన, మొత్తం 297 వర్కులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను ఈఓ పాటించాలని పేర్కొన్నారు. సీజీఎఫ్ పనులపై క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం సరికాదన్నారు. సీజీఎఫ్ పనుల మీద రెండు రెండు సార్లు పనుల ప్రపోజల్స్ తమకు పంపకూడదన్నారు. ఏదీ ఉన్న తమకు ఒకే సందర్భంలో తెలపాలన్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల నుంచి ఎస్టిమేషన్స్ ఎంత వస్తే అంత తమకు పంపకూడదని, వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సరైన విధంగా అంచనాలు వేయాలని సూచించారు. ఈఓలు ఫీల్డ్ లో సమగ్రంగా పరిశీలించి తగిన మేరకు అంచనాలు రూపొందించాలన్నారు. ఇక రాష్ట్రంలోని ఆలయాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాల అభివృద్ధి, ఆదాయ వనరులు పెంచేందుకు ప్రణాళికతో ముందుకెళ్ళాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. టెంపుల్ టూరిజం సర్క్యూట్లపై మరింత కసరత్తు చేయాలన్నారు. ఒక జిల్లాలోని మూడు ప్రధాన ఆలయాలను కలిపి ఒక సర్క్యూట్‌గా ప్రణాళికలను రూపొంది వెళ్తున్నామని, ఈ ప్రక్రియ మూడు విడతలుగా చేయాల్సి ఉంటుందన్నారు.




## జాతీయ కియో కరాటే పోటిల్లో తెలంగాణ బాలిక ఆరాధ్యకు కాంస్య పతకం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉత్తరాఖండ్ రాష్ట్రం డేహ్రాడూన్ లో జరుగుతున్న 4వ జాతీయ కియో కరాటే ఛాంపియన్ షిప్ పోటిల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాలిక ఆరాధ్య తాళపత్రి కటా విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నారు. శుక్రవారం జరిగిన పోటీలో ఆరాధ్య వ్యక్తిగత మహిళా క్యాడెట్ లో కాంస్య పతకం గెలుచుకోవడం ద్వారా రాష్ట్రానికి కీర్తిని తెచ్చి పెట్టారు. కియో కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా పీ సీ సీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వ్యవహరిస్తున్నారు. కరాటే కోచ్ సేన్ నరేష్ సారథ్యంలో ఆరాధ్యజాతీయ స్థాయి కియో కరాటే పోటిల్లో కాంస్య పతకం గెలుచుకున్నారు. గత ఏడాది డిసెంబర్ లో దక్షిణ ఆఫ్రికా దర్బన్ లో జరిగిన కామన్వేల్త్ అంతర్జాతీయ కరాటే పోటిల్లో ఆరాధ్య గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారు.

# ఇక్రిశాట్ స్కూల్‌ను సందర్శించిన పవన్

- మార్క్ శంకర్ అడ్మిషన్ కోసమేనని సమాచారం



**పటాన్‌చెరు, జూన్13 (జనంసాక్షి) :** ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ హైదరాబాద్ శివారు సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చెరు వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన ఇక్రిశాట్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్‌ను సందర్శించారు. ఒక తండ్రిగా తన విధి నిర్వహణ కోసం డిప్యూటీ- సిఎం సెలవు తీసుకున్నారని, కుమారుని అడ్మిషన్ కోసం ఆయన అక్కడికి వెళ్లారని సమాచారం. అడ్మిషన్‌కు సంబంధించి వివరాలను సేకరించారని, పాఠశాలలో సౌకర్యాలను కూడా తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక వార్త వెలువడలేదు. ఇటీవల సింగపూర్‌లో మార్క్ శంకర్ చదువుతున్న పాఠశాలలో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. మార్క్ శంకర్‌ను తీసుకువచ్చేందుకు చిరంజీవి, ఆయన భార్య సురేఖలతో కలిసి డిప్యూటీ- సిఎం పవన్ కళ్యాణ్ సింగపూర్ వెళ్లారు. మార్క్ శంకర్‌ను ఇక్కడికి తీసుకుని వచ్చేందుకు నిర్ణయించి ఇక్రిశాట్ ఐఎస్‌హెచ్‌ను సందర్శించి.. అక్కడి టీచర్లతో మాట్లాడారు. కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌ను ఇక్రిశాట్‌లో చేర్పించేందుకే పవన్ అక్కడకు వెళ్లినట్లు- తెలుస్తోంది. సింగపూర్‌లోని స్కూల్‌లో జరిగిన ప్రమాదంలో పవన్, అన్నా లెజినోవా కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డారు. ఈ ఘటనలో మార్క్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. అంతేకాకుండా ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో ఇబ్బందిపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే మార్క్ శంకర్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. కుమారిడికి ప్రమాదం జరిగిన సమయంలో పవన్ కళ్యాణ్ అల్లూరి సీతారామారాజు జిల్లా అరకు పర్యటనలో ఉన్నారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే డిప్యూటీ- సీఎం హుటాహుటిన సింగపూర్‌కు వెళ్లారు. అక్కడ చికిత్స తరువాత మార్క్ శంకర్‌ను ఇండియాకు తీసుకుని వచ్చేశారు. అనంతరం ఇక్కడ కూడా కొద్దిరోజుల పాటు- చిన్నారికి చికిత్స చేయించారు. ఇప్పుడు మార్క్ శంకర్ పూర్తిగా కోలుకున్నారు. ఈ ఘటన తర్వాత కుమారుడు మార్క్ శంకర్‌ను ఇండియాలోనే చదవించాలని పవన్ నిర్ణయించినట్లు- సమాచారం. అందులో భాగంగానే పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో మార్క్‌ను చేర్పించేందుకే అడ్మిషన్ కోసం పవన్ అక్కడకు వెళ్లినట్లు తెలుస్తోంది.

# బిడ్డ కోసం కలలు కన్న యువకుడు

- పురిట్లోనే బిడ్డ మరణం తట్టుకోలేక ఆత్మహత్య

**నిజామాబాద్, జూన్13 (జనంసాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓ యువకుడు ఆత్మహత్య కలకలం రేపుతోంది. సాయిలు అనే యువకుడు ఆస్పత్రి ఆవరణలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే సాయిలు బలవన్మరణానికి గల కారణాలు తెలిసి అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భర్త మరణంతో భార్య కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. అప్పుడే పుట్టిన బిడ్డ అనారోగ్యంతో మరణించడంతో ట్టుకోలేక పోయిన సాయిలు అనే యువకుడు ఉరేసుకుని ఆస్పత్రి ఆవరణలో మృతి చెందాడు. జిల్లాలోని జుక్కల్ మండలం మాహమ్మదా బాద్ గ్రామానికి చెందిన పానుగంటి సాయిలుకు కొద్ది నెలల క్రితం వివాహం జరిగింది. భార్య గర్భవతి కావడం, భార్యకు పురిటి నొప్పులు రావడంతో డెలివరీ కోసం ఆస్పత్రికి తీసుకొచ్చాడు. మరికొద్ది గంటల్లో తమకు బాబో, పాపో పుట్టబోతున్నారని ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ వారి ఆనందం ఎంతో సేపు నిలవలేదు. డెలివరీ తర్వాత వైద్యులు చెప్పిన విషయంతో సాయిలు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సాయిలు భార్యకు పండంటి మగ బిడ్డ జన్మించాడు. దీంతో కుటుంబసభ్యులతో పాటు సాయిల ఆనందం అంతా ఇంతా కాదు. కానీ బాబు పుట్టిన వెంటనే అనారోగ్య సమస్యతో మరణించాడు. ఈ విషయాన్ని సాయిలుకు చెప్పారు ఆస్పత్రి సిబ్బంది. పుట్టిన బిడ్డను చూడాలని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న యువకుడికి కుమారుడి మరణవార్త విని చలించిపోయాడు. తీవ్ర మనస్థాపానికి గురైన సదరు యువకుడు ఆస్పత్రి ఆవరణలోనే ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. విషయం తెలిసిన భార్య తీవ్రంగా విలపించింది. ఓ వైపు అప్పుడే పుట్టిన బిడ్డ, మరోవైపు కట్టుకున్న భర్త ఇలా బలవన్మరణం చెందడంతో ఆ భార్య బాధ వర్ణణాతీతం. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాయిలు మృతితో మహమ్మదాబాద్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## హామీల అమలును ప్రజలకు వివరించండి

- పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి, జూన్13 (జనంసాక్షి) :** ఏడాది పాలనలో సాధించిన విజయాలపై ప్రజల్లోకి చేరవేయాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబుసూచించారు. ఈనెల 23 నుంచి పార్టీ నేతలు ప్రజల్లోకి వెళ్లి.. అమలు చేసిన ప్రతి హామీని వివరించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశంచేశారు. మంత్రులు, ఎంపీలు, పార్టీ ముఖ్యనేతలతో సీఎం చంద్రబాబు శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏడాది పాలన విజయాలను, సూపర్-6 హామీలు దాదాపు అమలు చేశామనేది బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అమలు చేసిన ప్రతి హామీని ప్రజలకు వివరించాలి. చేసిన మంచిని చెప్పుకోవడంలో విఫలం కాకూడదు. పార్టీ సంస్థాగత కమిటీలు త్వరితగతిన పూర్తి చేయాలి. యోగాంధ్ర ప్రభుత్వం కార్యక్రమమైనా.. పార్టీ నేతలూ భాగస్వాములై విజయవంతం చేయాలి. ఇప్పటి వరకు 2 కోట్ల మంది యోగాంధ్రలో రిజిస్టర్ చేసుకున్నారు. ఆర్కే బీచ్ నుంచి భోగాపూరం వరకు అతిపెద్ద కార్యక్రమం నిర్వహించబోతున్నాం'అని సీఎం తెలిపారు. ఈ నెల 16న సీఎం విశాఖకు వెళ్లనున్నారు. అక్కడ యోగాంధ్ర నిర్వహణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.


# స్వదేశీ ఆవిష్కరణ శక్తికి ఆపరేషన్ సింధూర్ ఓ ఉదాహరణ

- ఫిక్కీ నేషనల్ డిఫెన్స్, హెూమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కమిటీ కో చైర్, జెన్ టెక్నాలజీస్ సీఎండీ అశోక్ అట్లూరి



**హైదరాబాద్, జూన్ 13 (జనంసాక్షి) :** స్వదేశీ ఆవిష్కరణ శక్తికి ఆపరేషన్ సింధూర్ ఓ ఉదాహరణ అని ఫిక్కీ నేషనల్ డిఫెన్స్, హెూమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కమిటీ కో చైర్, జెన్ టెక్నాలజీస్ సీఎండీ అశోక్ అట్లూరి తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను శక్తివంతం చేయడమే లక్ష్యంగా భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ) ఆధ్వర్యంలో బేగంపేటలోని హెూటల్ వివాంతా బై తాజ్‌లో ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక 'ఎంఎస్ఎంఈ ఎక్సలరేట్ 2025'ను జెన్ టెక్నాలజీస్ సీఎండీ అశోక్ అట్లూరి, ఎన్ఎస్ఐసీ జోనల్ హెడ్, జీఎం వీ సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ అట్లూరి మాట్లాడుతూ మన దేశంలో తయారైన డ్రోన్లు, డిటెక్టర్లు, జామర్లు, రాడార్లతో చైనా డ్రోన్లను సమర్థంగా ఎదుర్కొన్నామని చెప్పారు. ఆర్ అండ్ డీ అనేది ఒక వృథా ఖర్చు కాదన్నారు. ఇది అవసరమన్నారు. ఎంఎస్ఎంఈలు ఎంత బిజీగా ఉన్నా, పరిశోధనలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సరైన దిశను గుర్తించి దానిపై దృష్టి పెట్టితే విప్లవాత్మక మార్పులు సాధ్యమన్నారు. భారతదేశం అంతర్జాతీయంగా ముందంజలో నిలవాలంటే లోకల్ మార్కెట్లకే కాకుండా, ప్రపంచ మార్కెట్ల కోసం కూడా ఆవిష్కరణలు చేయాలన్నారు. అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేయడం ద్వారా దీర్ఘకాలిక విజయాలను సాధించవచ్చన్నారు. ఆర్ అండ్ డీ మన దేశాన్ని గ్లోబల్ నాయకత్వం వైపు తీసుకెళుతుందన్నారు. ఇకపై భారతదేశంలో పెట్టుబడి పెద్ద అడ్డంకి కాదన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఐసీ జోనల్ హెడ్, జనరల్ మేనేజర్ వీ సురేష్ బాబు మాట్లాడుతూ నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ) ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉన్న ఐఎస్ఓ సర్టిఫైడ్ సంస్థ అన్నారు. ఈ సందర్భంగా ఫిక్కీ తెలంగాణ డిఫెన్స్ %ఱ% ఏరోస్పేస్ కమిటీ చైర్మన్ పీ రాధాకిషోర్ భారత ప్రభుత్వం ఎంఎస్ఎంఈల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా ఫిక్కీ తెలంగాణ రాష్ట్ర మండలి చైర్మన్ వీవీ రామరాజు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు భారత ఆర్థిక వ్యవస్థకు రక్తనాళాల వంటివన్నారు. అవి దేశ జీడీపీలో దాదాపు 30 శాతం వాటా కలిగి ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా దీప్తి గడ్డం మాట్లాడుతూ దేశ జీడీపీలో 30 శాతానికి పైగా వాటాతో 10 కోట్ల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలు మన ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాయన్నారు.

## ఐఈఆర్‌పీలకు ఉద్యోగభద్రత కల్పించాలి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 20 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో నమోదైయిన 74,423 మంది దివ్యాంగ విద్యార్థులకు విద్యా బోధన చేస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సుప్రీమ్ కోర్టు తీర్పు తేదీ : మార్చ్.07.2025 రోజున ఇచ్చిన ఉత్తర్వులను పరిగణలోకి తీసుకొని సాధ్యం ఉన్నంత తొందరగా స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేక ఉపాధ్యాయులు అయిన ఐఈఆర్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సిఎంను కలిసిన కొత్త మంత్రులు

- అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిల కృతజ్ఞతలు

**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :** మాదిగ సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు సిఎం రేవంత్‌ను కలిసిన పలువురు కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఆ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవలి మంత్రివర్గ విస్తరణలో అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకు చోటు దక్కింది. అలాగే శాఖలను కూడా కేటాయించారు.



# సిఎం రేవంత్‌ను కలిసిన సిపిఆర్‌వో మల్సూర్

**హైదరాబాద్, జూన్13 (జనంసాక్షి) :** సిఎం రేవంత్ రెడ్డికి కొత్తగా సీపీఆర్వో గా గుర్రం మల్సూర్ నియమితులయ్యారు. గతంలో అనేక కీలక పదవులు నిర్వహించిన మల్సూర్ నాటి కేంద్రమంత్రి వేణుగోపాలాచారి పిఎస్‌గా కూడా పని చేశారు. తనను సిపిఆర్‌వోగా నియమించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మల్సూర్‌ను అభినందించారు. ఇప్పటి వరకు వరకు సిపిఆర్‌వోగా పనిచేసిన అయోధ్యారెడ్డి సమాచార కమిషనర్‌గా నియమితులయ్యారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370